


ఈ సంచికతోపాటు 12 పేజీల **లైఫ్** సప్లిమెంట్ అందుకోండి

ప్రభాత
వెలుగు
09.01.2019
www.v6velugu.com
బుధవారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 324 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL



పెద్ద కులాల కోటాకు లోక్‌సభ సై



124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆమోదం

ఎన్నికల గిమ్మిక్కు అంటూనే మద్దతిచ్చిన ప్రతిపక్షాలు

నేడు రాజ్యసభ ముందుకు రిజర్వేషన్ల బిల్లు

దేశ చరిత్రలోనే మైలురాయి: ప్రధాని మోడీ

దేశ రిజర్వేషన్ల చరిత్రలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. పెద్ద కులాల్లోని పేదలకు 10 శాతం కోటాను ప్రతిపాదిస్తూ కేంద్రం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. సుదీర్ఘ చర్చ తర్వాత మంగళవారం రాత్రి 10 గంటలకు నిర్వహించిన ఓటింగ్‌లో బిల్లు గట్టెక్కింది. 323 మంది సభ్యులు మద్దతు తెలపగా.. ముగ్గురు వ్యతిరేకించారు. కాంగ్రెస్, తృణమూల్, ఎస్పీ, ఎన్సీపీ, టీఆర్ఎస్, టీడీపీ తదితర పార్టీలు దన్నుగా నిలవడంతో బిల్లు సునాయాసంగా నెగ్గింది. అన్నాడీఎంకే వాకౌట్ చేయగా ఎంఐఎం బిల్లుకు వ్యతిరేకంగా ఓటేసింది. అనంతరం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. బుధవారం ఈ బిల్లు రాజ్యసభ ముందుకు రానుంది.

03

ఇప్పటికి.. ఈ కోటా కరెక్టే!
రాష్ట్ర తొలి ఏజీ కె.రామకృష్ణారెడ్డి 08

ఇల్లు, ప్లాటు, విల్లా.. దేనికైనా..



షాన్‌దార్ హైదరాబాద్

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ అంతా గ్రేటర్ చుట్టే



ముంబై, ఢిల్లీ, బెంగళూరు సహా దేశంలోని బడా సంస్థల చూపు ఇటే

కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్‌లో మెట్రో నగరాలన్నింటిలో టాప్

మంచి వాతావరణం, స్థిరమైన సర్కారు, ఉత్తమ మౌలిక సదుపాయాలు..

ఏడాదిలో రెట్టింపైన ధరలు.. 15 శాతం పెరిగిన సేల్స్

లగ్జరీ విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఎక్కువగా పెట్టుబడులు

రియల్టీ జోరు మరింతగా ఉంటుందన్న నైట్‌ఫ్రాంక్ రిపోర్ట్

బ్యాంకుల్లో డబ్బులు పెట్టే పరిస్థితి లేదు.. షేర్ మార్కెట్‌లో పెడదామంటే ఎప్పుడు కుప్పకూలుతుందో తెలీదు. బంగారం కొందామంటే పెద్దగా లాభం కనిపించడం లేదు.. అందుకే అందరి చూపూ రియల్ ఎస్టేట్‌పై పడింది. రీసేల్ వాల్యూ ఉన్న ఓపెన్ ప్లాట్లు, విల్లాల కొనుగోలుపై ఆసక్తిచూపుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. మరి ఎక్కడ కొంటే బెటర్, త్వరగా రేటు పెరిగేదెక్కడ అంటే మాత్రం.. అందరిచూపూ హైదరాబాద్‌వైపే. ఈ మహానగరం శివారు ప్రాంతాలన్నీ రియల్ ఇన్వెస్ట్‌మెంట్లకు అడ్డాగా మారాయి. మొత్తంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం దూసుకుపోతోంది. కమర్షియల్ స్పేస్‌లో అయితే దేశంలోని మెట్రోనగరాలన్నింటినీ దాటేసింది. రెసిడెన్షియల్ ప్రాజెక్టుల్లో అత్యధిక వృద్ధి నమోదు చేసుకుంది.

02

టీఆర్ఎస్ సర్కారుతో బూమ్

రాష్ట్రంలో కొద్దినెలలుగా రియల్ రంగం యాక్టివ్‌గా లేదు. అమ్మకాలు కూడా కొద్దిగా తగ్గాయి. అయితే కేసీఆర్ సారథ్యంలోని టీఆర్ఎస్ సర్కారు తిరిగి అధికారంలోకి రావడంతో రియల్ బూమ్ మళ్లీ ఎగిసిపడుతోంది. గత 25 రోజుల్లోనే పాత ప్రాజెక్టులు యాక్టివ్‌గా మారాయి. కొత్త ప్రాజెక్టులు మొదలవుతున్నాయి. రీజినల్ రింగ్‌రోడ్ వస్తుందని, 111 జీవో ఎత్తివేస్తామన్న హామీ నెరవేర్చుతామని ప్రభుత్వం చెప్పడం కూడా రియాల్టీకి ఊతమిచ్చింది.

'సీతారామ'కు పర్యావరణ అనుమతులు

ప్రాజెక్టు సీఈకి కేంద్ర పర్యావరణ శాఖ లేఖ

ఈఏసీ సిఫార్సు మేరకు అనుమతులు జారీ

సీఎం కేసీఆర్ హర్షం.. కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌కు కృతజ్ఞతలు

04



మోన్‌శాంటో బీటీ పేటెంట్‌కు సుప్రీం ఓకే

జెనెటికల్లీ మోడిఫైడ్ బీటీ కాటన్ మీద మోన్‌శాంటో పేటెంట్ చెల్లుతుందని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది.

10

వెన్‌కాబ్
(ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
87.00	87.00	87.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
87.00	87.00	86.00



మిర్యాలగూడ ముస్లిం మైనారిటీ బాలికల హాస్టల్‌లో గీజర్ ద్వారా వేడినీళ్లను పట్టుకుంటున్న విద్యార్థిని

మన గురుకులాలు మస్తున్నయ్

అద్దాల్లాంటి బిల్డింగ్‌లు.. అత్యుత్తమ టీచింగ్

- సైన్స్ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్‌లు
- మెనూ ప్రకారం హాస్టల్ భోజనం
- సకల సౌలతులతో కళకళ
- ఏటేటా పెరుగుతున్న డిమాండ్
- ప్రైవేటును వదిలి సర్కారీ రెసిడెన్షియల్ వైపు పరుగులు తీస్తున్న పేరెంట్స్


వెలుగు నెట్‌వర్క్:

కార్పొరేట్ కాలేజీలను తలదన్నేలా అద్దాల్లాంటి బిల్డింగ్‌లు.. క్లాస్‌లో అత్యాధునిక డిజిటల్ పాఠాలు.. క్వాలిఫైడ్ టీచర్లతో బోధన.. హాస్టళ్లలో రుచికరమైన భోజనం.. పడుకునేందుకు బెడ్లు.. స్నానానికి వేన్నీళ్లు.. ఇవన్నీ ఎక్కడో కాదు! మన తెలంగాణ గురుకులాల్లోని సౌలతులు!! ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు రాష్ట్ర సర్కారు నియోజకవర్గానికి ఒకటి చొప్పున తెచ్చిన ఈ గురుకులాలు ఆధునిక చదువులకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. సకల వసతులతో ఉత్తమమైన విద్య అందుతుండడంతో వీటికి మస్తు డిమాండ్ పెరుగుతున్నది. ఉన్నత చదువులు చదివిన పేరెంట్స్ సైతం తమ పిల్లల్ని ఈ రెసిడెన్షియల్ స్కూళ్లలో చేర్పించేందుకు ముందుకొస్తున్నారు. కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, క్లాస్‌రూములు, డిజిటల్ పాఠాలు, ప్లే గ్రౌండ్‌లు పిల్లల్ని ఆకట్టుకుంటున్నాయి. సన్నబియ్యం, నెలకు నాలుగుసార్లు చికెన్, రెండుసార్లు మటన్, రోజుకో గుడ్డు, నెయ్యి, కూరగాయలు, స్నాక్స్, పండ్లు ఇస్తున్నారు. పాఠశాల లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పిల్లల భద్రతకు భరోసా ఇస్తున్నారు. గతంలో వేలాది రూపాయలు పోసి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించిన తల్లిదండ్రులకు ఇవన్నీ ఇప్పుడు గురుకులాల్లో ఉచితంగా అందుతుండడంతో సంబురపడుతున్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో వసతులు, టీచింగ్‌పై 'వెలుగు' క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు ఏమాత్రం తీసిపోని విధంగా సర్కారీ గురుకులాలు నిలుస్తున్నట్టు ఇందులో తేలింది.

మిగతా 4లో

రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో కార్పొరేట్ భవనాన్ని తలపిస్తున్న తెలంగాణ గురుకుల పాఠశాల





అలోక్‌వర్మే సీబీఐ బాస్

కానీ.. కండిషన్స్ అప్లై

కేంద్రానికి సుప్రీంకోర్టు షాక్

లీవ్‌పై పంపే అధికారం కేంద్రానికి లేదన్న కోర్టు

అలోక్‌పై చర్యలకు సెలక్ట్ కమిటీ నిర్ణయం తీసుకోవాలి

వారం రోజుల్లోగా కమిటీ సమావేశం నిర్వహించాలి

విధాన నిర్ణయాలు తీసుకోవద్దని అలోక్‌కు కోర్టు ఆదేశం

05



బంద్ అంతంతే..

సార్వత్రిక సమ్మెకు మిశ్రమ స్పందన

రోడ్డెక్కిన కార్మికులు.. స్తంభించిన జనజీవనం

చాలా రాష్ట్రాల్లో డిపో దాటని బస్సులు

మూతపడ్డ స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసులు

ఇవాళ కూడా కొనసాగనున్న ఆందోళనలు

రాష్ట్రంలో కనిపించని బంద్ ప్రభావం

05

డైనమిక్ హైదరాబాద్

ప్రపంచ డైనమిక్ సిటీల్లో సెకండ్ ప్లేస్ • కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్, వెలుగు:

హైదరాబాద్ సిగలో మరో కీర్తి కిరీటం చేరింది. మోస్ట్ డైనమిక్ సిటీల్లో రెండో ప్లేస్ దక్కించుకుంది. జేఎల్ఎల్ సిటీ మొమెంటమ్ ఇండెక్స్ ఇచ్చిన రేటింగుల్లో హైదరాబాద్ ఈ ఘనతను అందుకుంది. ఆ విషయాన్ని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. హైదరాబాద్‌కు మరోగర్వకారణమంటూ ట్వీట్ చేశారు. ఈ జాబితాలో మన దేశం నుంచి ఆరు నగరాలు టాప్ 20లో చోటు దక్కించుకోవడం విశేషం. బెంగళూరు యథావిధిగా మొదటి స్థానంలో నిలిచింది. దేశ రాజధాని ఢిల్లీ నాలుగో ప్లేస్‌లో, పుణె 5. చెన్నై 7, కోల్‌కతా 15వ స్థానంలో నిలిచాయి. అంతేకాదు.. ఆర్థికంగా వేగంగా వృద్ధి చెందుతున్న నగరాల జాబితాలోనూ 8.47 శాతం వృద్ధితో హైదరాబాద్ నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. 9.17 శాతం వృద్ధితో సూరత్ మొదటి స్థానంలో ఉండగా, 8.58 శాతం వృద్ధితో ఆగ్రా రెండో ప్లేస్‌లో, 8.50 శాతంతో బెంగళూరు మూడో స్థానంలో నిలిచాయి.

సాయికృష్ణకు అండగా ఉంటాం: కేటీఆర్

హైదరాబాద్, వెలుగు:

అమెరికాలో దుండగుల కాల్పుల్లో గాయపడి చికిత్స పొందుతున్న మహబూబాబాద్ యువకుడు సాయికృష్ణకు అండగా ఉంటామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. సాయికృష్ణకు తక్షణ వైద్య సాయం కోసం అమెరికాలోని కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయానికి తమ ఎన్నారై శాఖ అధికారులు సమాచారమిచ్చారని తెలిపారు. అవసరమైతే విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్‌తోనూ మాట్లాడుతామన్నారు. ఎంపీ సీతారాం నాయక్ ఇప్పటికే సుష్మాస్వరాజ్‌ను కలిశారని చెప్పారు. మంగళవారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో కేటీఆర్‌ను సాయికృష్ణ తల్లిదండ్రులు కలిశారు. వారు వెంటనే అమెరికా వెళ్లేందుకు అన్నిరకాల సాయం చేస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులు అమెరికా వెళ్లేందుకు తక్షణం ఆర్థిక సాయం చేయాలని సీఎం కార్యాలయ స్పెషల్ సెక్రెటరీ రాజశేఖర్‌రెడ్డిని కోరారు. అత్యవసర


సాయి కృష్ణ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న కేటీఆర్

వీసాలు జారీ చేయాలని హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ కేథరిన్ హెడ్డాతోనూ కేటీఆర్ ఫోన్లో మాట్లాడారు. కష్టకాలంలో ఆసరాగా నిలబడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి సాయికృష్ణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రొటెం స్పీకర్‌గా అహ్మద్‌ఖాన్

నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర రెండో శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం శాసనసభ్యుడు ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌ను నియమిస్తూ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 180 క్లాజ్ (1) కింద ఆయనకు స్పీకర్‌గా అధికారాలిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 188 ప్రకారం శాసనసభ్యులతో ప్రమాణం చేయించే అధికారాన్ని ప్రొటెం స్పీకర్‌కు కట్టబెట్టారు. 178వ ఆర్టికల్ కింద కొత్త స్పీకర్‌ను ఎన్నుకునే వరకుముంతాజ్ అహ్మద్‌ఖాన్ స్పీకర్‌గా కొనసాగుతారు. వరుసగా ఆరోసారి ఎమ్మెల్యేగా ఖాన్ ఎన్నికయ్యారు. ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌ను శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం చార్మినార్‌లోని ముంతాజ్ అహ్మద్‌ఖాన్ నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.



మాజీ ప్రధాని మన్మోహన్‌తో ఎంపీ సంతోష్ భేటీ

హైదరాబాద్, వెలుగు: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ కలిశారు. మంగళవారం పార్లమెంట్ ఆవరణలో కలిసిన సంతోష్‌కు మన్మోహన్ అభినందనలు తెలిపారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఘన విజయం సాధించడం సంతోషకరమన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని, అభినందనలు తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీలు బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్ ఉన్నారు.

ఇల్లు, ప్లాటు, విల్లా దేనికైనా..

షాన్ హైదరాబాద్

హైదరాబాద్, వెలుగు:

మంచి వాతావరణం, రాజకీయ స్థిరత్వం ఉన్న హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా పేరున్న ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, మొబైల్ ఫోన్ల తయారీ కంపెనీలు నగరాన్ని అడ్డాగా చేసుకుంటున్నాయి. కొత్త కంపెనీల రాకకుతోడు ఇప్పటికే ఉన్న కంపెనీలు విస్తరణ చేపడుతుండటంతో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ భారీగా పెరుగుతోంది. 2018లో ఆరున్నర లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ వచ్చిందని, ముందు ముందు ఇది మరింతగా పెరుగుతుందని రియల్‌ఎస్టేట్ నిపుణులు అంటున్నారు.

నివాసానికి సూపర్

రెసిడెన్షియల్ ప్రాజెక్టుల విషయానికి వస్తే.. గత ఏడాది కాలంలో 25 నుంచి 30 శాతం వృద్ధి సాధించడం గమనార్హం. ప్రాజెక్టులు పూర్తవకముందే ఫ్లాట్లన్నీ హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయని బిల్డర్లు చెబుతున్నారు. గత మూడేళ్లుగా బెస్ట్ లివింగ్ సిటీగా నిలిచిన హైదరాబాద్‌లో సెటిల్ అవ్వాలనుకుంటున్నవారి సంఖ్య పెరుగుతోంది. మౌలిక వసతుల కల్పన, కనెక్టివిటీ బాగుండటం దీనికి తోడ్పడుతోంది. ముఖ్యంగా పెద్ద సంఖ్యలో ఐటీ, ఇతర పెద్ద కంపెనీలు ఏర్పాటవుతుండటంతో వాటిలో పనిచేసేవారు ఇక్కడ ఇళ్లు, ఫ్లాట్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇదే సమయంలో హైదరాబాద్‌లో జీవన ప్రమాణాలు పెరుగుతుండటంతో మధ్య తరగతి వారు సొంతింటి కొనుగోళ్లపై దృష్టి పెడుతున్నారు.

పెట్టుబడి కోసం కూడా..

మిడిల్ క్లాస్ వారు భవిష్యత్తు కోసం ఎంతో కొంత డబ్బును సేవ్ చేసుకుంటారు. ఆ మొత్తాన్ని మంచి లాభం వచ్చే చోట పెట్టుబడి పెట్టాలనుకుంటారు. ఇప్పటివరకు డబ్బును బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసేవారు. కానీ వాటిపై వడ్డీలు తగ్గిపోయాయి. దానికితోడు నోట్లరద్దు, కఠిన నిబంధనలతో కావాల్సినప్పుడు సొమ్ము వెనక్కి తీసుకోలేమేమో అన్న భయం నెలకొంది. షేర్ మార్కెట్లో పెట్టుబడి పెడదామనుకున్నా తేడా వస్తే డబ్బంతా పోగొట్టుకోవాల్సి వస్తుందన్న ఆందోళన. అందుకే రియల్‌ఎస్టేట్ వైపు మొగ్గుచూపుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఖాళీ స్థలాలో, ఫ్లాట్లో కొని పెట్టుకుంటే.. మంచి లాభం వస్తుందన్న ఆలోచన



ఎక్కువైంది. ఇలా స్థిరాస్తులకు డిమాండ్ పెరగడంతో.. రాష్ట్రానికి చెందిన కంపెనీలే కాకుండా బెంగళూరు, ముంబై, ఢిల్లీకి చెందిన కొన్ని బడా సంస్థలు, ఇన్వెస్టర్లు హైదరాబాద్ వైపు దృష్టి సారిస్తున్నారు. ఏపీలో రియల్ ఎస్టేట్ కాస్త మందగించడంతో అక్కడ నుంచి వచ్చి హైదరాబాద్‌లో ఇన్వెస్ట్ చేసేవారి సంఖ్య కూడా పెరిగింది.

'లగ్జరీ'పెరుగుతోంది

హైదరాబాద్ నగరంతోపాటు శివారు ప్రాంతాల్లోనూ లగ్జరీ విల్లాలు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. ఎగువ మధ్య తరగతి వారు ఖర్చు ఎక్కువైనా సరే.. 24 గంటల సెక్యూరిటీ, క్లబ్ హౌజ్, స్విమ్మింగ్ పూల్, స్పోర్ట్స్ ఏరియా సహా అన్ని సౌకర్యాలు ఉండే విల్లాలకే జై కొడుతున్నారు. కోకాపేట, పుప్పాలగూడ, నార్సింగి లాంటి ఏరియాల్లో లగ్జరీ విల్లాల ప్రాజెక్టులు ఎక్కువగా వస్తున్నాయి. ప్రాంతం, సౌకర్యాలను బట్టి ఈ విల్లాలు రూ.3 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ధర పలుకుతున్నాయి. ఇదేకోవలో విల్లాల స్థాయిలో డబ్బులు పెట్టలేనివారు లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు కొనుక్కుంటున్నారు. గచ్చిబౌలి, హైటెక్ సిటీ వంటి ఏరియాల్లో అలాంటి లగ్జరీ ఫ్లాట్లు ఎక్కువగా ఉన్నాయి.

ఒక్క ఏడాదిలో 1,697 ప్రాజెక్టులు

- హైదరాబాద్‌లో రియాల్టీ జోరుపై నైట్‌ఫ్రాంక్ రిపోర్ట్

హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ భారీగా వృద్ధి చెందుతోందని నైట్ ఫ్రాంక్ సంస్థ వెల్లడించింది. ఆఫీస్ స్పేస్ విభాగంతో పాటు రెసిడెన్షియల్ సెక్టార్‌లోనూ లావాదేవీలు గణనీయంగా పెరిగాయని తమ అర్ధ వార్షిక నివేదికలో తెలిపింది. 2018లో 70 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లావాదేవీలు జరిగాయని, గతేడాదితో పోల్చితే ఇది 19% అధికమని వివరించింది. 2017 సెకండాఫ్‌తో పోలిస్తే 2018 సెకండాఫ్‌లో కోవర్కింగ్ స్పేస్ 17% నుంచి 27% కి పెరిగిందని తెలిపింది. 2017 జూన్-డిసెంబర్ మధ్య 940 కొత్త రెసిడెన్షియల్ ప్రాజెక్టులు లాంచ్ అవగా.. 2018లో అదే కాలానికి 1,697 ప్రాజెక్టులు వచ్చాయని పేర్కొంది. మొత్తం ఇళ్లలో.. 2018లో రూ.50 లక్షల నుండి రూ.కోటి వరకు ధర ఉన్న ఇళ్లు 50 శాతం, రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల మధ్య ధర ఉన్న ఇళ్లు 43% గా ఉన్నట్టు వివరించింది. వెస్టర్న్ హైదరాబాద్‌లో రెసిడెన్షియల్ అమ్మకాలు 18% పెరిగాయని తెలిపింది. 2017 రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను డీమానిటైజేషన్, రెరా, జీఎస్టీ వంటివి ఒకదాని తరువాత ఒకటి ప్రభావితం చేశాయని పేర్కొంది. అయినా దేశంలోని అన్ని ప్రాంతాలతో పోలిస్తే హైదరాబాద్ మంచి వృద్ధి కనబరిచిందని వెల్లడించింది. మెట్రో రైలు అన్నివైపులా విస్తరిస్తే శివార్లలో మరింత డిమాండ్ పెరుగుతుందని అభిప్రాయపడింది.

"రియల్ ఎస్టేట్‌లో ఇన్వెస్ట్ చేసేవారు ముఖ్యంగా రెసిడెన్షియల్, కమర్షియల్ బిల్డింగ్స్‌తో పాటు ఓపెన్ ప్లాట్లను కొంటున్నారు. వారి పెట్టుబడి రెండు మూడేళ్లలో డబుల్ అవుతోంది. టైమ్ చూసుకుని వాటిని అమ్మేసి, తక్కువ ధర ఉన్న మరో చోట కొంటున్నారు. అందరూ ఎక్కువగా ఇన్వెస్ట్ చేసేది ఓపెన్ ప్లాట్లలోనే.. హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాలు, జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాల్లో స్థిరాస్తిని బెస్ట్ ఆప్షన్ గా భావిస్తున్నారు. రీసేల్ వాల్యూ ఉన్న ఓపెన్ ప్లాట్లకు డిమాండ్ ఉంది. గతంలో ప్రైవేట్ ఇన్వెస్టర్లు ముంబై, బెంగళూరులో పెట్టుబడి పెట్టేవారు. ఇప్పుడు హైదరాబాద్ వైపు చూస్తున్నారు"

– శామ్సన్ ఆర్థర్,
నైట్ ఫ్రాంక్ కార్పొరేట్ సీనియర్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్ మేనేజర్

సుస్థిర ప్రభుత్వం ఉన్నందునే..

రాష్ట్ర ప్రభుత్వం 70 వేల కోట్లతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ చేయనున్నామని తెలిపింది. దాంతో రీసెంట్‌గా రియల్ ఎస్టేట్ జోరందుకుంది. స్థిరమైన ప్రభుత్వం ఉండటంతో బిల్డర్లలో కాన్ఫిడెన్స్ పెరిగింది. పెట్టుబడులు పెట్టేవారంతా హైదరాబాద్ వైపు చూస్తున్నారు. ప్రాజెక్టులు పెరుగుతున్నాయి.

– రామ్‌రెడ్డి,
క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్

త్వరగా అనుమతులిస్తున్నాం

ఎలక్షన్స్ తర్వాత హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ మరింత పుంజుకుంది. సదుపాయాలు బాగున్నాయి కాబట్టి రియల్ ఎస్టేట్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. అన్ని ప్రాజెక్టులకు సత్వరంగా అనుమతులు ఇస్తున్నాం. మిగతా సిటీలతో పోలిస్తే హైదరాబాదే బెస్ట్ ఆప్షన్.

– దానకిశోర్,
జీహెచ్ఎంసీ కమిషనర్

శివారు ప్రాంతాల్లో శరవేగంగా..

హైదరాబాద్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడం, శంషాబాద్ విమానాశ్రయం, ఓఆర్ఆర్, రీజినల్ రింగ్ రోడ్ వంటివి వాటితో నగరం చుట్టుపక్కల 60 కి.మి. మేర భూముల ధరలు భారీగా పెరుగుతున్నాయి. కొన్ని చోట్ల ఏడాదిలోనే ధరలు రెట్టింపుకావడం గమనార్హం. మేడ్చల్, కొంపల్లి, పటాన్ చెరు, కోకాపేట్, నార్సింగి, ఆదిభట్ల, హయత్ నగర్, బొంగుళూరు లాంటి ప్రాంతాల్లో ఇప్పటికే వందలాది ఓపెన్ వెంచర్లు వెలిశాయి. ప్లాట్ల బిజినెస్ జోరుగా సాగుతోంది. ఇక యాదాద్రి అభివృద్ధి పనులతో ఆ ఏరియా భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు సుమారు 45 కిలోమీటర్ల మేర నేషనల్ హైవేకి ఇరువైపులా వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. శంషాబాద్ ప్రాంతంలో ఎయిర్‌పోర్టుతోపాటు లాజిస్టిక్స్ పార్క్ రావడం, పలు కంపెనీలు తమ యూనిట్లు ఏర్పాటు చేస్తుండటంతో ఈ ప్రాంతం హాట్ కేక్‌లా మారింది. అటు ఐటీ ఏరియాకు దగ్గరగా, ముంబై హైవేకి పక్కన ఉన్న బీరంగూడలోని రెసిడెన్షియల్ ప్రాజెక్టులకు, ఫార్మాసిటీకి దగ్గరగా ఉన్న పెద్ద గోల్కొండ ప్రాంతంలోనూ భూమికి డిమాండ్ పెరుగుతోంది.

'నామినేటెడ్' భర్తీ షురూ

- సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి
- అనుచరుడికి తొలి పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్
- సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, వెలుగు:

రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీకి తెరలేచింది. టీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాన అనుచరుడికి తొలి నామినేటెడ్ పదవి దక్కింది. రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన నియామక ఫైల్‌పై సీఎం కేసీఆర్ సంతకం చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరకు సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న పెద్ది సుదర్శన్‌రెడ్డి వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ముందే ఆయన కార్పొరేషన్ పదవికి రాజీనామా చేశారు. సిద్దిపేట రూరల్ జిల్లా ఇర్కోడు గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి మొదటి నుంచి కేసీఆర్ అనుచరుడిగా ఉన్నారు. టీఆర్ఎస్ ఏర్పాటుకు ముందు టీడీపీ నాయకుడిగా కేసీఆర్ వెంటే తిరిగారు. సొంతగ్రామానికి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. వరుసగా మూడుసార్లు సిద్దిపేట మార్కెట్ చైర్మన్‌గా పనిచేశారు. కేసీఆర్ టీడీపీ వీడి టీఆర్ఎస్ పెట్టిన అనంతరం జరిగిన 2001 ఉప ఎన్నికల్లో కేసీఆర్‌పై టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. అనంతరం టీఆర్ఎస్‌లో చేరి కేసీఆర్‌కు వెన్నుదన్నుగా ఉంటున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా సేవలందించారు. తనకు సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినందుకు శ్రీనివాస్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


మంగళవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీనివాస్ రెడ్డి

మారెడ్డికి పలువురి అభినందన

సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, కోనేరు కోనప్ప, దివాకర్‌రావు, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, టీఆర్ఎస్ నాయకుడు కల్వకుంట్ల వంశీధర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.

మంగళవారం సాయంత్రం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. తనపై విశ్వాసంతో పదవి కట్టబెట్టిన సీఎం కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు.

త్వరలో మరిన్ని ఖాళీల భర్తీ

రాష్ట్రంలో మొత్తం 46 కార్పొరేషన్‌లు ఉండగా వాటిలో పలు కార్పొరేషన్ల చైర్మన్ పదవులు ఖాళీగా ఉన్నాయి. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బుడాన్ బేగ్, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.నర్సారెడ్డి ఎన్నికలకు ముందు పార్టీ వీడారు. మిషన్ భగీరథ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, టీఎస్ గిరిజన ఫెడరేషన్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేలుగా పోటీ చేసే ముందు పదవులకు రాజీనామా చేశారు. ఇందులో ఒక పదవిని భర్తీ చేశారు. మిగతా కార్పొరేషన్లకు త్వరలోనే చైర్మన్లను నియమిస్తారని సమాచారం. కొందరికి తిరిగి అవకాశం కల్పించనుండగా, కొందరిని మార్చి పార్టీ కోసం పనిచేసిన వారికి ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది.


క్యూనెట్ మోసాలను మీడియాకు వివరిస్తున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్

క్యూనెట్ మాయ

- 58 మంది అరెస్ట్.. రూ.2.7 కోట్లు స్వాధీనం
- దేశవ్యాప్తంగా 5 లక్షల మంది బాధితులు
- వేల కోట్లకు ముంచేసిందంటున్న సిటీ పోలీసులు
- హాంకాంగ్ కేంద్రంగా దందా

హైదరాబాద్, వెలుగు:

గోల్డ్ క్వెస్ట్ అంటూ ఇండియాలో ఎంటరైంది.. ఆ తర్వాత క్వెస్ట్ కాయిన్స్ అంటూ వ్యాపారం చేసింది.. ఇప్పుడు విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ పేరుతో స్థిరపడింది.. గొలుసుకట్టు వ్యాపారంలో ఎన్నో రూపాలు, పేర్లు మార్చుకున్న క్యూనెట్ గొలుసుకట్టిది. 5 లక్షల మంది బాధితులు.. వేల కోట్ల రూపాయల మోసం దానిది. తక్కువ కాలంలో ఎక్కువ సంపాదించొచ్చంటూ.. ఐటీ ఉద్యోగులు, నిరుద్యోగులు, బీటెక్ పూర్తయినోళ్లకు ఆశలు పుట్టించి మల్టీలెవెల్ మార్కెటింగ్‌లో చేర్పించింది. ఆన్‌లైన్‌లో వ్యాపారం పేరిట మోసం చేస్తూ డబ్బులు వసూలు చేసింది. హాంకాంగ్ కేంద్రంగా సాగుతున్న ఈ క్యూనెట్ మోసాలను సైబరాబాద్ పోలీసులు రట్టు చేశారు.

58 మంది అరెస్ట్

సంస్థ వల్ల దేశవ్యాప్తంగా 5 లక్షల మంది మోసపోయారని పోలీసులు చెబుతున్నారు. వేల కోట్ల రూపాయలు ముంచేశారని అంటున్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే వందలాది మందిని కోట్ల రూపాయలకు ముంచారు. ప్రైజ్ మనీ, కమీషన్ల పేరుతో జనాన్ని ట్రాప్ చేస్తోంది. మోసపోయామని తెలుసుకున్నాక సిటీలోని మాదాపూర్, అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్ సహా చాలా పోలీస్‌స్టేషన్లలో బాధితులు ఫిర్యాదు చేశారు. ఒక్క సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే 14 కేసులు నమోదైతే 58 మంది సంస్థ ఏజెంట్లను అరెస్ట్ చేసినట్టు సీపీ సజ్జనార్ తెలిపారు. దాదాపు వెయ్యి కోట్లకు పైగా వసూలు చేసి ఉంటుందని అంటున్నారు. అందులో 51మంది బెంగళూరు, ఢిల్లీ, ఏలూరుకు చెందినోళ్లున్నారు. బెంగళూరులోని క్యూనెట్ గోడౌన్‌ను సీజ్ చేసినట్టు చెప్పారు. ఏజెంట్ల బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేశామన్నారు. రూ.2.7 కోట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కమిషనరేట్‌లోని ఆర్థిక నేర విభాగం ఆధ్వర్యంలో కేసును దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. బాధితులు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. ఇలాంటి గొలుసుకట్టు వ్యాపారాలను నమ్మొద్దని సూచించారు.

ఎన్నెన్నో రూపాలు

క్యూనెట్ మల్టీలెవెల్ మార్కెటింగ్ 1998లో ప్రారంభమైంది. విజయ్ ఈశ్వర్, జోసెఫ్ బిస్మార్క్ అనే వ్యక్తులు దీనిని ప్రారంభించారు. దానికి అనుబంధ సంస్థే విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్. బెంగళూరులో పెట్టింది. విదేశాల్లో గొలుసుకట్టు వ్యాపారాలకు అనుమతి ఉన్నా మన దగ్గర మాత్రం లేదు. ఇలాంటి వ్యాపారాలు చట్ట ప్రకారం నేరం. 2001లో గోల్డ్ క్వెస్ట్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఇండియాలోకి ఎంటరైంది క్యూనెట్. 2004లో క్వెస్ట్ కాయిన్స్ అంటూ మరో వ్యాపారం స్టార్ట్ చేసింది. 2011 నుంచి విహాన్ సంస్థ పేరిట వివిధ రకాల స్కీమ్స్, కాయిన్స్ పేరుతో గొలుసుకట్టు వ్యాపారానికి తెరదీసి కొన్ని కోట్లు కొల్లగొట్టింది. చాలా తక్కువ సమయంలో డబ్బును రెట్టింపు చేస్తామంటూ ప్యాకేజీల రూపంలో ట్రాప్ చేసింది. ఒక్కొక్కరి దగ్గర 50 వేల నుంచి3 లక్షల వరకు వసూలు చేసినట్టు చెబుతున్నారు. గతంలోనే ఈ క్యూనెట్ వ్యవహారాలపై తెలంగాణ, ఏపీ సహా దేశ వ్యాప్తంగా కేసులు నమోదయ్యాయి. క్యూనెట్ ఇండియా చైర్మన్ మైకేల్ ఫెరారీని హైదరాబాద్ పోలీసులు 2016లో అరెస్ట్ చేశారు. అయినా కూడా గుట్టుచప్పుడు కాకుండా క్యూనెట్ వ్యాపారం కొనసాగిస్తోంది.

ఎన్విరాన్మెంట్ పరీక్ష ఈ నెల 31న

హైదరాబాద్, వెలుగు: ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు ఈనెల 30న జరగాల్సిన ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ ఎగ్జామ్‌ను 31కి వాయిదా వేసినట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్‌కుమార్ మంగళవారం ప్రకటించారు. ఈ నెల30న పంచాయతీ ఎన్నికలు ఉన్నందున పరీక్ష తేదీని మార్చామన్నారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు ఈ నెల 28న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష యథావిధిగా జరుగుతుందన్నారు.

'మహాకూటమి'పై మాకు టైమ్ కావాలి: నవీన్

న్యూఢిల్లీ: బీజేపీయేతర పార్టీల నాయకత్వంలోని మహాకూటమిలో చేరే విషయమై నిర్ణయం తీసుకోవడానికి మరికొంత సమయం కావాలని ఒడిశా ముఖ్యమంత్రి, బీజేడీ చీఫ్ నవీన్ పట్నాయక్ అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆలోచించి ఈవిషయమై నిర్ణయం తీసుకుంటామన్నారు. నవీన్ పట్నాయక్ నాయకత్వంలోని బీజేడీ ఇప్పటివరకు జాతీయ రాజకీయాలకు సంబంధించి బీజేపీ, కాంగ్రెస్ తో సమాన దూరంలో ఉంది.

'సర్వే'వి అర్థంలేని వ్యాఖ్యలు: మల్లు రవి


హైదరాబాద్, వెలుగు: సీఎం కేసీఆర్‌తో పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి కుమ్మక్కయ్యారంటూ సర్వే సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు అర్థంలేనివని పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. వాటిని పీసీసీ ఖండిస్తోందన్నారు. పంచాయతీ ఎన్నికల ముందు సీనియర్ నేత ఇలా మాట్లాడడం సరికాదన్నారు. సర్వే వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగించేలా ఉన్నాయని, ఉత్తమ్, కుంతియాల రాజీనామాల విషయం అధిష్టానం చూసుకుంటుందన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- టీఎన్జీవో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ సభలో హరీశ్‌రావు
- రాష్ట్ర అభివృద్ధికి వచ్చే ఐదేళ్లు ఎంతో కీలకమని వ్యాఖ్య

హైదరాబాద్, వెలుగు:

రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మెజారిటీ సీట్లు గెలిపించి కేసీఆర్ చేతిలో పెడదామని, అలా చేస్తే కేంద్రాన్ని శాసించే స్థాయికి చేరుతామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో టీఎన్జీవో నగర శాఖ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి హరీశ్‌రావు హాజరై మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి వచ్చే ఐదేళ్లు ఎంతో కీలకమన్నారు. 17 ఎంపీ సీట్లు గెలిస్తే కేంద్రం నుంచి నిధులు,



ప్రాజెక్టులు సాధించుకోవచ్చన్నారు. గత నాలుగేళ్లలో విభజన సమస్యలతో ఇబ్బంది పడ్డామన్నారు. ఉద్యోగుల సమస్యలు కొన్ని అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హరీశ్‌రావు హామీ ఇచ్చారు. వ్యవసాయ, విద్యుత్, మార్కెటింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్‌లలో రాష్ట్రానికి ఎన్నో అవార్డులు వచ్చాయని పేర్కొన్నారు. పాలనలో, పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని చెప్పారు. కార్యక్రమంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి, రేచల్, మామిళ్ల రాజేందర్, కస్తూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బుధవారం హైదరాబాద్
09.01.2019
www.v6velugu.com
ప్రభాత
వెలుగు
Follow:
v6velugu

కోటాకు ఓకే

124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ: అగ్రకులాల్లో 10 శాతం రిజర్వేషన్ల కోసం తెచ్చిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. రాజ్యాంగంలోని 15, 16 ఆర్టికల్స్‌కు సవరణలు ప్రతిపాదిస్తూ సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్ చంద్ గెహ్లాట్ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ చరిత్రాత్మక బిల్లుకు పార్టీలకు అతీతంగా మద్దతు పలకాలని కోరారు. అనంతరం బిల్లుపై దాదాపు ఐదు గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిగింది. అనంతరం ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలు, సవరణలు, విమర్శలకు గెహ్లాట్ సమాధానమిచ్చారు. ఆర్థిక ప్రాతిపదికన తెచ్చిన ఈ రిజర్వేషన్లకు సుప్రీంకోర్టు కూడా సమ్మతిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 15కు క్లాజ్(6), 16కు క్లాజ్(6) చేరుస్తున్నామని చెప్పారు. రెండేళ్ల క్రితం తమ ప్రభుత్వమే క్రిమీలేయర్ పరిమితిని రూ.6 లక్షల నుంచి 8లక్షలకు వరకు పెంచిందన్నారు. ''ఈబీసీ రిజర్వేషన్లు ప్రస్తుతం ఉన్న 50 శాతం కోటా పరిధిలోకి రావు. దానికి అదనంగా ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తాం. ఈ బిల్లుతో కులాలు, మతాలకు అతీతంగా ఈబీసీలందరికీ రిజర్వేషన్లు అందుతాయి. రిజర్వేషన్లకు అర్హత ధ్రువీకరణలు రాష్ట్రాల పరిధిలోనే ఉంటాయి. ఈ చట్టం కోర్టులో నిలబడుతుందా లేదా అనుమానాలు అక్కర్లేదు. వాటన్నింటినీ పక్కన పెట్టండి. సుప్రీంకోర్టు ఈ రిజర్వేషన్లకు తప్పకుండా ఒప్పుకుంటుందన్న నమ్మకం ఉంది'' అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ఎన్నికల ముందు బిల్లు తెచ్చిందన్న ప్రతిపక్షాల విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ''పేదల కోసమే పనిచేస్తామని 2014లో ప్రధానిగా పగ్గాలు చేపట్టే సమయంలోనే మోడీ చెప్పారు. సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ నినాదానికి అనుగుణంగానే రిజర్వేషన్లు తెస్తున్నాం. ఇది చరిత్రాత్మక నిర్ణయం'' అని చెప్పారు.

ఆ పార్టీలన్నీ మద్దతు ఇవ్వాలి

కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ మాట్లాడుతూ.. అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోలలో ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ కులాలకు రిజర్వేషన్ల అంశాన్ని చేర్చాయని, ఇప్పుడు ఆ పార్టీలన్నీ బిల్లుకు మద్దతు పలకాలన్నారు. ''కాంగ్రెస్ కూడా తన మేనిఫెస్టోలో దీన్ని చేర్చింది. ఇప్పుడు ఆ పార్టీ మాటపై నిలబడాలి. ఇది ఆ పార్టీకి టెస్టింగ్ టైం'' అని అన్నారు. ఈ రాజ్యాంగ సవరణ బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీల ఆమోదం అక్కర్లేదని, రాజ్యసభలో ఆమోదం పొందగానే అమల్లోకి వస్తుందని, తర్వాత రాష్ట్రపతి ఆమోదిస్తారని చెప్పారు. మొత్తానికి కాంగ్రెస్, బీఎస్పీ, ఎస్పీ, టీడీపీ, డీఎంకే పార్టీలు ప్రభుత్వ ఉద్దేశాన్ని తప్పుపడుతూనే.. బిల్లుకు మద్దతు తెలిపాయి. కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల ముందు కేంద్రం గిమ్మిక్కు చేస్తోందని, జనానికి 'లాలిపాప్' అందిస్తోందని దుయ్యబట్టారు. ఇది ఎన్నికల స్టంట్ అని, కొన్ని కులాల ఏకీకరణ కోసమే ప్రభుత్వం ఇదంతా చేస్తోందని సీపీఎం విమర్శించింది. ''ఆర్థిక వెనుకబాటుపరంగా రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ వ్యతిరేకం. ఇది రాజ్యాంగాన్ని వంచించడమే'' అంటూ ఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ మండిపడ్డారు. ఆర్థిక వెనుకబాటు ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ అన్నా డీఎంకే సభ్యుడు ఎం.తంబిదురై వ్యతిరేకించారు. ఓటింగ్ సమయంలో సభ నుంచి వాకౌట్ చేశారు. బిల్లుకు మద్దతు తెలిపిన ఎస్పీ సభ్యుడు ధర్మేంద్ర యాదవ్.. ప్రభుత్వం జనాభా లెక్కల వివరాలను విడుదల చేయాలని కోరారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్జేడీ కూడా ఇదే డిమాండ్ చేసింది. సభ్యులందరూ మాట్లాడిన తర్వాత... ఓటింగ్ చేపడుతున్నట్టు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. ఈ సమయంలో ప్రధాని నరేంద్రమోడీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సభలో ఉన్నారు. ఈబీసీ కోటాతో బ్రాహ్మణులు, రాజ్‌పుత్‌లు, జాట్లు, మరాఠాలు, భూమిహార్లు, కాపు, కమ్మ, ఇతర వ్యాపార కులాల్లోని పేదలకు లబ్ధి చేకూరనుంది.

నేడు రాజ్యసభ ముందుకు..

కోటా బిల్లు బుధవారం రాజ్యసభ ముందుకు రానుంది. బీజేపీ కంటే కాంగ్రెస్ మెజారిటీ ఎక్కువగా ఉండడంతో అందరి చూపు దానిపైనే ఉంది. అక్కడ కూడా కాంగ్రెస్ ఓకే చెబితే బిల్లు చట్టరూపం దాల్చుతుంది. మరోవైపు కొత్త చట్టం అమలుపై కేంద్ర మానవ వనరుల శాఖ కసరత్తు మొదలుపెట్టింది. 10 శాతం అదనపు కోటాకు తగ్గట్టుగా విద్యాసంస్థల్లో సీట్ల సంఖ్యను పెంచడంపై దృష్టి సారించింది.



లోక్‌సభలో బిల్లు పాసయ్యాక థావర్‌చంద్‌ను అభినందిస్తున్న సభ్యులు

- కోటాకు సుప్రీం అంగీకరిస్తుందన్న నమ్మకం ఉంది: థావర్‌చంద్
- వాకౌట్ చేసిన అన్నా డీఎంకే.. వ్యతిరేకించిన ఎంఐఎం



చర్చ సందర్భంగా సభలో ప్రధానితో ముచ్చటిస్తున్న హోంమంత్రి రాజ్‌నాథ్


దేశ చరిత్రలో మైలురాయి: మోడీ

కోటా బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంపై ప్రధాని నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. ''ఇది దేశ చరిత్రలో ఓ మైలురాయిలా నిలిచిపోతుంది. కులాలు, మతాలకు అతీతంగా పేదలందరూ గౌరవంగా బతకాలన్నదే మా ఉద్దేశం. వారందరికీ సమాన అవకాశాలు దక్కాలి. సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్ సూత్రానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది'' అని ట్విటర్‌లో స్పందించారు. బిల్లుకు మద్దతు పలికిన ఎంపీలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అగ్రకుల పేదలకు 10 శాతం రిజర్వేషన్లపై

ఎవరేమన్నారంటే..


మోడీ సర్కారు గిఫ్ట్



మోడీ ప్రభుత్వం ఇస్తున్న 10 శాతం కోటా ఆర్థికంగా వెనుకబడిన అగ్రకుల పేదలకు బహుమతి. ఏళ్ల తరబడి రాజకీయాలు చేస్తున్న పార్టీలకు చెంపపెట్టు. ప్రధాని మోడీ, కేబినెట్‌కు అభినందనలు. ఏటా 8 లక్షల కంటే తక్కువ ఆదాయం పొందుతున్న కుటుంబాలకు ఈ బిల్లు ఊరటనిస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉన్న 50 శాతం రిజర్వేషన్లపై ఈ బిల్లు ఎలాంటి ప్రభావం చూపదు.

-బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా

రాష్ట్రాల సమ్మతి అవసరం లేదు



కుల రిజర్వేషన్ల (ఆర్టికల్ 16 (4))కే సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ల రూల్ వర్తిస్తుంది. అగ్రవర్ణాల పేదలకు ఇస్తున్న 10 శాతం నిబంధనలకు ఆర్టికల్ 16(4)తో సంబంధం లేదు. ప్రాథమిక హక్కుల గురించి చెప్పే రాజ్యాంగంలోని పార్ట్-3ని సవరించడానికి రాష్ట్రాల సమ్మతితో పనిలేదు. రాష్ట్ర ప్రభుత్వం, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, రాష్ట్ర సంస్థల్లో ఉద్యోగాల్లో ఈడబ్ల్యూఎస్ సెక్షన్ ఉంటుంది. అన్ని విద్యాసంస్థలకూ కోటా వర్తిస్తుంది. బిల్లుకు కాంగ్రెస్ పైపైన మద్దతు తెలుపుతోంది.

- ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

జేపీసీకి పంపాలి



మేం ఈ బిల్లుకు మద్దతిస్తున్నాం. కానీ తీసుకొచ్చిన పద్ధతి సరిగా లేదు. అధికార పక్షం సిన్సియారిటీపై అనుమానం వస్తోంది. బిల్లును ముందుగా జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) దృష్టికి తీసుకెళ్తే బాగుంటుంది.

-కేవీ థామస్, కాంగ్రెస్

ప్రతి పేదవాడికి న్యాయం



కులమతాలతో సంబంధం లేకుండా కోటా బిల్లు ప్రతి పేదవాడికి న్యాయం చేస్తుంది. బ్రాహ్మణులు, ఠాకూర్లు, బనియాస్, పటేళ్లకూ రిజర్వేషన్లు వర్తిస్తాయి. 124వ సవరణ ద్వారా జనరల్ కేటగిరీలోని పేద యువతకు విద్య, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం.

-థావర్‌చంద్ గెహ్లాట్, కేంద్ర మంత్రి

అంబేడ్కర్‌ను అవమానించడమే



కోటా బిల్లును ఆమోదించడమంటే రాజ్యాంగాన్ని మోసం చేయడమే. అంటే బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించడమే. ఈ బిల్లు సరికాదు అనడానికి నా దగ్గర 8 కారణాలు ఉన్నాయి. ఆర్థికంగా వెనుకబడిన వాళ్లకు మన రాజ్యాంగంలో గుర్తింపు లేదు. అగ్రకులాల ప్రజలు ఎప్పుడైనా అంటరానితనానికి గురయ్యారా? అగ్రకులాలు ప్రజలు వెనుకబడ్డారనడానికి ఎలాంటి ఆధారాలూ లేవు.

-అసదుద్దీన్ ఒవైసీ, ఏఐఎంఐఎం

మహిళా రిజర్వేషన్ సంగతేంటి?



ఈ బిల్లు ఉద్యోగాలకు ఉద్దేశించింది కాదు. యువతకు లేనిపోని ఆశల్ని, కలల్ని కల్పిస్తున్నారు. 85 వేల రైల్వే ఉద్యోగాలకు 2.5 కోట్ల మంది అప్లికేషన్లు పెట్టుకున్నారు. కోటా బిల్లు నిజంగా నిరుద్యోగ సమస్యను తీరుస్తుందా.. లేకపోతే రాజకీయ జిమ్మిక్కా? కోటా బిల్లును సభలోకి తెచ్చినంత వేగంగా మహిళా రిజర్వేషన్ బిల్లును ఎందుకు తేవడం లేదు? నిరుద్యోగంపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలి.

- సుదీప్ బంధ్యోపాధ్యాయ, టీఎంసీ

బిల్లు ప్రారంభం మాత్రమే



కోటా బిల్లుకు శివసేన మద్దతు ఉంటుంది. అగ్రకులాల్లో విద్య, ఆర్థిక, సామాజికంగా వెనుకబడిన వాళ్లు ఉన్నారు. ఈ బిల్లు ప్రారంభం మాత్రమే. చాలా కులాలు రిజర్వేషన్లు కోరుతున్నాయి. రిజర్వేషన్ల వల్లే బాగుపడతామని అవి భావిస్తున్నాయి.

-ఆనందరావు, శివసేన

9వ షెడ్యూల్‌లో చేర్చాలి



బీజేపీని ప్రతిపక్షం యాంటీ దళిత్‌గా చిత్రీకరించడం పొరపాటు. అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వాళ్లకు కోటా బిల్లు ఉపయోగపడుతుంది. కులం కంటే దేశం మనకు ముఖ్యం. మాజీ ప్రధాని వీపీ సింగ్ ఓ రాజ్‌పుత్. మండల్ కమిషన్ సూచనల్ని అనుసరించి సామాజిక న్యాయాన్ని తెచ్చారు. ఆయనలాగే ప్రతి ఒక్కరూ ఆర్థికంగా వెనుకబడిన వాళ్లకు చేయూతనివ్వాలి. కోటా బిల్లును ఎవరూ కోర్టులో చాలెంజ్ చేయకుండా తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలి.

-రామ్‌విలాస్ పాశ్వాన్, ఎల్‌జేపీ

బిల్లు పాసవ్వాలి



పేదలకు కుల పట్టింపు లేకుండా విద్య, సర్వీసులు, ఉద్యోగాలు కావాలి. అంటే ఈ బిల్లు పాస్ అవ్వాలి. దీనికి మా మద్దతుంటుంది. కానీ ఆర్థికంగా వెనుకబడిన వాళ్లను ఎలా గుర్తిస్తారో బిల్లులో లేకపోవడం లోటే.

-భర్తృహరి మహతాబ్, బీజేడీ

జ్యుడీషియరీలోనూ ఉండాలి



జ్యుడీషియరీలో కూడా రిజర్వేషన్లు ఇవ్వాలి. ఆలిండియా జ్యుడీషియల్ సర్వీసెస్‌ను ఏర్పాటు చేయండి. సమావేశాల్ని మరో రెండ్రోజుల పాటు పొడిగిస్తే బావుంటుంది. బిల్లుకు అవసరమైన సవరణలు చేయొచ్చు.

-ఉపేంద్ర కుష్వాహా, ఆర్ఎల్ఎస్పీ

ఆ క్లారిటీ కావాలి



కోటా బిల్లులో రిజర్వేషన్‌పై పరిమితి ఉందా లేదా అన్న విషయంపై క్లారిటీ కావాలి. లేకపోతే చట్టం దుర్వినియోగం అవుతుంది. దేశంలో నిరుద్యోగం పెద్ద సమస్యగా మారింది. ఉద్యోగాల సృష్టికి సర్కారు కృషి చేయాలి.

-అనుప్రియా పటేల్, అప్నా దళ్

మోడీ రూ.15 లక్షలిస్తే బిల్లే ఉండదు

- ప్రధాని మాట నిలుపుకోలేదు
- మీ పథకాలు సరిగా లేవనే కోటా తెస్తున్నారా?
- లోక్‌సభలో అన్నాడీఎంకే ఎంపీ తంబీదురై

న్యూఢిల్లీ: ఈబీసీ బిల్లును వ్యతిరేకిస్తూ అన్నాడీఎంకే మంగళవారం లోక్‌సభ నుంచి వాకౌట్ చేసింది. అంతకుముందు బిల్లుపై పార్టీ ఎంపీ తంబిదురై మాట్లాడుతూ, ఉన్నత వర్గాలకు రిజర్వేషన్లు దేనికని కేంద్రాన్ని ప్రశ్నించారు. ''ప్రధాని మోడీ మాటిచ్చినట్లు జన్‌ధన్ అకౌంట్లలో రూ.15 లక్షల చొప్పున వేస్తే ఈ బిల్లు అవసరమే ఉండేది కాదు. దేశ ప్రజలంతా ఆర్థికంగా స్థిరపడేవారు. అన్నాడీఎంకే సామాజిక న్యాయాన్ని నమ్ముతుంది. నేను ఓ శూద్రుడ్ని. శూద్రులుగా పుట్టిన వారంతా చాలా బాధలు పడ్డారు. ఆ ఆక్రోశం నుంచే ద్రవిడ ఉద్యమం పుట్టింది. రిజర్వేషన్ల కోసం మేం కోసం పోరాడాం. ఎన్డీఏ సర్కారు చెబుతున్న జనరల్ కేటగిరీలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ పథకాల ద్వారా అందాల్సినవి అందుతున్నాయి. రాజ్యాంగ రచయిత అంబేద్కర్‌కు ఎంత నైపుణ్యమున్నా కులం పేరుతో ఎన్నో అవమానాలపాలయ్యారు. ఆర్థిక స్థితిని బట్టి రాజ్యాంగ సవరణ చేస్తామనడం సరికాదు. సామాజిక న్యాయాన్ని బేస్ చేసుకుని మాత్రమే రాజ్యాంగాన్ని రాశారు. కోటా బిల్లు దేశంలో అవినీతిని మరింత పెంచవచ్చు. చాలామంది లంచాలిచ్చి పేదలమనే సర్టిఫికెట్లు తెచ్చుకునే ప్రమాదముంది. అందుకే ముందు దేశంలో కులతత్వాన్ని తొలగించాలి'' అన్నారు. బిల్లును పార్లమెంటు ఆమోదించినా సుప్రీంకోర్టు కొట్టేస్తుందని జోస్యం చెప్పారు. తమిళనాడులో 69 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 70 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు.



టీఆర్ఎస్ పూర్తి మద్దతు

న్యూఢిల్లీ/హైదరాబాద్, వెలుగు: అగ్రవర్ణాల్లోని పేదలకు ప్రయోజనం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లుకు పూర్తి మద్దతిస్తున్నామని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్ష నేత జితేందర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈబీసీ బిల్లును తమ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ స్వాగతించారని చెప్పారు. ఆలస్యమైనా అగ్రవర్ణాల పేదలకు న్యాయం జరగాలని కోరుకుంటున్నామని తెలిపారు. తెలంగాణలో ముస్లింలు, ఎస్టీలకు రిజర్వేషన్ పెంచాలని అసెంబ్లీ తీర్మానించి పంపినా కేంద్రం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు.

ఈబీసీ బిల్లులో చేర్చాలి

రాష్ట్రంలో వెనుకబడిన ముస్లింలకు 12 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న అంశాన్ని కూడా ఈబీసీ బిల్లులో చేర్చేలా కేంద్రంపై ఒత్తిడి చేయాలని టీఆర్ఎస్ ఎంపీలకు సీఎం కేసీఆర్ సూచించారు. బిల్లుపై పార్టీ వైఖరికి సంబంధించి మంగళవారం ఉదయమే పార్టీ ఎంపీలకు సందేశం పంపారు. ఈబీసీ బిల్లులో సవరణలు కోరాలని, తెలంగాణ రిజర్వేషన్ల పెంపు అంశాన్ని కూడా అందులో చేర్చాల్సిందిగా డిమాండ్ చేయాలని సూచించారు.



- మా సీఎం కేసీఆర్ కూడా స్వాగతించారు: జితేందర్‌రెడ్డి

ఆ బిల్లులో ఏముంది?

అగ్రకులాల్లోని పేదలకు ఈబీసీ కేటగిరీ కింద 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 124వ రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. రాజ్యాంగంలోని 15వ ఆర్టికల్‌లోని 5వ క్లాజ్ తర్వాత కొత్తగా 6వ క్లాజ్‌ను, 16వ ఆర్టికల్‌లోని 5వ క్లాజ్ అనంతరం 6వ క్లాజ్‌ను చేర్చారు. మొత్తం ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల అడ్మిషన్లలో 10 శాతం 'ఆర్థికంగా వెనుకబడినవారి'కి కేటాయించాలని పేర్కొన్నారు.

15వ ఆర్టికల్‌లో చేర్చిన క్లాజ్ '6'

- 15వ ఆర్టికల్‌లోని 4, 5 క్లాజుల్లో పేర్కొన్న వర్గాలు (ఎస్సీ, ఎస్టీ, బీసీ) మినహా మిగతా వర్గాల్లోని పేదల అభ్యున్నతి కోసం గరిష్టంగా 10 శాతం రిజర్వేషన్ అమలు
- మైనారిటీ విద్యా సంస్థలు మినహా అన్ని ప్రైవేటు, ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో ఈ రిజర్వేషన్ అమలవుతుంది.
- కుటుంబ ఆదాయం, ఇతర ఆర్థికపర వెనుకబాటు ఆధారంగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు 'ఎకనమికల్లీ వీకర్ సెక్షన్'లను ప్రకటిస్తుంది.

16వ ఆర్టికల్‌లో చేర్చిన క్లాజ్ '6'

- ఆర్థికంగా వెనుకబడినవారికి ఉద్యోగ నియామకాల్లో గరిష్టంగా 10 శాతం రిజర్వేషన్లు అమలవుతాయి. ప్రస్తుతమున్న రిజర్వేషన్లకు అదనంగా ఈ రిజర్వేషన్లు అమలవుతాయి.

ఎందుకీ రిజర్వేషన్లు?

- దేశంలో ఆర్థికంగా వెనుకబడినవారు ప్రభుత్వ ఉద్యోగాల్లో, ఉన్నత విద్యా సంస్థల్లో తగిన ప్రాతినిధ్యం పొందలేకపోతున్నారు. ఆర్థికంగా బలంగా ఉన్నవారితో పోటీ పడలేకపోతున్నారు. రాజ్యాంగం 15వ ఆర్టికల్‌లోని 4, 5 క్లాజులు, 16 ఆర్టికల్‌లోని 4వ క్లాజులు సామాజికంగా వెనుకబడిన వర్గాలకు (ఎస్సీ, ఎస్టీలకు) కల్పించిన ప్రయోజనాలను వారు పొందే అవకాశం లేదు.
- 2005 సంవత్సరంలో చేసిన 93వ రాజ్యాంగ సవరణతోదేశంలోని ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు దక్కేలా చర్యలు తీసుకోడానికి అవకాశం వచ్చింది. కానీ వెనుకబడిన వారందరికీ ప్రయోజనం కలగలేదని ప్రభుత్వం భావిస్తోంది.
- ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన అందరి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధపెట్టాలని రాజ్యాంగంలోని 46వ ఆర్టికల్ నిర్దేశిస్తోంది. అందువల్ల ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉన్నత విద్య, ఉద్యోగాల్లో తగిన అవకాశాలు దక్కేలా 10 రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతమున్న రిజర్వేషన్లకు అదనంగా ఈ రిజర్వేషన్లు అమలవుతాయి.

మన గురుకులాలు మస్తున్నయ్

ప్రైవేటును వదిలి సర్కారీ రెసిడెన్షియల్ వైపు పరుగులు తీస్తున్న పేరెంట్స్


సిద్దిపేటలోని గురుకుల పాఠశాలలో క్లాస్ రూం


కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో బెడ్స్

(మొదటి పేజీ తరువాయి)

వసతుల్లో కాదు రిజల్ట్స్‌లోనూ ప్రైవేటు స్కూళ్ల కన్నా ముందుండడంతో ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లకు డిమాండ్ భారీగా పెరుగుతోంది. సీటు దక్కించుకునేందుకు పోటీ పెరుగుతోంది. పెద్దపల్లి జిల్లా లింగాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్, బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో వంద మంది బాలికలు హాస్టల్లో ఉండి చదువుతుండగా, 700 మంది పిల్లలు చుట్టుపక్క ప్రాంతాల నుంచి వస్తున్నారు. రామగుండం సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్సియల్ స్కూల్, కాలేజీతోపాటు కస్తూర్బా హాస్టల్‌లో సుమారు 850 మంది పిల్లలున్నారు. ''పిల్లలకు చదువులతో పాటు పండుగ వాతావరణం కల్పిస్తున్నాం. అందరం కలిసిమెలిసి ఉండేలా చూస్తున్నాం. చదువు, ఆటపాటలతోపాటు క్లబ్ అక్టివిటీస్ చేయిస్తున్నాం. మాకు కూడా ఇంటి వద్ద కంటే ఇక్కడే చాలా బాగనిపిస్తుంది'' అని సోషల్ వెల్ఫేర్ స్కూల్, కాలేజీ ప్రిన్సిపల్ సరిత చెప్పారు. మిర్యాలగూడ మండలంలో ఎస్సీ బాలుర గురుకులం, ముస్లిం మైనార్టీ స్కూలు, ఎస్టీ గురుకులం,


మిర్యాలగూడలోని ముస్లిం మైనారిటీ బాలికల హాస్టల్‌లో స్టూడెంట్స్ కోసం ఏర్పాటు చేసిన బెడ్లు

బీసీ బాలికల గురుకుల స్కూల్‌ను ఏర్పాటు చేశారు. 2016లో ఇక్కడ మైనార్టీ రెసిడెన్షియల్ ఇంగ్లిష్ మీడియం ప్రారంభమైంది. అప్పుడు 200 మంది ఉన్న స్టూడెంట్స్ సంఖ్య నేడు 400కు చేరింది. సిరిసిల్ల జిల్లాలో రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీ లు కట్టారు. ఇప్పటికే ఇవన్నీ టెన్త్‌లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయి. తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో రూ.14.50 కోట్లతో కొత్తగా కట్టిన రెసిడెన్షియల్ స్కూల్ కార్పొరేట్ స్థాయిలో ఉంది. ఇది జిల్లాలోనే ఏకైక జనరల్ రెసిడెన్షియల్ స్కూల్ అని, 545 సీట్లు వెంటనే నిండిపోయాయని ప్రిన్సిపల్ రాజయ్య చెప్పారు. తన సర్వీస్‌లో గురుకులాలకు ప్రభుత్వం ఇంతగా నిధులు ఇవ్వడం చూడలేదని అన్నారు.



ఏ ఇబ్బంది లేదు

మాది చిట్యాల దగ్గర తాళ్ల వెల్లంల. సీటు దొరకంగనే చేరిన. మొదట్ల ఎట్ల ఉంటదో ఏమో అని భయపడిన. నిద్రపోయేందుకు మంచి బెడ్స్ ఇచ్చిండ్రు. భయం లేకుండా చదువుకుంటున్నం. డిజిటల్‌క్లాస్‌లు చెబుతున్నరు. చలికాలంల స్నానాలు చేసేందుకు గీజర్ కూడా వాడుతున్నం. హాస్టల్ కంఫర్ట్‌గా ఉంది.

- కంప నాగలక్ష్మి, 9వ తరగతి, మైనార్టీ రెసిడెన్షియల్‌స్కూల్, మిర్యాలగూడ

ఇంటికెళ్లాలనిపించడం లేదు

మాకు మంచిగ ఇంగ్లిష్‌ల పాఠాలు చెబుతుండ్రు. బాగా అర్థమవుతంది. నేను కూడా ఇంగ్లిష్‌లో మాట్లాడతున్నా. ప్రైవేట్ స్కూళ్ల కంటే బాగుంది. రోజూ ఆటలు ఆడిపిస్తుండ్రు. దోస్తులతో అంతా కలిసి బాగా చదువుకుంటున్నాం.

- శ్యామల, 8వ తరగతి, రెసిడెన్షియల్ స్కూల్, కామారెడ్డి


మిర్యాలగూడలోని ముస్లిం మైనారిటీ బాలికల హాస్టల్‌లో డైనింగ్ హాల్

ప్లేట్ నుంచి స్పోర్ట్స్ డ్రెస్ దాకా ఫ్రీ

రెసిడెన్షియల్ స్కూళ్లలో స్టూడెంట్స్‌కు చదువుతోపాటు వారికి కావాల్సినవన్నీ ఉచితంగా అందిస్తున్నారు. తినడానికి ఒక ప్లేటు, గ్లాస్‌తో పాటు పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫారాలు, స్పోర్ట్స్ డ్రెస్‌లు అందిస్తున్నారు. నెలకు రూ.113 కాస్మొటిక్ చార్జీలు ఇస్తున్నారు. విద్యార్థులు బుక్స్ దాచుకునేందుకు డెస్కులు సమకూరుస్తున్నారు. విద్యార్థులకు పాఠాలు చక్కగా అర్థమయ్యేందుకు ప్రతి తరగతికి ఒక టీవీ అందించారు. వీటి ద్వారా డిజిటల్ బోధన చేస్తున్నారు. హాస్టల్ పిల్లలకు చలికాలంలో సోలార్ ద్వారా వేడి నీటిని అందిస్తున్నారు. మెదక్ జిల్లా కొల్చారంలో రూ.13 కోట్లతో ఏర్పాటు చేసిన తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో మాదిరి వసతులు కల్పించారు. జీ+2 బిల్డింగ్‌లో 5 నుంచి 10వ తరగతి వరకు 416 మంది చదువుతున్నారు. త్వరలో కంప్యూటర్ ఎడ్యుకేషన్ అందుబాటులోకి రానుంది. లిటరసీ ఫెయిర్, ఇగ్నైట్, సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్, స్పోర్ట్స్, భారత్ దర్శన్, విశ్వదర్శన్ వంటి కార్యక్రమాల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకునే అవకాశం స్టూడెంట్స్‌కు కల్పిస్తున్నట్టు ఇక్కడి ప్రిన్సిపల్ జయలక్ష్మి తెలిపారు. స్టూడెంట్స్ ఆరోగ్యం కోసం స్కూల్‌లోనే వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి నర్సును అందుబాటులో ఉంచారు. మహబూబాబాద్‌లోని గురుకుల కాలేజీలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు 626 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. కబడ్డీలో జాతీయ స్థాయిలో బహుమతులు పొందారు.

'సీతారామ'కు పర్యావరణ అనుమతులు

- ప్రాజెక్టు సీఈకి కేంద్ర పర్యావరణ శాఖ లేఖ
- ఈఏసీ సిఫార్సు మేరకు అనుమతులు జారీ
- సీఎం కేసీఆర్ హర్షం, కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌కు కృతజ్ఞతలు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకానికి తుది అనుమతులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కర్కెట్ట నుంచి ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ వి.సుధాకర్‌కు లేఖ అందింది. గతేడాది నవంబర్ 27న నిర్వహించిన ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ(ఈఏసీ) సమావేశం సీతారామ ప్రాజెక్టుకు తుది అనుమతులకు సిఫార్సు చేసింది. ఈ సిఫార్సు మేరకు పర్యావరణ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం కేసీఆర్ ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర పర్యావరణ మంత్రి హర్షవర్ధన్‌ను కలిసి అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తాజాగా ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇవ్వడంపై సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మూడు జిల్లాలకు వరం..

గోదావరిపై దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నుంచి సీతారామ ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని 1,33,085 హెక్టార్ల కొత్త ఆయకట్టుకు నీరందించనున్నారు. అలాగే 1,39,836 హెక్టార్ల ఆయకట్టును ఈ ప్రాజెక్టు ద్వారా స్థిరీకరించనున్నారు. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద హెడ్ రెగ్యులేటర్ నిర్మించనున్నారు. నాలుగు పంప్‌హౌస్‌లు, డెలివరీ సిస్టర్న్, 372 కిలోమీటర్ల కాలువ, 9 కిలోమీటర్ల పైప్‌లైన్, వాగులపై క్రాస్ డ్రైనేజీ స్ట్రక్చర్లు, టన్నెళ్లు, కాలువలపై క్రాస్ రెగ్యులేటర్లు, తూముల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రాజెక్టు, కాలువల కోసం సేకరించాల్సిన భూమి 8,476 హెక్టార్లు. ఇందులో 1,531 హెక్టార్లు అటవీ భూమి. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.13,384.80 కోట్లు. ప్రాజెక్టు నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయాలని ఇరిగేషన్ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. సీతారామ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల కోసం గతేడాది ఆగస్టులో మూడు జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. పబ్లిక్ హియరింగ్ నివేదికలతోపాటు ప్రాజెక్టు పూర్తి స్వరూపాన్ని నీటి పారుదల శాఖ ఈఏసీకి నివేదించింది. వీటిని పరిశీలించిన ఈఏసీ తుది అనుమతులు మంజూరు చేయాల్సిందిగా సిఫార్సు చేసింది. పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్ 2006కు లోబడి పర్యావరణ శాఖ అనుమతులు జారీ చేసింది. అనుమతి మంజూరు చేసిన నాటి నుంచి పదేళ్ల పాటు అది మనుగడలో ఉంటుంది.

రాహుల్‌తో చంద్రబాబు మంతనాలు

న్యూఢిల్లీ: ఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తెచ్చే అంశంపై గంటపాటు చర్చించినట్లు తెలుస్తోంది. తర్వాత ఎన్సీపీ నేత శరద్ పవార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో కూడా బాబు సమావేశమయ్యారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ 19న తలపెట్టిన ర్యాలీలో పాల్గొంటామని బాబు, పవార్ చెప్పారు. ర్యాలీ తర్వాత భావి కార్యాచరణపై అందరం నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈబీసీలకు రిజర్వేషన్లను స్వాగతిస్తామని బాబు అన్నారు. ఎన్డీఏ నుంచి బయటకు వచ్చిన తర్వాత బీజేపీ వ్యతిరేక ఫ్రంట్ కోసం బాబు ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే.



ఏప్రిల్ నుంచి కర్నూలుకు విమానాలు

కర్నూలు, వెలుగు: కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 1,010 ఎకరాల్లో రూ.110 కోట్లతో నిర్మించిన ఎయిర్ పోర్టును ఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన 18 నెలల్లోనే ఎయిర్ పోర్టు నిర్మాణం పూర్తి చేశామన్నారు. పౌర విమానయాన శాఖ నుంచి ఎయిర్ కంట్రోల్ ట్రాఫిక్ కు అనుమతులు రావాల్సి ఉందన్నారు. ఏప్రిల్ లో ప్రజలకు విమాన సర్వీసులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కర్నూలు ఎయిర్‌పోర్టు నుంచి విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు విమాన సర్వీసులు ఉంటాయన్నారు. తర్వాత ఓర్వకల్లు, గడివేముల మండలాల్లో నిర్మించిన అల్ట్రా మెగా సోలార్ పార్క్‌ను జాతికి అంకితం చేశారు. ఏపీ క్యాన్సర్ పరిశోధన కేంద్రం, ఫార్మా క్లస్టర్, ఎంఎస్ఎంఈ పార్కులకు భూమిపూజ చేశారు. కోసిగి వద్ద తుంగభద్ర నదిపై నిర్మించిన 1.21 టీఎంసీల పులికనుమ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు.

ఐఎంఎఫ్ చీఫ్ ఎకనమిస్టుగా గీతా గోపీనాథ్

వాషింగ్టన్: ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్) 11వ చీఫ్ ఎకనమిస్టుగా భారత సంతతికి చెందిన ఆర్థికవేత్త గీతా గోపీనాథ్ బాధ్యతలు స్వీకరించారు. ఐఎంఎఫ్ లో ఉన్నత పదవి పొందిన తొలి మహిళగా ఆమె రికార్డు సృష్టించారు. 47 ఏళ్ల గీతా గోపీనాథ్ హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా ఉన్నారు. ఐఎంఎఫ్ రీసెర్చ్ డిపార్ట్ మెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన మౌరిస్ ఆబ్స్టెఫెల్డ్ డిసెంబర్ 31న రిటైర్ అయ్యారు. ఆయన స్థానంలో గీత పేరును గతేడాది అక్టోబర్ 1న ఐఎంఎఫ్ ఎండీ క్రిస్టినా లగార్డే ప్రకటించారు. ప్రపంచంలోని గొప్ప ఆర్థికవేత్తల్లో గీత ఒకరని, అకడమిక్స్, నాయకత్వ బాధ్యతల్లో మంచి ట్రాక్ రికార్డు, విస్తృతమైన అంతర్జాతీయ అనుభవం వంటివి ఆమె సొంతమని లగార్డే ప్రశంసించారు.



మైసూరులో పుట్టిన గీతా గోపీనాథ్ ఈ మధ్య హార్వర్డ్ గెజిట్ కు ఇంటర్వ్యూ ఇచ్చారు. తనను ఈ పదవికి ఎంపిక చేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాని అన్నారు. ఐఎంఎఫ్ లో నాయకత్వానికే కాదు, ప్రపంచంలోని మహిళలందరికీ క్రిస్టినా లగార్డే రోల్ మోడల్ గా నిలిచారని గీత అన్నారు.

'ఓబీసీ'ని నీరుగార్చేందుకే ఈబీసీ రిజర్వేషన్లు

బీసీ, కుల సంఘాల అత్యవసర సమావేశంలో నేతలు

హైదరాబాద్, వెలుగు: అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రస్తుత ఓబీసీ రిజర్వేషన్లను నీరు గారుస్తుందని బీసీ సంఘాలు ఆరోపించాయి. బుధవారం హైదరాబాద్‌లోని బీసీ సాధికారత సంస్థలో జాతీయ వెనుకబడిన తరగతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కస్తూరి జయప్రసాద్ అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశంలో వివిధ కుల, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1993లో తీసుకొచ్చిన ఓబీసీ రిజర్వేషన్లు ఇప్పటికీ తొమ్మిది శాతానికి మించి అమలు కావడం లేదన్నారు. రజక ఐక్యవేదిక చైర్మన్ చిరుకలి శంకర్, గౌడ సంఘం ఉపాధ్యక్షుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, ఓసీబీ జేఏసీ కో కన్వీనర్ చింతల రాజేంద్రప్రసాద్, బోయ వాల్మీకి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొగ్గు వెంకటేష్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో వరల్డ్ ఐటీ ఎక్స్‌పో



- హైటెక్స్‌లో ఫిబ్రవరి 4, 5 తేదీల్లో ఈఎస్ఈ
- 60 దేశాలు, 250 ఇండియన్ కంపెనీలు హాజరు

హైదరాబాద్, వెలుగు: మరో అంతర్జాతీయ ఎక్స్‌పోకు హైదరాబాద్ వేదికైంది. ఫిబ్రవరి 4, 5 తేదీల్లో ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఈఎస్ఈ) ఇక్కడి హైటెక్స్‌లో జరగనుంది. ఇండియా సాఫ్ట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జరిగే ఈ ఎక్స్‌పోను కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు ప్రారంభిస్తారని ఇండియా సాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీకే సరీన్ మంగళవారం వెల్లడించారు. ఈఎస్ఈ ఇండియా సాఫ్ట్ 19వ ఎడిషన్‌తో దేశంలోని ఐటీ, ఎలక్ట్రానిక్ రంగంలో ఎగుమతులకు అంతర్జాతీయ స్థాయిలో ఊతమిచ్చినట్టవుతుందని చెప్పారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో సేవలందిస్తున్న ఎంఎస్ఎంఈ సంస్థలకు ప్రయోజనకరంగా ఉంటుందని, విదేశాల్లోని కంపెనీలకు తమ ఉత్పత్తులను మార్కెట్ చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఐటీ ఉత్పత్తుల్లో దక్షిణాది రాష్ట్రాల వాటా 60 శాతమని, అందులో అగ్రభాగం తెలంగాణదేనని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పాలసీలతో ఐటీ రంగంలో హైదరాబాద్ మరింత వేగంగా పురోగతి సాధిస్తోందని, ఇప్పటికే టాప్ మోస్ట్ మల్టీ నేషనల్ కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయన్నారు.

మహిళలకు 100 శాతం రీయింబర్స్‌మెంట్

తక్కువ ఫీజుతోనే ఎక్స్‌పోలో స్టాళ్లు ఏర్పాటు చేసుకోవచ్చని డీకే సరీన్ చెప్పారు. రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం, మహిళా పారిశ్రామికవేత్తలకు 100 శాతం రీయంబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ఐటీ శాఖ ఇస్తుందన్నారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే చిన్న కంపెనీలకు ఇదో అద్భుత అవకాశమని, ఎక్స్‌పోలో 60 దేశాల కంపెనీలు పాల్గొంటున్నాయని, సుమారు 250 భారత ఐటీ కంపెనీలు, మరో 20 ఎంఎన్సీలూ తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయని రాష్ట్ర ఐటీ శాఖ వెల్లడించింది.



4 తరాల చాలెంజ్

ఐస్ బకెట్ చాలెంజ్, రైస్ బకెట్ చాలెంజ్, ఫిట్‌నెస్ చాలెంజ్, కికి చాలెంజ్ లాంటివి సోషల్ మీడియాలో బాగా హల్‌చల్ చేశాయి గుర్తుందా? కొత్త ఏడాది వచ్చిందో లేదో అప్పడే ఇంకో కొత్త చాలెంజ్ ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. పేరు ఫోర్ జనరేషన్స్ చాలెంజ్. ఇందులో ఓ కుటుంబంలో ఓ తరానికి చెందిన వ్యక్తి తన ముందు తరం వ్యక్తిని పిలుస్తాడు. తర్వాత అతను తన ముందు జనరేషన్ వ్యక్తిని రమ్మంటాడు. ఇలా నాలుగు తరాలు వచ్చే వరకు వీడియో సాగుతుంది. చైనాలో మొదలైన ఈ కొత్త చాలెంజ్ ప్రపంచమంతా వ్యాపిస్తోంది.

తిరుపతికి ప్రత్యేక రైలు

హైదరాబాద్, వెలుగు: సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 12న తిరుపతికి ప్రత్యేక రైలు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ప్రకటించింది.ప్రత్యేక రైలు సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి తెల్లారి ఉదయం 7 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది.అదే రోజు సాయంత్రం 5 గంటలకు తిరుపతి నుంచి హైదరాబాద్ కు రైలు బయలుదేరుతుంది. ఈ రైలు కాజీపేట, ఖమ్మం, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంటలో ఆగుతుంది.

ఫిబ్రవరిలో 'సహకార' సమరం

- రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- ఎన్నికలు నిర్వహించాలని సొసైటీలకు ఆదేశం
- త్వరలోనే నోటిఫికేషన్ జారీ
- ఏర్పాట్లు చేస్తున్న సహకార ఎన్నికల అథారిటీ

హైదరాబాద్, వెలుగు:

సహకార సంఘాల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పంచాయతీ ఎన్నికలు పూర్తయిన తర్వాత వీటిని నిర్వహించాలని ప్రభుత్వం సొసైటీలను ఆదేశించింది. దీంతో ఫిబ్రవరి మూడో వారంలో సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు సహకార శాఖ సిద్ధమవుతోంది. తొలి విడతగా రాష్ట్రంలోని 906 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్‌ల)కు ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ నెల 25 తర్వాత నోటిఫికేషన్ జారీ చేసి ఫిబ్రవరి మూడో వారంలోగా ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. 20 లక్షల మంది ఓటర్లతో ఇప్పటికే సహకార సంఘాల జాబితాలు సిద్ధం చేసింది. తొలి దశలో పీఏసీఎస్‌లకు, ఆ తర్వాత జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల(డీసీసీబీల)కు ఎన్నికలు నిర్వహిస్తారు. అనంతరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలు, తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకుకు ఎన్నికలు నిర్వహించనున్నారు.



ప్రతి 200 మందికి ఓ పోలింగ్ కేంద్రం

20 లక్షల మంది రైతులున్న 906 పీఏసీఎస్‌ల పరిధిలోని ప్రతీ 200 మంది ఓటర్లకు ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అదనపు రిజిస్ట్రార్ నేతృత్వంలోని సహకార ఎన్నికల అథారిటీ ఎన్నికల ఏర్పాట్లు చేస్తోంది. పాత జిల్లాలవారీగా హైదరాబాద్ మినహా తొమ్మిది డీసీసీబీలతోపాటు టెస్కాబ్‌కు ఎన్నికలు జరపనుంది. బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బ్యాలెట్ బాక్సుల సేకరణ, బ్యాలెట్ పేపర్ల ముద్రణపై దృష్టి పెట్టారు. ఒక్కో పీఏసీఎస్ పరిధిలో 13 మంది డైరెక్టర్లను బ్యాలెట్ పద్ధతిలో సంఘంలోని ఓటర్లు ఎన్నుకుంటారు. డైరెక్టర్ల ఎన్నిక తర్వాత వారిలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. పీఏసీఎస్‌ల చైర్మన్లంతా కలిసి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు.

అనుమానాలు తీర్చండి

టీఎస్‌పీఎస్సీ ఎదుట ఫార్మసిస్ట్ అభ్యర్థుల ధర్నా

హైదరాబాద్, వెలుగు: ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 పోస్టుల మెరిట్ జాబితాపై అనుమానాలున్నాయని, వాటిని తీర్చాలని అభ్యర్థులు మంగళవారం టీఎస్ పీఎస్సీ ఎదుట ధర్నా చేశారు. 369 ఫార్మసిస్ట్ పోస్టులకు గతేడాది జనవరి25న నోటిఫికేషన్ ఇచ్చి, ఏప్రిల్ 17న ఆన్ లైన్ పరీక్ష నిర్వహించిన టీఎస్ పీఎస్సీ ఈనెల 3న మెరిట్ జాబితా విడుదల చేసిందని అభ్యర్థులు చెప్పారు. ఆన్‌లైన్ పరీక్షలో కనీస అర్హత మార్కులకు పాయింట్స్ కేటాయించారని, అయితే తక్కువ మార్కులు వచ్చినవారికి వెయిటేజీ కలిపి అర్హత సాధించినట్టు చూపారన్నారు. విడివిడిగా మార్కులు సాధించాలని నోటిఫికేషన్ లో సూచించారని, అయితే పేపర్ 1, పేపర్ 2 మార్కులను వేరువేరుగా ప్రకటించలేదని అభ్యర్థులు వాపోయారు.

సౌదీలో వడ్యాల్ వాసి అదృశ్యం

నిర్మల్‌రూరల్, వెలుగు: బతుకుదెరువు కోసం సౌదీ వెళ్లిన వ్యక్తి ఏడాదిగా ఇంటికి ఫోన్ చేయకపోవడంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. లక్ష్మణచాంద మండలం వద్యాల తండాకు చెందిన బానావత్ మూడేళ్ల కింద సౌదీ వెళ్లాడు. వెళ్లిన కంపెనీలో వేతనం తక్కువని బయటికి వచ్చి వేరే కంపెనీలో చేరాడు. వెళ్లినప్పటి నుంచి తరచూ ఫోన్‌చేసి క్షేమ సమాచారాలు చెబుతుండేవాడని కుటుంబ సభ్యులు చెప్పారు. ఇటీవలి కాలంలో బానావత్‌ఫోన్ చేయడం లేదని వాపోయారు. దీంతో సౌదీలో ఉన్న వద్యాల తండా వాసులను సంప్రదించి బానావత్ ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయిందన్నారు.

కైట్ ఫెస్టివల్‌తో.. 'హైదరాబాద్' ఇమేజ్ మరింత పెరగాలి: సీఎస్

హైదరాబాద్, వెలుగు: హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగేలా అంతర్జాతీయ పతంగుల పండుగ నిర్వహించాలని సీఎస్ ఎస్‌కే జోషి ఆధికారులను ఆదేశిం చారు. ఈ ఫెస్టివల్ నిర్వహణకు సంబంధించి మంగళవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రతిరోజూ సుమారు 3 లక్షల మంది సందర్శకులకు ఏర్పాట్లు చేయాలన్నారు. బారికేడ్లు, పరిశుభ్రత, ట్రాఫిక్, అగ్నిమాపక వ్యవస్థ, మంచినీటి సరఫరా, వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ ద్వారా స్వచ్ఛ సర్వేక్షన్‌పై ప్రచారం నిర్వహించాలని సీఎస్ సూచించారు. టూరిజం, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బి.వెంకటేశం మాట్లాడుతూ.. కైట్ ఫెస్టివల్‌లో 20 దేశాల నుంచి 50 మంది కైట్ ఫ్లయర్స్ పాల్గొంటారని చెప్పారు.

అలోక్ వర్మే సీబీఐ బాస్

కండిషన్స్ అప్లై..



తీర్పు ముఖ్యాంశాలు :

- సీబీఐ డైరక్టర్‌గా అలోక్‌వర్మే కొనసాగుతారు
- వర్మను లీవ్‌పై పంపే అధికారం కేంద్రానికి లేదు
- పీఎం, సీజేఐ, ప్రతిపక్ష నాయకునితో కూడిన సెలక్ట్ కమిటీ వారం రోజుల్లో సమావేశమై అలోక్‌వర్మపై చర్యలకు సంబంధించిన నిర్ణయం తీసుకుంటుంది.
- విచారణ పూర్తయ్యేవరకు వర్మ కీలక నిర్ణయాలు తీసుకోకూడదు



- కేంద్రానికి సుప్రీంకోర్టు షాక్
- వర్మను సెలవుపై పంపడాన్ని తప్పుపట్టిన కోర్టు
- కీలక నిర్ణయాలు తీసుకోవద్దని అలోక్‌కు ఆదేశాలు

న్యూఢిల్లీ: సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ కేసులో కేంద్రానికి సుప్రీం కోర్టు షాక్ ఇచ్చింది. వర్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. అలోక్‌వర్మను బలవంతంగా సెలవుపై పంపిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు మంగళవారం కొట్టేసింది. సీబీఐ డైరెక్టర్‌గా మళ్లీ వర్మనే నియమిస్తూ ఆదేశాలను జారీచేసింది. అయితే విధానపరమైన నిర్ణయాలు తీసుకోవద్దని వర్మను ఆదేశించింది. సీబీఐ డైరక్టర్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకోడానికి కేంద్రానికి అధికారం లేదని పేర్కొంటూ సర్కార్ జారీచేసిన వర్మ బదిలీ ఉత్తర్వులను సుప్రీంకోర్టు రద్దుచేసింది. అలోక్‌వర్మపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు సభ్యులుగా ఉన్న సెలక్ట్ కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. దీని కోసం ఈ కమిటీ వారంరోజుల్లోగా సమావేశం కావాలని కోర్టు సూచించింది. అంతవరకూ వర్మ ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోకూడదని కూడా సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అదేవిధంగా సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం.నాగేశ్వర్‌రావు నియామకాన్ని కూడా సుప్రీం పక్కన పెట్టింది. కేంద్ర ప్రభుత్వం తనను బలవంతంగా సెలవుపై పంపడాన్ని సవాల్ చేస్తూ అలోక్‌వర్మ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈమేరకు తీర్పు చెప్పింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ మంగళవారం సెలవులో ఉండడంతో తీర్పును జస్టిస్ ఎస్.కె. కౌల్ చదివి వినిపించారు. మరోవైపు, అలోక్‌వర్మ పదవీకాలం ఈనెల 31 తో ముగియనుంది.

వర్మపై ఆరోపణలు ఇవీ

- లాలూ ప్రసాద్ అవినీతి కేసుల్లో జోక్యం చేసుకున్నారు
- మాంసం ఎగుమతిదారుడు మొయిన్ ఖురేషికి వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి నుంచి రూ. 2 కోట్లు లంచం తీసుకున్నారు.
- ఖురేషితో సంబంధమున్న హైదరాబాద్ వ్యాపారిని విచారించవద్దంటూ ఆదేశాలు జారీ చేశారు
- సెయింట్ కిట్స్ పౌరసత్వానికి కోరిన ఇద్దరు వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు
- అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల్ని సీబీఐలోకి తీసుకోడానికి ప్రయత్నించారు

తీర్పుపై ఎవరేమన్నారు?

"కోర్టు తీర్పును గౌరవిస్తాం. సీబీఐ గౌరవాన్ని కాపాడేలా విశాల ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకునే అలోక్‌వర్మను సెలవుపై పంపించాం."
- ఆర్థికమంత్రి, అరుణ్ జైట్లీ


"రాఫెల్ డీల్‌పై సీబీఐ చీఫ్ అలోక్‌వర్మ విచారణ జరిపారు. మళ్లీ ఆయన సీబీఐ చీఫ్‌గా వస్తున్నారు. రాఫెల్ డీల్ నుంచి ప్రధాని మోడీని ఎవరూ కాపాడలేరు."
- కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీ

"దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పవిత్రమైన సంస్థల్ని మోడీ సర్కార్ ధ్వంసంచేసింది. రాఫెల్ స్కామ్‌ను ఆపడం కోసమే సీబీఐ డైరెక్టర్‌ను అర్ధరాత్రి సెలవుపై సాగనంపలేదా?" **- ఢిల్లీ సీఎం, కేజ్రీవాల్**



అలోక్ వర్మ, ఆస్తానా కేసు వివరాలు

- **2018 జనవరి 19:** సీబీఐ చీఫ్ గా అలోక్ వర్మ, అక్టోబర్ 22న సీబీఐ స్పెషల్ డైరెక్టర్‌గా రాకేశ్ ఆస్తానా నియామకం
- **అక్టోబర్ 15:** లంచం ఆరోపణలపై ఆస్తానా, డీఎస్పీ దేవేందర్ కుమార్, బ్యాంకర్ మనోజ్ ప్రసాద్, అతడి సోదరుడు సోమేశ్ ప్రసాద్ పై ఎఫ్ఐఆర్
- **అక్టోబర్ 22:** సీబీఐ డీఎస్పీ దేవేందర్ కుమార్ అరెస్టు
- **అక్టోబర్ 23:** అర్ధరాత్రి అలోక్ వర్మను పక్కన పెట్టి ఇంటరిమ్ చీఫ్ గా ఎం.నాగేశ్వర్ రావును నియమించిన కేంద్రం
- **అక్టోబర్ 24:** సుప్రీంకోర్టును ఆశ్రయించిన అలోక్ వర్మ
- **అక్టోబర్ 26:** వర్మ పిటిషన్ పై రెండు వారాల్లోగా విచారణ పూర్తి చేయాలని సీవీసీని ఆదేశించిన సుప్రీంకోర్టు
- ఎన్ జీ వో పిల్ పై కేంద్రం, సీబీఐ, సీవీసీ, ఆస్తానా, వర్మ, నాగేశ్వర్ రావుకు సుప్రీంకోర్టు నోటీసులు
- **నవంబర్ 12:** ప్రిలిమినరీ ఎంక్వైరీ రిపోర్టును సీల్డ్ కవర్ లో సుప్రీంకు సమర్పించిన సీవీసీ



ట్రంప్, మోడీ హలో..హలో

వాణిజ్య సంబంధాలు, డిఫెన్స్, టెర్రరిజంపై చర్చ

న్యూఢిల్లీ/ వాషింగ్టన్: ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ఫోన్లో మాట్లాడుకున్నారు. రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య సంబంధాలు, డిఫెన్స్, టెర్రరిజంపై పోరాటంలో సహకారం, అఫ్గానిస్తాన్ లాంటి అంశాలపై చర్చించుకున్నారని వైట్ హౌస్ ప్రకటించింది. అంతకంటే ముందు ఇద్దరు దేశాధినేతలు న్యూఇయర్ విషెస్ చెప్పుకున్నారు. ఆ తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలపై చర్చించారు. ఇండియా, అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మెరుగుపడటంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఏడాది రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడేందుకు కృషి చేయాలని అంగీకారానికి వచ్చారు. గతేడాది రెండు దేశాల మధ్య జరిగిన 2 + 2 చర్చలు, ఇండియా, అమెరికా, జపాన్‌మధ్య జరిగిన తొలి త్రైపాక్షిక సదస్సు గురించి మాట్లాడుకున్నారని ప్రధాన మంత్రి కార్యాలయం చెప్పింది.

సుప్రీంకోర్టులో అయోధ్య కేసు విచారణ

న్యూఢిల్లీ: అయోధ్యలో రామజన్మభూమి, బాబ్రీ మసీదు భూ వివాదం కేసుపై ఐదుగురు జడ్జిల సుప్రీంకోర్టు బెంచ్ గురువారం ఉదయం 10.30 గంటలకు విచారణ చేపట్టనుంది. సుప్రీంకోర్టు సీజే జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలో జస్టిస్ ఎస్.ఎ. బాబ్డే, జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ యు.యు. లలిత్, జస్టిస్ డి.వై. చంద్రచూడ్ లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు మంగళవారం ఏర్పాటు చేసింది.



సిటిజన్ బిల్లుకు లోక్ సభ ఓకే

న్యూఢిల్లీ : కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పౌరసత్వ సవరణ బిల్లు 2019 కు మంగళవారం లోక్ సభ ఆమోదం లభించింది. అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్,పాకిస్తాన్ దేశాల నుంచి ఇండియాకు వచ్చిన ముస్లిమేతరులు ఆరేళ్ల పాటు నివాసముంటే వారికి పౌరసత్వం ఇవ్వడం ఈ బిల్లు ప్రధానోద్దేశం. కేంద్ర హోం మంత్రి రాజ్ నాథ్ సింగ్ సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. తర్వాత చర్చ జరిగింది.

బిల్లుపై ప్రతిపక్షాల అభ్యంతరాలు

ఈ బిల్లుపై కాంగ్రెస్ సహా అనేక ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఈశాన్య భారతంలోని అనేక రాష్ట్రాలు బిల్లును వ్యతిరేకిస్తున్నాయని పేర్కొన్నాయి. ఈనేపథ్యంలో బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ప్రతిపక్షాల డిమాండ్ ను స్పీకర్ సుమిత్రా మహాజన్ తోసిపుచ్చారు. దీంతో స్పీకర్ చర్యను నిరసిస్తూ కాంగ్రెస్ ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. "ఇది విభజించే బిల్లు. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధం" అని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగతా రాయ్ చర్చ సందర్భంగా విమర్శించారు. దీనికి మంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పందిస్తూ బిల్లు కేవలం అస్సాంకే పరిమితం కాదన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇది వర్తిస్తుందని చెప్పారు. అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్,పాకిస్తాన్ నుంచి వలస వచ్చిన వారు దేశంలోని చాలా ప్రాంతాల్లో ఉన్నారన్నారు. ఏ ప్రాంతంలోనైనా ఉండొచ్చన్నారు. గతంలో తొలి ప్రధాని నెహ్రూ కూడా వలసవచ్చిన వారికి న్యాయం చేయాలని చెప్పిన విషయాన్ని ఈసందర్భంగా రాజ్ నాథ్ సింగ్ గుర్తు చేశారు. ఈ బిల్లును 2016లోనే లోక్ సభలో ప్రవేశపెట్టి, తర్వాత జాయింట్ పార్లమెంట్ కమిటీకి పంపారు. సోమవారం జేపీసీ నివేదిక అందచేసింది. జేపీసీ సిఫార్సుల మేరకు తాజాగా బిల్లును మంగళవారం సభలో ప్రవేశపెట్టారు. చర్చ తర్వాత బిల్లును లోక్ సభ ఆమోదించింది.

ఏజీపీది చారిత్రక తప్పిదం : అస్సాం మంత్రి శర్మ

బిల్లును అస్సాం గణపరిషత్ (ఏజీపీ)వ్యతిరేకించడాన్ని అస్సాం మంత్రి హిమంత బిశ్వా శర్మ (బీజేపీ) తప్పు పట్టారు. "ఏజీపీ చారిత్రక తప్పిదం చేసింది.అస్సాం ప్రజలను మోసగించింది" అని ఆయన మండిపడ్డారు.

సిటిజన్ బిల్లుపై బీజేపీ మిత్రపక్షాల ఫైర్

ఈశాన్యం భగ్గుమంది

గౌహతి : పౌరసత్వ (సవరణ)బిల్లు 2016పై ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న మొత్తం 25 లోక్ సభ సీట్లలో ఈసారి 21 సీట్లు గెలవాలన్నది బీజేపీ లక్ష్యం. దీనికి అనుగుణంగా బీజేపీ ప్రెసిడెంట్ అమిత్ షా వ్యూహరచన కూడా చేస్తున్నారు. ఈసమయంలోనే పౌరసత్వ చట్ట సవరణ బిల్లు ప్రవేశపెట్టడం, లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ కి పెద్ద దెబ్బే అవుతుందంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

కొన్నేళ్లుగా ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీకి ఆదరణ పెరుగుతోంది. రవాణా సహా అనేక అభివృద్ధి పథకాలకు మోడీ సర్కార్ ఇక్కడ నుంచే శ్రీకారం చుట్టింది. ఈశాన్యంలోని అనేక రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాల్లో భాగస్వామ్య పక్షంగా ఉంది. అయితే, సిటిజన్ షిప్ (సవరణ)బిల్లు పై ముందుకెళ్లాలని కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఇక్కడి ప్రజలకు బీజేపీ దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిత్రపక్షాలైన 'అస్సాం గణ పరిషత్', 'మిజో నేషనల్ ఫ్రంట్', 'నేషనల్ పీపుల్స్ పార్టీ', 'ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర' అన్నీ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఈబిల్లు వల్ల కేవలం అస్సాం ప్రయోజనాలే కాదు ఈశాన్య రాష్ట్రాల్లోని అన్ని స్థానిక తెగలు,సముదాయాల ప్రయోజనాలు దెబ్బతింటాయని రాజకీయాలకు అతీతంగా ఇక్కడి పార్టీలన్నీ అభిప్రాయపడుతున్నాయి. కేంద్రం చర్యలకు నిరసనగా అస్సాంలో బీజేపీతో ఏజీపీ తెగతెంపులు చేసుకుంది.

బిల్లు వివాదమేంటి ?

ఇప్పటివరకున్న చట్టాల ప్రకారం దేశంలో పౌరసత్వం లభించాలంటే ఇక్కడ 12 ఏళ్లపాటు నివాసముండాలి. కొత్త బిల్లులో ఈ నిబంధనను మార్చారు. అఫ్గానిస్తాన్,బంగ్లాదేశ్,పాకిస్తాన్ దేశాల నుంచి ఇండియాకు వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులు ఆరేళ్ల పాటు నివాసముంటే వారికి పౌరసత్వం ఇస్తారు. భారత పౌరసత్వం లభించడానికి ఉన్న నియమాలను బిల్లులో తాజాగా చేసిన సవరణలు సునాయాసం చేశాయి. అయితే,ఈ సడలింపులు ఆయా దేశాల నుంచి వచ్చే ముస్లింలకు మాత్రం వర్తించవు.

అస్సాం ఒప్పందానికి తూట్లు పొడవడమే

పొరుగుదేశాల నుంచి అక్రమ వలసలపై గతంలో 'ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్' అనేక పోరాటాలు చేసింది. ఈనేపథ్యంలో 1985లో అస్సాం ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం 1971, మార్చి 25 తర్వాత అస్సాంలోకి ప్రవేశించిన వారిని, ఏ మతం వారైనప్పటికీ చొరబాటుదారులుగానే గుర్తిస్తారు. అయితే తాజా పౌరసత్వ బిల్లు, ఈ ఒప్పందాన్ని నిర్వీర్యం చేస్తుంది. దీనిపై అస్సాం ప్రజలు మండిపడుతున్నారు.

ఈశాన్య భారతంలో బంద్ సక్సెస్

పౌరసత్వ చట్ట సవరణల బిల్లుకు వ్యతిరేకంగా ఈశాన్య రాష్ట్రాల్లో మంగళవారం జరిగిన బంద్ సక్సెస్ అయింది. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు ఈ బంద్ కు మద్దతు ప్రకటించాయి. అస్సాం గణపరిషత్ వంటి స్థానిక రాజకీయ పార్టీలు, వాటి అనుబంధ విద్యార్థి సంఘాలు బంద్ కు నాయకత్వం వహించాయి. 1947 తర్వాత యావత్ ఈశాన్య భారతం ఒకే అంశం పై బంద్ చేయడం ఇదే తొలిసారి అని 'ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్' లీడర్లు పేర్కొన్నారు.



గౌహతిలో సమ్మె సందర్భంగా ఓ జీపును ధ్వంసం చేస్తున్న ఆందోళనకారులు

కొన్నిచోట్లే బంద్!

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన రెండు రోజుల భారత్ బంద్ కు మొదటి రోజు మిశ్రమ స్పందన వచ్చింది. కొన్ని రాష్ట్రాల్లోనే బంద్‌ప్రభావం కనిపించింది. మంగళవారం సమ్మె కారణంగా జనజీవనం పలుచోట్ల స్తంభించింది. దేశవ్యాప్తంగా కార్మికులు విధులను బహిష్కరించారు. తెల్లవారుజాము నుంచే రోడ్లపైకి వచ్చి నిరసనలకు దిగారు. వాహనాలను అడ్డుకున్నారు. స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు మూతపడ్డాయి. బ్యాంక్‌లు పని చేయలేదు. పలు యూనివర్సిటీలు పరీక్షలను వాయిదా వేశాయి. కేరళలో వామపక్ష ప్రభుత్వం ఉద్యోగుల సమ్మెకు అనధికారికంగా మద్దతివ్వగా, పశ్చిమ బెంగాల్‌సర్కారు ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆఫీసులకు రావాలని హెచ్చరించింది.

న్యూఢిల్లీ: కార్మిక సంఘాల సమ్మెతో పలు రాష్ట్రాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఒడిశా, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో సమ్మె ప్రభావం ఎక్కువగా కనిపించింది. కార్మికులు కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రోడ్డెక్కారు. టైర్లను తగలబెట్టి వాహనాలను అడ్డుకున్నారు. వివిధ సంస్థల ఉద్యోగులు, కార్మికులు ఎక్కడికక్కడ నేషనల్‌హైవేలను బ్లాక్ చేశారు. బ్యాంకులు మూతపడడంతో కస్టమర్లు ఇబ్బందులు పడ్డారు. ట్రేడ్ యూనియన్ బిల్లు 2018 సవరణ ద్వారా ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే ప్రయత్నం చేస్తోందని యూనియన్‌నేతలు ఆరోపిస్తున్నారు. బిల్లు ఆమోదం పొందితే కార్మిక సంఘాల అధికారాలకు తెరపడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేరళలో ట్రేడ్ యూనియన్ సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు బస్సులను అడ్డుకున్నారు. ఈ సమ్మెతో శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు ఇబ్బంది కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. తిరువనంతపురం, షోరానూర్ రైల్వే స్టేషన్లలో కార్మికులు రైల్ రోకో నిర్వహించారు.

సమ్మెలో ముంబై ఉద్యోగులు

ఒడిశాలో షాపులు, స్కూళ్లు అన్నీ మూత పడ్డాయి. సమ్మె నేపథ్యంలో సెక్రెటేరియట్ ఉద్యోగులతో పాటు హెచ్ఓడీలు ఉదయం 9:30 లోగా ఆఫీసుకు చేరుకోవాలని ప్రభుత్వం సూచించింది. దేశ రాజధాని ఢిల్లీలోనూ పలు కార్మిక సంఘాలు రోడ్లపై ఆందోళన చేపట్టాయి. మహారాష్ట్రలోని పల్గర్ జిల్లాలో దాదాపు ఐదు వేలమంది ఆందోళనకారులు భారీ ర్యాలీ నిర్వహించారు. మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటి డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఇంజనీర్లు, ఆపరేటర్లు, లైన్‌మెన్లతో పాటు మహా జెన్‌కో, ట్రాన్స్ కో ఉద్యోగులు కూడా సమ్మెకు మద్దతు పలికారు. బృహన్ ముంబై ఎలక్ట్రిసిటీ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్ట్ ఉద్యోగులు 35 వేల మంది సమ్మెలో పాల్గొన్నారు.



ముంబైలోని 'బెస్ట్' సిబ్బంది సమ్మెతో టాక్సీల కోసం చత్రపతి మహారాజ్ శివాజి టెర్మినస్ దగ్గర ప్రయాణికుల క్యూ

- సమ్మెకు మిశ్రమ స్పందన
- రోడ్డెక్కిన కార్మికులు.. స్తంభించిన జనజీవనం
- చాలా రాష్ట్రాల్లో డిపో దాటని బస్సులు
- మూతపడ్డ స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసులు
- ఇవాళ కూడా కొనసాగనున్న ఆందోళనలు

పరీక్షలు వాయిదా..

ఉద్యోగుల సమ్మె కారణంగా పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు కువెంపు, వీటీయూ, దావనగెరె, తుంకూర్ యూనివర్సిటీలు ప్రకటించాయి. మంగళవారం నుంచి ఈ నెల 12 వరకు జరగనున్న జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ ఎగ్జామ్ విషయంలో ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, జేఈఈ మెయిన్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలిగించబోమని సీపీఎం అనుబంధ ట్రేడ్ యూనియన్ ప్రకటించింది.

కర్ణాటకలో మూతపడ్డ ఆఫీసులు

బెంగళూరు అర్బన్‌జిల్లా పరిధిలోని స్కూళ్లు, కాలేజీలు అన్నీ మంగళవారం మూతపడ్డాయని అధికారులు చెప్పారు. బుధవారం కూడా తెరిచేదిలేదని యాజమాన్యాలు ప్రకటించాయి. కర్ణాటక ప్రభుత్వం కూడా ఈ సమ్మెకు అనధికారికంగా మద్దతిచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రులు మినహా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆఫీసులు అన్నీ మూతపడ్డాయి. బంద్‌కు సహకరించొద్దని కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు నిర్ణయించుకున్నారని, వాళ్లు ముందుకొస్తే పాక్షికంగానైనా బస్సులు నడిపిస్తామని ప్రైవేటు బస్సు ఆపరేటర్ల సంఘం ప్రకటించింది. బుధ, గురు వారాల్లో ఎలాంటి లీవ్‌లనూ ఆమోదించేది లేదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఉద్యోగులకు తేల్చిచెప్పింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కలకత్తాలో పోలీసు బలగాలను మోహరించింది. ప్రైవేటు బస్సులు, యాప్ బేస్డ్ టాక్సీలు, క్యాబ్‌లు యథావిధిగా రోడ్డెక్కాయి. అస్సాంలో ట్రేడ్ యూనియన్ల కన్నా ఎక్కువగా విద్యార్థి సంఘాలే సమ్మెకు మద్దతిచ్చాయి. అనధికారికంగా విధులకు గైర్హాజరయ్యే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని మేఘాలయ సీఎస్ హెచ్చరించారు.

రాష్ట్రంలో కనిపించని సమ్మె ప్రభావం

హైదరాబాద్, వెలుగు: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మె ప్రభావం తెలంగాణలో కనిపించలేదు. బస్సులు, ఆటోలు తిరిగాయి. వ్యాపార సముదాయాలు తెరుచుకున్నాయి. కొన్ని యూనియన్లు మాత్రమే సమ్మెకు మద్దతిచ్చాయి. ఆర్టీసీ, విద్యుత్‌లాంటి సంఘాల కార్మికులు మధ్యాహ్న భోజన విరామంలో నిరసన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు మాత్రం కొంతమేర సమ్మెలో పాల్గొన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 90శాతం బస్సులు నడిచాయని, ఖమ్మంలో మాత్రం 70శాతం మాత్రమే రోడ్డెక్కాయని అధికారులు చెబుతున్నారు. అయితే 10వేల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు. ఇక క్యాబ్‌లు, ఆటోలు కూడా 30నుంచి 40శాతం వరకు మాత్రమే నడిచాయి. బ్యాంకులు పాక్షికంగా మూతపడ్డాయి.

తుమ్మలను కలిసిన టీడీపీ ఎమ్మెల్యే మెచ్చా


ఖమ్మం, వెలుగు: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో అశ్వారావుపేట టీడీపీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు భేటీ అయ్యారు. సత్తుపల్లి సమీపంలోని ఓ కొబ్బరితోటలో మంగళవారం ఉదయం సమావేశం జరిగింది. మెచ్చా టీఆర్ఎస్‌లో చేరనున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో అత్యంత రహస్యంగా, పోలీసుల పహారా మధ్య జరిగిన ఈ భేటి ప్రాధాన్యం సంతరించుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరపున మెచ్చా నాగేశ్వరరావు, సండ్ర వెంకట వీరయ్య ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. అయితే కొద్ది రోజులుగా వీరిద్దరు టీఆర్ఎస్‌లో చేరుతున్నారనే ప్రచారం బాగా జరుగుతోంది. దీనిపై సండ్ర కొంత సానుకూల సంకేతాలు ఇచ్చినప్పటికీ, మెచ్చా మాత్రం ఈ వార్తను ఖండిస్తూ వచ్చారు. కాగా ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చే బాధ్యతలను సీఎం తన సన్నిహితులకు అప్పగించినట్టు సమాచారం. తుమ్మలతో మెచ్చా భేటీ కావడంతో ఆయన టీఆర్ఎస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే తుమ్మలతో భేటీపై మెచ్చా నాగేశ్వర్ రావు స్పందించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి బాధలో ఉన్న తుమ్మలను గతంలో ఉన్న పరిచయం కారణంగా పలకరించేందుకు వచ్చానని ఆయన చెబుతున్నారు.


నిట్‌లో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నిట్‌లో రక్తదానం రికార్డు

హన్మకొండ, వెలుగు :

రక్తదానం చేయడం మానవత్వానికి నిదర్శనమని వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో నేషనల్ యూత్ డేను పురస్కరించుకుని నిర్వహిస్తున్న యూత్ ఫెస్ట్ - 2019 కొనసాగుతోంది. వరంగల్ నిట్ స్టూడెంట్స్ కౌన్సిల్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో మెటలాజికల్ ఇంజినీరింగ్ అండ్ సైన్స్ బ్లాక్‌లో రెండో రోజైన మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరం జరిగింది. వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు ప్రశాంత్ జీవన్ పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్‌రావు, స్టూడెంట్ కౌన్సిల్ సెక్రెటరీ రామిశెట్టి ప్రశాంత్ కన్వీనర్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానంతో ఆపదలో ఉన్న వారికి పునర్జన్మ ఇవ్వొచ్చని అన్నారు. నిట్ విద్యార్థులు మూడు నెలలకోసారి రక్తదాన శిబిరాలను నిర్వహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. నిట్‌లో చదివే విద్యార్థులు ఇక నుంచి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమానిటీగా పిలువబడాలని కాంక్షించారు. వరంగల్ రెడ్‌క్రాస్ సొసైటీ హెల్త్ క్యాంపులు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు, తలసేమియా ప్రత్యేక సెంటర్ పెట్టివ్యాధిగ్రస్తులకు ఉచితంగా రక్తం ఎక్కించడం, సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత వైద్య పరీక్షలు చేయడం అభినందనీయమన్నారు. ఎన్ఐటీ డైరెక్టర్ ఎన్‌వీ.రమణారావు మాట్లాడుతూ రక్తదానం చేయండి ప్రాణాలు కాపాడండి అని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో 1,120 యూనిట్ల రక్తాన్ని సేకరించడం రికార్డు అని రెడ్‌క్రాస్ సభ్యుడు ఈవీవీ శ్రీనివాస్ తెలిపారు. ఇండియాలోని రెడ్‌క్రాస్ శాఖల్లో వరంగల్ శాఖ ఈ ఘనత చాటిందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ చైర్మన్ డాక్టర్ పి.విజయ్‌చందర్‌రెడ్డి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ రామ్‌గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


జక్రాన్ పల్లి మండలం మనోహరాబాద్ గ్రామం వ్యూ

పంచాయతీల్లో డమ్మీలు

పంచాయతీ ఎన్నికల్లో డమ్మీ అభ్యర్థులు పరేషాన్ జేస్తున్నరు.. అసలు అభ్యర్థులను ఆగం వట్టిత్తున్నరు. సర్పంచిగా ఎన్నికల బరిలోకి దిగి గెలిచే సత్తా లేకపోయినా, పోటీలో ఉంటానంటూ ప్రచారం చేసుకుంటున్నరు. నేనంటే నేను నామినేషన్ వేస్తానని ముందుకురుకుతున్నరు. నామినేషన్ వేసాక ఎంతో కొంత దండుకుందామని ఆశపడుతున్నరు.

- ఆగం చేసి.. అందినకాడికి దండుకునే ఎత్తులు
- ఆర్మూరు డివిజన్‌లో ఆషామాషీ అభ్యర్థులు
- అసలు పోటీదారుల్లో అయోమయం

నిజామాబాద్ , వెలుగు:

పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ సోమవారం మొదలైంది. ఆర్మూర్ డివిజన్‌లోని 11 మండలాల పరిధిలోని 177 పంచాయతీలు, 1746 వార్డులలో మొదటి విడత ఎన్నికలు జరుగనున్నాయి. ఓటుహక్కు ఉంటే చాలు నామినేషన్ వేసేస్తాననే నాయకులు ఎక్కువయ్యారు. డిపాజిట్ తక్కువగా ఉండటంతో నామినేషన్లు వేసేందుకు క్యూ కడుతున్నారు. పోటీ భయం చూపి ఎంతో కొంత దండుకుందామనే డమ్మీ అభ్యర్థులే ఎక్కువగా ఉన్నారు. సర్పంచు కావాలని అనుకుని బరిలోకి దిగుతున్న వాళ్లు డమ్మీ అభ్యర్థులతో గందరగోళానికి గురవుతున్నారు. ఎన్నికలు పార్టీలకు సంబంధం లేకుండా జరిగేవే అయినా పోటీలో నిలబడుతున్నది మాత్రం ఆయా పార్టీల కిందిస్థాయి నేతలే. ఎన్నికలకోసం ముందు నుంచే సిద్ధమయినవీళ్లు భారీగా ఖర్చు చేసేందుకు సిద్ధపడ్డారు. ఇదే డమ్మీ అభ్యర్థులు రంగంలో దింగేందుకు కారణంగా మారింది. ఏ అవకాశాన్ని వదులుకోవద్దని భావిస్తున్న నేతలు నామినేషన్లు వేసిన వారికి ఎంతో కొంత ముట్టజెప్పి తప్పించాల్సి వస్తోందని అంటున్నారు. నలుగురిలో మంచి పేరున్నవారిని జనం గౌరవిస్తున్నారే తప్ప ఎన్నికల్లో గెలిపించే పరిస్థితులు లేవు. బాగా ఖర్చు పెట్టినవారే గెలుస్తున్నారు. పార్టీలు కూడా అలాంటివారికే మద్దతిస్తున్నాయి. ఎన్నికల్లో ఓటర్లను మంచి చేసుకునేందుకు, కేడర్‌ను కాపాడుకునేందుకు భారీగా ఖర్చు చేయాల్సిఉంటుంది. అలాంటి గెలుపు గుర్రాలనే బరిలో దింపనున్నారు. మరికొందరు ఎలాగైనా గెలవాలని ఉన్న ఆస్తులు అమ్ముకుని మరి పోటీకి సిద్ధపడుతున్నారు. ఆర్మూరు ప్రాంతానికి చెందిన నలుగు రైదుగురు అభ్యర్థులు దగ్గరి బంధువులు, స్నేహితుల వద్ద ఎన్నికల కోసం అప్పులు చేసినట్టు తెలుస్తోంది. అప్పు చేయొద్దన్నందుకు కుటుంబాల్లో గొడవలు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. నిజంగా పోటీ చేస్తున్నవారు నానా అవస్థలు పడుతుంటే డమ్మీ అభ్యర్థులు ఏ ఇబ్బందిలేకుండా నాలుగు రాళ్లు వేనకేసుకునేందుకు ముందుకొస్తున్నారు.

గుర్రంపోడు @ 63.30 లక్షలు

- **వేలం పాటలో ఏకగ్రీవ తీర్మానం**

నల్లగొండ, వెలుగు: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలో వేలం పద్ధతిలో నాలుగు పంచాయతీల ఏకగ్రీవానికి రంగం సిద్ధమైంది. గ్రామాభివృద్ధికి ఎవరు ఎక్కువ డబ్బులిస్తే వారికే పదవులు కట్టబెట్టేలా తీర్మానం జరిగింది. ఈ పోటీలో మండల కేంద్రమైన గుర్రంపోడు సర్పంచ్ పదవిని అధికార పార్టీ నాయకుడొకరు రూ.63.30 లక్షలకు దక్కించుకున్నారు. ఈ పదవికి వివిధ పార్టీల నాయకులతో పాటు స్థానిక వ్యాపారులు సైతం పోటీ పడ్డారు. ఒక్కొక్కరు రూ.ఐదు లక్షలు డిపాజిట్ చేసి మరీ వేలంలో పాల్గొన్నారు. మొత్తం 15 మందిలో అత్యధికంగా డబ్బులిచ్చేందుకు ముందుకొచ్చిన వారికి సర్పంచ్ పదవిని ఏకగ్రీవంగా అప్పగించేందుకు సిద్ధమయ్యారు. సర్పంచ్ పదవి దక్కించుకున్న వారే పంచాయతీలోని మొత్తం వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్‌ను ఎన్నుకునేలా ఆఫర్ సైతం ప్రకటించారు. నామినేషన్ల విత్‌డ్రా కంటే ఒక రోజు ముందే డబ్బులు చెల్లించాలని నిర్ణయించుకున్నారు. సమయానికి డబ్బులు చెల్లింకపోతే ఎక్కువ వేలం పాడిన రెండో వ్యక్తికి అవకాశమిస్తారు. గుర్రంపోడుతో పాటు అదే మండలంలోని చామలేడు, మైలాపురం గ్రామాల్లో సర్పంచ్ పదవులను రూ.16.50 లక్షల రేటుకు ఏకగ్రీవంగా కట్టబెట్టారు. తేనెపల్లి తండా సర్పంచ్ పదవిని రూ.4 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు.

బ్యాంకు రుణాలు ఏం చేస్తున్నారు ?

యాదాద్రి, వెలుగు: స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళా సాధికారతపై అధ్యయనం చేసేందుకు సిక్కిం రాష్ట్రం త్రిపురకు చెందిన 30 మంది బ్యాంకు అధికారులు మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ అనితారామచంద్రన్, సెర్ప్ అధికారులతో సమావేశమై బ్యాంకుల ద్వారా సంఘాలకు ఇస్తున్న రుణాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలుసుకున్నారు. బుధ, గురువారాల్లో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై, బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్న వారు సాధించిన అభివృద్ధి, స్వయం ఉపాధిని తెలుసుకోనున్నారు.

జయవిజయుల విగ్రహ ప్రతిష్ఠ



యాదాద్రి, వెలుగు: యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా దివ్య విమాన రాజగోపురంపై ద్వారపాలకులైన జయవిజయుల విగ్రహాలను మంగళవారం ప్రతిష్ఠించారు. ప్రధానాలయం చుట్టూ 7 రాజగోపురాల నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. పశ్చిమం వైపు సప్తతల రాజగోపురం, నాలుగు వైపులా పంచతల రాజగోపురాలు, గర్భాలయం మీద దివ్య విమాన రాజగోపురం, గర్భాలయం ముందు త్రితల రాజగోపుర నిర్మాణాలను పూర్తి చేశారు. సప్తతల రాజగోపురంపై మహానాసిని ప్రతిష్ఠించారు. విమాన గోపురంపై 40 విగ్రహాలను అమర్చనున్నారు. బుధవారం నాటికి ప్రతిష్ఠను పూర్తి చేయనున్నారు. పని పూర్తయితే రాజగోపురాల నిర్మాణాలు పూర్తైనట్లే.

కలప స్మగ్లర్లపై నిఘా పెట్టండి

- **ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పీకే.ఝా ఆదేశం**
- **ఎఫ్ఆర్వో హఫీజుద్దీన్ సస్పెన్షన్**

హైదరాబాద్, వెలుగు: చెట్ల నరికివేత, కలప అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలని అటవీ శాఖ అధికారులకు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) పీకే.ఝా ఆదేశించారు. మంగళవారం అన్ని జిల్లాల అటవీశాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలప స్మగ్లర్లపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలన్నారు. పోలీసుల సాయంతో వారిపై నిరంతరం నిఘా పెట్టాలని, ముందస్తు అరెస్టులకు వెనుకాడొద్దని సూచించారు. అటవీ సంరక్షణ, హరితహారంపై సీఎం కేసీఆర్ ఆదేశాలను వంద శాతం అమలు చేయాలన్నారు. అడవుల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై సోమవారం సీఎం కేసీఆర్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన నేపథ్యంలో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు.



హఫీజుద్దీన్

ఎఫ్ఆర్వో సస్పెన్షన్

పులి చర్మం కేసులో పట్టుబడిన నిందితుడు ప్రకాశ్‌కు సహకరించిన ఆరోపణలపై నిర్మల్ జిల్లా పెంబి రేంజ్ ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్వో హఫీజుద్దీన్‌ను ఉన్నతాధికారులు మంగళవారం సస్పెండ్ చేశారు. ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఆదిలాబాద్ సీఎఫ్ శరవరణ్ జరిపిన విచారణలో నిందితుడు ప్రకాశ్‌తో హఫీజుద్దీన్ లింకులు బయటపడ్డాయి. డిసెంబర్ 31న నీల్గాయ్‌ని వేటాడిన నిందితుడు ప్రకాశ్‌పై కేసు నమోదు చేయకుండా సహకరించినట్లు తేలింది. ఇసుక అక్రమ తవ్వకాలకు కూడా హఫీజుద్దీన్ సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. హఫీజుద్దీన్‌కు సహకరించిన సిబ్బందిపై కూడా చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు చెప్పారు.

అరవయ్యేళ్ల ఆదర్శానికి బ్రేక్!

తెల్దారుపల్లిలో 60 ఏళ్లుగా సర్పంచ్ ఎన్నికలకు ఓటింగ్ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ వస్తున్న ఆదర్శ గ్రామం. ఊరంతా ఏకతాటిపై ఉండి సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకునే సంప్రదాయం ఈసారి బ్రేక్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఆ ఊరి నుంచి ఇండిపెండెంట్ గా ఒకరు నామినేషన్ వేయగా, సీపీఎం పార్టీ మద్దతుతో మరొకరు బరిలో ఉంటుంటడమే దీనికి కారణం.



- తెల్దారుపల్లిలో తొలి నామినేషన్
- తమ్మినేని కుటుంబం నుంచే పోటీ ఏకగ్రీవమయ్యే అవకాశం లేనట్టేనా..?

ఖమ్మం, వెలుగు:

ఖమ్మం రూరల్ మండలంలోని తెల్దారుపల్లి గ్రామ పంచాయతీకి సర్పంచ్ కోసం తొలి నామినేషన్ దాఖలైంది. సీపీఎం ఆధిపత్యం ఉండే ఆ గ్రామంలో మొదటి నుంచి తమ్మినేని కుటుంబ సభ్యుల మాట, ఊరి కట్టుబాట్లను జనం జవదాటరు. అందరూ కలిసి సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఖరారు చేస్తారు. వారు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ప్రతి సారి ఎన్నిక ఏకగ్రీవమవుతుంది. కానీ ఈసారి గ్రామ కమిటీతో సంబంధం లేకుండా సొంతంగా అదే గ్రామానికి చెందిన తమ్మినేని కృష్ణయ్య నామినేషన్ దాఖలు చేశారు. దీంతో పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడిన తర్వాత తొలిసారి తెల్దారుపల్లిలో గ్రామ పంచాయతీ సర్పంచ్, 12 మంది వార్డు సభ్యులను ఓటింగ్ ద్వారా ఎన్నుకునే అవకాశం కనిపిస్తోంది.

సీపీఎంలో విభేదాలు..

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీపీఎం పార్టీలో ఏర్పడిన అభిప్రాయ భేదాలే ఈ పరిణామాలకు కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో తెల్దారుపల్లి గ్రామ పంచాయతీ ఉండగా, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ తమ్మినేని కృష్ణయ్య, తమ్మినేని కోటేశ్వర్ రావు ను ఇటీవల పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. గ్రామంలో సుమారు 3 వేలకు పైగా ఓటర్లుండగా, అందులో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ కు వెయ్యికి పైగా ఓట్లు పోలయ్యాయి. సీపీఎం తప్ప మరో పార్టీ లేని గ్రామంలో కారు గుర్తుకు 1,020 ఓట్లు పోల్ కావడం సంచలనంగా మారింది. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ టేకులపల్లి సొసైటీ చైర్మన్‌గా ఉన్న కృష్ణయ్యను ఏడాది పాటు, సీపీఎం పార్టీ నియమాలను ఉల్లంఘించారంటూ కోటేశ్వర్ రావును ఆర్నెళ్ల పాటు సస్పెండ్ చేస్తూ సీపీఎం గ్రామ కమిటీ తీర్మానం చేసింది. దీంతో కృష్ణయ్య నామినేషన్ దాఖలు చేయడం తెల్దారుపల్లి గ్రామంలోనే కాదు, ఖమ్మం జిల్లాలో సంచలనంగా మారింది. ఆసక్తికరంగా రాజకీయం గ్రామంలో ఇప్పటికే సర్పంచ్ కోసం ఒక నామినేషన్ దాఖలు కాగా, గ్రామ కమిటీ నుంచి ఇతరులు కూడా సర్పంచ్‌గా నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. వీటితో పాటు గ్రామ కమిటీ సూచించిన వారు మాత్రమే కాకుండా, వార్డు సభ్యులకు కూడా ఎన్నిక జరిగేలా పోటీ చేసేందుకు ఇంకొందరు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో ఈసారి గ్రామంలో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయా ? లేక నామినేషన్ వేసిన అభ్యర్థిని విత్‌డ్రా చేయించి ఏకగ్రీవం చేస్తారా అని గ్రామస్తులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఒకవేళ ఎన్నికలు జరిగితే ఈ గ్రామానికి ఉన్న 60 ఏళ్ల ఏకగ్రీవ చరిత్ర ముగిసిపోయినట్టే.

పోటీ ఖాయం



తెల్దారుపల్లి గ్రామంలో ఏకపక్ష రాజకీయాలు ఇక చెల్లవు.గ్రామస్తులు ఎక్కువ మంది నావైపే ఉన్నరు. పెద్ద మనిషిగా చెప్పుకుంటున్న కోటేశ్వర్ రావుపై చాలా వ్యతిరేకత ఉంది. బహిరంగంగా జనం బయటకు రాకపోయినా, ఎన్నికలు జరిగితే నేనే గెలుస్తా. వార్డు సభ్యులుగా కూడా చాలా మంది పోటీ చేసేందుకు సిద్ధమవుతుండ్రు.

- తమ్మినేని కృష్ణయ్య

ఏకగ్రీవం అవుతుందని నమ్ముతున్నాం

ప్రభుత్వం ఇచ్చే నిధుల కోసం ఇప్పుడు చాలా గ్రామాల్లో ఏకగ్రీవం కోసం ప్రయత్నాలు చేస్తుంటే, 60 ఏళ్లుగా ఏకగ్రీవం అవుతున్న తెల్దారుపల్లిలో ఎన్నికలు జరిగే పరిస్థితి రావడం బాధాకరం. ఇన్నేళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని కాపాడుకోవాలని గ్రామస్తులు కోరుకుంటుండ్రు. ఈసారి కూడా ఏకగ్రీవంగానే ఎన్నిక జరుగుతుందని నమ్ముతున్నం.

- తమ్మినేని కోటేశ్వర్ రావు, తెల్దారుపల్లి



వారి మృతదేహాలు వచ్చాయి

- కన్నీటి వీడ్కోలు పలికిన బంధువులు
- నివాళులర్పించిన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

మెదక్, వెలుగు: తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వారికి మంగళవారం వారి స్వగ్రామాల్లో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి వీడ్కోలు పలికారు. తమిళనాడులోని పుదుక్కొట్టై వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన 10 మంది మృతదేహాలు 48 గంటల అనంతరం వారి స్వగ్రామాలకు చేరుకున్నాయి. పోస్ట్‌మార్టం తర్వాత సోమవారం సాయంత్రం అక్కడి నుంచి మృతదేహాలతో బయలుదేరిన అంబులెన్స్‌లు మంగళవారం సాయంత్రం 5:30 గంటలకు నర్సాపూర్ టౌన్‌కు చేరుకున్నాయి. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రాజమణి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కలెక్టర్ ధర్మారెడ్డి, జేసీ నగేష్, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మురళీయాదవ్‌లు మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణవాసులతో పాటు, చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో నర్సాపూర్‌లోని మెయిన్ రోడ్డు కిక్కిరిసిపోయింది. మృతదేహాలు తీసుకువచ్చిన అంబులెన్స్‌లు నర్సాపూర్ నుంచి మండల పరిధిలోని చిన్నచింతకుంట, రెడ్డిపల్లి, మంతూర్, ఖాజీపేట గ్రామాల్లోని వారి వారి ఇండ్లకు చేరుకున్నాయి. తమ వారి మృతదేహాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు మృతదేహాలను చూసి బోరున విలపించారు. అయ్యప్ప దర్శనానికి వెళ్లిన వారు విగత జీవులుగా ఇండ్లకు చేరుకోవడంతో తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, బంధువుల రోదనలతో అక్కడికి వచ్చిన ప్రజలకు సైతం కన్నీళ్లు తెప్పించాయి. మాజీ మంత్రి సునీతారెడ్డి మంగళవారం సాయంత్రం ఆయా గ్రామాలకు వచ్చి మృతుల కుటుంబాలను పరామర్శించారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది

మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీఎంతో చర్చించి ఎక్స్‌గ్రేషియా మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. మృతుల పిల్లల చదువు కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు.

నిజాలు మాట్లాడితే సస్పెండ్ చేస్తరా?

- **పీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ చిత్తరంజన్ దాస్**

నాగర్‌కర్నూల్, వెలుగు: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎందుకు తిరస్కరించారో తెలిసినా.. రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం మాత్రం కుంటి సాకులు చెబుతున్నదని పీసీసీ ఓబీసీ సెల్‌చైర్మన్ చిత్తరంజన్‌దాస్ విమర్శించారు. మంగళవారం కల్వకుర్తిలో విలేకరులతో మాట్లాడిన ఆయన పీసీసీ నాయకత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీసీసీ, సీఎల్పీ, వర్కింగ్ ప్రసిడెంట్ వంటి కీలక పోస్టులు ఒకే సామాజిక వర్గానికి కట్టబెట్టి ఏకపక్ష సమీక్షలతో నవ్వుల పాలవుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓటమికి దారితీసిన కారణాలు విశ్లేషించిన సీనియర్ నాయకుడు సర్వే సత్యనారాయణను సస్పెండ్ చేయడం వారి మానసిక స్థితికి అద్దం పడుతుందన్నారు. ఓటమికి పొత్తులు,ఈవీఎంలు, టీఆర్ఎస్ బూటకపు హామీలంటూ తమ నాయకత్వాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నించడం విడ్డూరమన్నారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మైనార్టీలకు అండగా నిలిచిన కాంగ్రెస్ మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చారని మండిపడ్డారు.

నైపుణ్య శిక్షణకు 50 మంది ఎంపిక

హైదరాబాద్, వెలుగు: అపోలో మెడ్ స్కిల్స్ ఆధ్వర్యంలో బీసీ కార్పొరేషన్ నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 50 మంది ఎంపికయ్యారు. మంగళవారం నిర్వహించిన ఎంపిక కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఎండీ అలోక్‌కుమార్, రజక ఫెడరేషన్ ఎండీ కె. చంద్రశేఖర్, బీసీ కార్పొరేషన్ జీఎం రాంరెడ్డి, డాక్టర్ సుభాష్ పాల్గొన్నారు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఫ్లెబాటమీ టెక్నీషియన్ విభాగాల్లో వీరికి శిక్షణ ఇవ్వనున్నారు.

‘ఈబీసీలకు రిజర్వేషన్లను స్వాగతిస్తున్నాం’

హైదరాబాద్, వెలుగు: అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఏపీ పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి మంగళవారం అన్నారు. తాము ఏపీలో చేపట్టిన ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమంలో ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. ఏఐసీసీ మేనిఫెస్టో కమిటీలో దీన్ని చేర్చాలని సిఫారసు చేశామన్నారు. నాలుగున్నరేళ్లు కాలయాపన చేసిన బీజేపీ హడావుడిగా దీన్ని అమలు చేయాలనుకోవడంలో నిజాయితీ కనిపించడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నిర్ణయం తీసుకొని ఉంటే ఈబీసీలకు మేలు జరిగేదన్నారు. మోడీ సర్కార్ పై అన్ని వర్గాల్లో వచ్చిన వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. సీబీఐ విషయంలో మోడీకి సుప్రీం మొట్టికాయ వేసినా మార్పు లేదని ఎద్దేవా చేశారు.

భూసార సంరక్షణలో కలిసి పనిచేయాలి

- ఫ్లోరిడా, జయశంకర్ వర్సిటీల నిర్ణయం

హైదరాబాద్, వెలుగు: వ్యవసాయం, భూసార సంరక్షణ అంశాలలో కలిసి పనిచేయాలని యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలు నిర్ణయించాయి. మంగళవారం వర్సిటీలో జరిగిన సమావేశంలో వీసీ ప్రవీణ్‌రావు, రిజిస్ట్రార్ సుధీర్ కుమార్, ఫ్లోరిడా యూనివర్సిటీ ప్రొఫెసర్ రమేష్ రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో సాగునీటి విశ్లేషణ, భూసార పరీక్షలు, మైక్రోబియల్ విశ్లేషణలో ఫ్లోరిడా వర్సిటీ సాంకేతిక సహకారం అందించాలన్నారు. కాగా, ఆర్గానిక్ ఫార్మింగ్‌లో సహకారానికి హరిద్వార్‌లోని పతంజలి బయో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌తో జయశంకర్ వర్సిటీ ఎంవోయూ కుదుర్చుకుంది.

పార్టీల ప్రతినిధులతో సీఈవో భేటీ

- సవరించిన ఓటరు జాబితాపై అభిప్రాయాల సేకరణ

హైదరాబాద్, వెలుగు: సవరించిన కొత్త ఓటరు జాబితాపై గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సీఈవో రజత్‌కుమార్ మంగళవారం సమావేశమయ్యారు. 3 గంటలు జరిగిన ఈ భేటీలో జనవరి ఒకటి నాటి ముసాయిదా ఓటర్ల జాబితాపై నేతల అభిప్రాయాలు తీసుకున్నారు. 2019 ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు అందరూ సహకరించాలని కోరారు. ఓటరు జాబితా తప్పులు, ఓట్ల గల్లంతును నేతలు ఈ సందర్భంగా నేతలు ప్రస్తావించారు.

11, 12 తేదీల్లో సీఈవోలతో ఈసీ భేటీ

ఈ నెల 11, 12 తేదీల్లో అన్ని రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులతో ఈసీ సమావేశం కానుంది. ఢిల్లీలో జరిగే ఈ భేటీకి రాష్ట్ర సీఈవో రజత్‌కుమార్ హాజరుకానున్నారు. ఇటీవలి 5 రాష్ట్రాల ఎన్నికల నిర్వహణ లోటుపాట్లు, లోక్‌సభ ఎన్నికలకు తుది ఓటర్ల జాబితా తయారీపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఖాళీ అయిన శాసనమండలి స్థానాలపైనా స్పష్టత రావొచ్చు.

చల్లగిద్ద ఏకగ్రీవం

నారాయణఖేడ్, వెలుగు: మండలంలోని చల్లగిద్ద తండా గ్రామ పంచాయతీకి ఏకగ్రీవంగా సర్పంచ్ వార్డు సభ్యులను ఎన్నుకోవడానికి తండావాసులు తీర్మానం చేసుకున్నారు. ర్యాకల్ పరిధిలోని చల్లగిద్ద తండాను కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఈ తండాలో 752 మంది ఓటర్లు ఎనిమిది వార్డులున్నాయి. గతంలో ఇది గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. ప్రస్తుతం నూతన పంచాయతీగా వెలసిన తండా బంజారా సేవాలాల్ సంఘం జిల్లా నాయకుడు రమేష్ చౌహాన్‌ను సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నుకున్నారు. పలుగు తండాలో సైతం ఏకగ్రీవంగా చాప్లి బాయ్‌ని సర్పంచ్ గా ఎన్నుకున్నారు.

బోగస్ చిట్టీలకు చెల్లుచీటీ

త్వరలోనే బ్లాక్‌టెల్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్.. రిజిస్ట్రేషన్ల శాఖలో కొత్త సంస్కరణలు



- ఇప్పటికే స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌కు స్లాట్‌బుకింగ్
- పది నిమిషాల్లోనే డాక్యుమెంట్లు.. దళారీ దందాకు చెక్
- ఆన్‌లైన్‌లో ఐదు నిమిషాల్లోనే పెళ్లి సర్టిఫికెట్
- లక్ష్యాన్ని మించిపోయిన ఆదాయం

హైదరాబాద్, వెలుగు: పది నిమిషాల్లో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్.. ఐదు నిమిషాల్లో పెళ్లి సర్టిఫికెట్.. దళారుల బెడద లేకుండా ముందే స్లాట్ బుకింగ్.. ఇప్పటిదాకా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో తీసుకొచ్చిన సంస్కరణలు. వాటిని మరింత ముందుకు తీసుకెళుతూ బోగస్ చిట్‌ఫండ్ల భరతం పట్టే సరికొత్త సాఫ్ట్‌వేర్‌ను తీసుకురాబోతున్నామని చెప్పారు రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ చిరంజీవులు. రాష్ట్రం వచ్చాక రియల్‌భూమ్ పుంజుకోవడంతో ఆదాయమూ భారీగానే వస్తోందన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.5400 కోట్లు టార్గెట్ పెట్టుకోగా, ఇప్పటికే రూ.4,700 కోట్ల ఆదాయం వచ్చిందని చెప్పారు. మిగతా మూడు నెలల్లో మరో రూ.1500 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

బోగస్ చిట్టీలకు చెల్లుచీటీ

బోగస్ చిట్టీల వల్ల రాష్ట్రంలో వేలాది మంది జనం నష్టపోతున్నారు. ఇటీవలే రిషభ్ చిట్‌ఫండ్స్ అనే సంస్థ, వినియోగదారులకు దాదాపు 70 కోట్ల వరకు టోపీ పెట్టిపోయింది. అలాంటి చిట్‌ఫండ్ కంపెనీల మోసాలకు చెక్‌పెట్టేలా త్వరలోనే బ్లాక్‌టెల్ టెక్నాలజీ అనే సాఫ్ట్‌వేర్‌ను రిజిస్ట్రేషన్ల శాఖ తీసుకురాబోతోంది. ఇప్పటికే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు చేపడుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. అంతేకాదు ఈ సాఫ్ట్‌వేర్‌తో చిట్‌ఫండ్ సంస్థ రిజిస్టర్ అయిందా లేదా అన్న విషయాన్నీ తెలుసుకోవచ్చు. రిజిస్టర్ చేసుకున్న చిట్టీ సంస్థలు నెల నెలా నిర్వహించే చిట్టీల వివరాలను రిజిస్ట్రేషన్ శాఖకు ఇవ్వాల్సి ఉంటుంది.

స్లాట్ బుకింగ్‌కు ఫుల్ డిమాండ్

ఒకప్పుడు ఏదైనా ల్యాండ్ కొన్నా, ఇల్లు కొన్నా రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే.. ఆఫీసు దగ్గర ఫుల్లుగా దళారులుండేటోళ్లు. ఆ దళారులకు చెక్ పెట్టేందుకు రిజిస్ట్రేషన్ శాఖ స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చింది. పదే పదే ఆఫీసు చుట్టూ తిరగకుండా.. స్లాట్ బుక్ చేసుకుని ఇచ్చిన టైంకు వెళితే సరిపోతుంది. ఈ పద్ధతిలో రోజుకు 18 మందికి అవకాశం ఇస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. అక్టోబర్ నుంచి అమల్లోకి వచ్చిన ఈ విధానంతో ఇప్పటిదాకా 26,260 మంది స్లాట్ బుక్ చేసుకున్నట్టు చెప్పారు. ఈ పద్ధతిలో 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ తాలూకు పత్రాలు ఇవ్వడంతో పాటు రిజిస్ట్రేషన్ సీడీని కూడా ఇస్తున్నారు.

పెళ్లి సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లోనే

హిందూ మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం ప్రత్యేకంగా ఓ యాప్‌ను తీసుకొచ్చింది రిజిస్ట్రేషన్ శాఖ. పెళ్లి ఫొటోలు, ఇతర వివరాలు నమోదు చేస్తే 5 నిమిషాల్లోనే సర్టిఫికెట్ ఇచ్చేస్తున్నారిప్పుడు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నా, సర్టిఫికెట్ కోసం రిజిస్ట్రేషన్ ఆఫీసుకు కొత్తజంట వెళ్లాల్సి ఉంటుంది. ఈ పద్ధతిలో ఇప్పటిదాకా 12,626 మందికి పెళ్లి సర్టిఫికెట్లు ఇచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. యాప్ రాకముందు ఏటా లక్షల పెళ్లిళ్లు అవుతున్నా సర్టిఫికెట్ తీసుకున్న వారి సంఖ్య వేలల్లోనే ఉండేది. ఇప్పుడు చాలా మంది కొత్తగా పెళ్లయినోళ్లు ఆన్‌లైన్‌లో పెళ్లి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారట.

డబ్బులు వసూలు చేయొద్దు

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో డబ్బులు వసూలు చేసేటోళ్లపై చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఆదిలాబాద్, మారేడ్ పల్లి, మూసాపేట్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో డబ్బులు వసూలు చేసినోళ్లను సస్పెండ్ చేశాం. రిజిస్ట్రేషన్‌కు కట్టాల్సిన మొత్తాన్ని బ్యాంకుల్లోనే చలాన్ల రూపంలో చెల్లించాలి. దానికన్నా ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా, ఆ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అధికారులు, సిబ్బంది సక్రమంగా పనిచేసేలా, సమయానికి వచ్చేలా సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానం తీసుకొచ్చాం. ఈ కొత్త సంస్కరణలకు జనం నుంచి మంచి ఆదరణ వస్తోంది.

- చిరంజీవులు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ

రాజాసింగ్ ను అనర్హుడిగా ప్రకటించాలి: దాసోజు

హైదరాబాద్, వెలుగు: మైనార్టీ వర్గానికి చెందిన ప్రొటెం స్పీకర్ ఎదుట ప్రమాణ స్వీకారం చేయనని ప్రకటించిన గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై అనర్హత వేటు వేయాలని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ మంగళవారం డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలు మైనార్టీలను కించపరిచేలా ఉన్నాయన్నారు. రాజాసింగ్ సభ్యత్వాన్ని రద్దు చేసేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రాజాసింగ్‌పై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. 43 కేసులున్న వ్యక్తిని ఎందుకు అరెస్టు చేయలేదో ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేయాలన్నారు. రాజాసింగ్ ఎంఐఎం సృష్టేనన్నారు. ఒవైసీ సోదరులు, రాజాసింగ్ ద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ ఒకరికొకరు సహకరించుకుంటున్నారని ఆరోపించారు. రాజాసింగ్ వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా స్పందించాలన్నారు. బీజేపీ అన్ని మతాల పట్ల సమభావంతో ఉన్న పార్టీ అయితే రాజాసింగ్‌ను బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తులు

హైదరాబాద్, వెలుగు: ఎస్సీ నిరుద్యోగులు నైపుణ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చీరాం భూక్యా తెలిపారు. హైదరాబాద్ హైటెక్స్‌లో 3 నెలల పాటు న్యాక్ సంస్థ వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తుందని చెప్పారు. బీటెక్ (సివిల్) వాళ్లకు ఫినిషింగ్ స్కూల్ ప్రోగ్రాం, డిగ్రీ వాళ్లు స్టోర్ కీపర్, ఇంటర్ చదివినోళ్లు జనరల్ వర్క్స్ సూపర్‌వైజర్స్, ల్యాండ్ సర్వేయర్, ఎనిమిది దాకా చదివిన వాళ్లు ఇంట్లో కరెంట్ వైరింగ్, వెల్డింగ్, ఐదు చదివినోళ్లు ప్లంబింగ్ (నల్లాల పని), పరిశుభ్రత, ఫాల్ సీలింగ్ శిక్షణకు అర్హులున్నారు. ఆసక్తి ఉన్నవారు జిల్లా ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ట్రాన్స్ జెండర్‌కు కీలక పదవి

మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గా అప్సరా రెడ్డి నియామకం

న్యూఢిల్లీ : ఒక ట్రాన్స్ జెండర్ కు జాతీయ స్థాయి పార్టీ పదవి ఇస్తూ కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్ జెండర్ల హక్కుల కార్యకర్త అప్సరా రెడ్డి ని మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీగా కాంగ్రెస్ నియమించింది. పార్టీ చీఫ్ రాహుల్ గాంధీతో అప్సర దిగిన ఫొటోను కాంగ్రెస్ ట్వీట్ చేసింది. జర్నలిస్టుగా జీవితం ప్రారంభించిన అప్సర తర్వాత పాలిటిక్స్ లోకి ప్రవేశించారు. కొంతకాలం బీజేపీలో ఉన్నారు. 2016 మేలో అన్నాడీఎంకే లో చేరారు. జయలలిత చనిపోయిన తర్వాత శశికళ వర్గంలో కొనసాగారు. ఆ తర్వాత కాంగ్రెస్ లో చేరారు.

‘స్టంట్ కాదు.. సాహసం’

హైదరాబాద్, వెలుగు: అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు సాహసోపేత నిర్ణయమని, ఎన్నికల స్టంట్ కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ మంగళవారం అన్నారు. ఆ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలుపకపోతే ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు. కాన్షీరామ్, మాయావతి, ములాయం కూడా అగ్రవర్ణ రిజర్వేషన్లు సమర్థించారని గుర్తు చేశారు. మతపర రిజర్వేషన్లు 4 నుంచి 12 శాతం కావాలంటున్న అసదుద్దీన్ ఒవైసీ మాటలు అర్థరహితమని విమర్శించారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే పెరిగిన 10 శాతం రిజర్వేషన్లను తెలంగాణలో అమలు చేయాలన్నారు.

అబ్జర్వర్ అనుమతితోనే ఏకగ్రీవం

- పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్

హైదరాబాద్, వెలుగు: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బలవంతపు, వేలం ద్వారా ఏకగ్రీవం ప్రయత్నాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం చెక్ పెట్టింది. పంచాయతీలు ఏకగ్రీవమైనట్టు రిటర్నింగ్ అధికారులు నిర్ధారించొద్దని, జిల్లాల వారీగా ఎన్నికల విధుల్లో ఉన్న అబ్జర్వర్ల అనుమతితో నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల సంఘం కమిషనర్ వి.నాగిరెడ్డి మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. సర్పంచ్, వార్డు మెంబర్ పదవులను వేలం వేసినట్టు ఫిర్యాదొచ్చినా, ఎన్నికల అధికారులు గుర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని నాగిరెడ్డి చెప్పారు. వేలం ద్వారా పదవి పొందిన వారు ఏడాది జైలు శిక్షతో పాటు ఆరేళ్లు పోటీకి అనర్హులవుతారన్నారు. ఫిర్యాదుల కోసం జిల్లాస్థాయిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని, వాటి వివరాలను జిల్లాలో ప్రచారం చేయాలన్నారు.

కార్మికుల జోలికొస్తే ఊరుకోం

- కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాల్సిందే
- ఇందిరాపార్క్ వద్ద కార్మిక సంఘాల మహాధర్నా



మంగళవారం ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

హైదరాబాద్, వెలుగు : కార్మికుల జోలికొస్తే ఊరుకునేది లేదని, కార్మిక చట్టాలను సవరించి ఉద్యమాలను బలహీన పర్చాలని చూస్తే సహించేది లేదని కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేసి, కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా మంగళవారం ఇందిరాపార్క్ వద్ద కార్మిక సంఘాలు మహాధర్నా చేపట్టాయి. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు మాట్లాడుతూ కార్మిక హక్కుల పరిరక్షణ కోసం రెండు రోజులు సమ్మె చేస్తున్నట్టు చెప్పారు. ప్రధాని మోడీ ప్రజల సంపదను కార్పొరేట్లకు చేరవేస్తున్నారని, కార్మికులకు మాత్రం కనీస వేతనాలు ఇవ్వడంలేదని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినా మోడీ సర్కారు అమలు చేయడం లేదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు అన్నారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నారని విమర్శించారు. ధరల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ డిమాండ్ చేశారు. పబ్లిక్ సెక్టార్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు మోడీ సర్కర్ కుట్రలు చేస్తోందని ఐఎన్‌టీయూసీ స్టేట్ వైస్‌ప్రెసిడెంట్ జనక్‌ప్రసాద్ విమర్శించారు. హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి సదానందంగౌడ్, ఏఐయూటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భరత్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంకే బోస్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్ల లెక్కలే చాలు

- వృత్తి విద్యా కాలేజీల్లో ఫీజుల నిర్ణయంపై ఉన్నత విద్యా మండలి

హైదరాబాద్, వెలుగు: వృత్తి విద్యా కాలేజీల్లో ఫీజుల నిర్ణయానికి కాలేజీల రెండేళ్ల ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకోవాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. వాటి ప్రకారమే వచ్చే మూడేళ్ల ఫీజులను నిర్ణయించనుంది. ఈ మేరకు కాలేజీ యాజమాన్యాల నుంచి వివరాలు తీసుకోనుంది. మార్పులపై అడ్మిషన్స్ అండ్ ఫీ రెగ్యులేటరీ అథారిటీ నేడో, రేపో నోటిఫికేషన్ విడుదల చేయనుంది. గతంలో మూడేళ్ల ఆదాయ, వ్యయాలు తీసుకునేవారు. వాటి లో సీఏ ఆమోదించిన లెక్కలు రెండేళ్లవి.. కొనసాగుతున్న విద్యా సంవత్సరం వివరాలను యాజమాన్యాలు నోటరీపై ఇచ్చేవి. కానీ మూడో ఏడాది లెక్కల్లో తేడాలు ఉండటంతో వాటికి చెక్ పెట్టేందుకు మండలి ఈ నిర్ణయం తీసుకుంది. ఏపీలోనూ రెండేళ్ల లెక్కలే పరిగణనలోకి తీసుకుంటుంది.

హోంగార్డు ఆత్మహత్య

సిద్దిపేట, వెలుగు: హుస్నాబాద్ ఫైర్ స్టేషన్‌లో హోంగార్డు బొజ్జనాయక్ మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హుస్నాబాద్ మండలం జిల్లెల్ల తండాకు చెందిన బొజ్జనాయక్ ఏడాదినుంచి ఫైర్ స్టేషన్‌లో డ్యూటీ చేస్తున్నాడు. వ్యక్తిగత సమస్యలతో బొజ్జనాయక్ సూసైడ్ చేసుకున్నట్టు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీహెచ్ఈఎల్ ప్యారడైజ్ సీజ్

పటాన్ చెరు, వెలుగు: రూల్స్ పాటించకుండా హోటల్ నడిపిస్తున్నారని బీహెచ్ఈఎల్ బ్రాంచి ప్యారడైస్ రెస్టారెంట్‌ను అధికారులు సీజ్ చేశారు. మంగళవారం రామచంద్రాపురం జీహెచ్ఎంసీ ఏఎంఓహెచ్ లక్ష్మణ్ సింగ్, ఇతర శానిటరీ అధికారులు హోటల్‌కు సీల్ వేశారు. ఈ విషయమై లక్ష్మణ్ సింగ్ మాట్లాడుతూ ప్యారడైస్ హోటల్ యాజమాన్యం ట్రేడ్ లైసెన్సు, ఫైర్ సేఫ్టీ, ఇతర భద్రతా నియమాలను కూడా పట్టించుకోవడం లేదన్నారు. గతంలో రెండు నోటీసులు ఇచ్చినా హోటల్ యాజమన్యం పట్టించుకోలేదన్నారు.

అగ్రకులాల రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

- బీసీలు ఏకం కావాలి..
- 10న పార్లమెంట్ ముట్టడి: జస్టిస్ ఈశ్వరయ్య

హైదరాబాద్, వెలుగు: అగ్ర కులాల పేదలకు రిజర్వేషన్ ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. ఈ బిల్లు ఎట్ల చూసినా చెల్లదని, సుప్రీం కోర్టులో నిలవదని అన్నారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘాలు అత్యవసర సమావేశం నిర్వహించాయి. ఈబీసీలకు రిజర్వేషన్‌లు కల్పించాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదన్నారు. 56 శాతం ఉన్న బీసీలకు 27 శాతమే రిజర్వేషన్ ఇచ్చి, 4 శాతం ఉన్న అగ్రకులాల వారికి మాత్రం 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం అన్యాయమన్నారు. కేవలం ఎన్నికల కోసమే కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ల బిల్లును పెట్టిందన్నారు. అగ్రకులాల్లోని పేదలకు తాము వ్యతిరేకం కాదని, వారికి సంక్షేమ పథకాలు కల్పించి ఆదుకోవాలన్నారు. బీసీల పొట్టగొట్టి అగ్రకులాలకు రిజర్వేషన్లు ఇవ్వడం అన్యాయమని, బీసీలు ఐక్యంగా లేకే ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయన్నారు. ఈ నెల 10న పార్లమెంట్‌ను ముట్టడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు తగ్గించడంపై ధ్వజమెత్తారు.

టీచర్ ఎమ్మెల్సీ బరిలో మోహన్‌రెడ్డి

హైదరాబాద్, వెలుగు : కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నట్టు మాజీ ఎమ్మెల్సీ బీ.మోహన్‌రెడ్డి మంగళవారం ప్రకటించారు. ఆయనకు గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ (జీహెచ్ఎంఏ), ఎయిడెడ్ టీచర్స్ గిల్డ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అసోసియేషన్ మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ సెగ్మెంట్ నుంచే 2007 నుంచి 2013 వరకూ టీచర్ ఎమ్మెల్సీగా పనిచేసి ఉపాధ్యాయుల అభ్యున్నతికి కృషి చేశానన్నారు. 26 ఏళ్లపాటు పీఆర్‌టీయూలో పనిచేసిన అనుభవం ఉందని, ఏ రాజకీయపార్టీతో సంబంధం లేకుండా పోటీ చేస్తున్నానన్నారు. తనను గెలిపిస్తే సీపీఎస్ రద్దు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ సర్వీస్‌రూల్స్, పీఈటీ, పండిత్‌ల అప్‌గ్రేడేషన్ తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మాజీ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జీహెచ్ఎంఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మారెడ్డి, భాను చంద్రప్రకాశ్, గిల్డ్ యూనియన్ అధ్యక్షుడు దేశ్‌పాండే ఆయన వెంట ఉన్నారు.

పత్తి కొన్న 72 గంటల్లోనే చెల్లింపులు

- వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి ఆదేశం
- వారంలో ఆరు రోజులు పత్తి కొనుగోలు చేయాలి

హైదరాబాద్, వెలుగు: పత్తి కొనుగోలు చేసిన 72 గంటల్లోనే రైతులకు చెల్లింపులు చేయాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి అధికారులను ఆదేశించారు. పత్తి , కందులు కొనుగోళ్లపై మార్కెటింగ్, మార్క్ ఫెడ్, సీసీఐ బ్రాంచ్ మేనేజర్లతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గజ్వేల్ మార్కెట్ కమిటీ పరిధిలోని కొనుగోలు కేంద్రంలో రైతులకు చెల్లింపులో పదిరోజులు జాప్యం చేసిన అధికారిని మార్చాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా అన్ని మార్కెట్లలో పత్తి ధర తగ్గుతున్నందున వారానికి ఆరు రోజులు కొనుగోలు చేయాలని సూచించారు. సీసీఐ ద్వారా మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 54,512 మంది రైతుల నుంచి రూ.731 కోట్లు విలువైన 1,34,805 టన్నుల పత్తి కొనుగోలు చేసినట్లు అధికారులు చెప్పారు. పత్తి రైతులకు రూ.567 కోట్లు చెల్లించామన్నారు. 19 కొనుగోలు కేంద్రాల ద్వారా రూ. 96.65 కోట్ల విలువైన 17,017 టన్నుల కందులు కొనుగోలు చేసినట్లు మార్క్ ఫెడ్ అధికారులు చెప్పారు.

హైదరాబాద్‌కు జర్మన్ ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీ

- రూ. 80 కోట్లతో కేంద్రం ఏర్పాటుకు టెటామస్ నిర్ణయం

హైదరాబాద్, వెలుగు: ఆహారశుద్ధి రంగంలో అంతర్జాతీయంగా పేరున్న జర్మన్ కంపెనీ టెటామస్ హైదరాబాద్‌లో బ్రాంచీ నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. దాదాపు రూ.80 కోట్ల (10 మిలియన్ యూరోలు) ప్రాథమిక పెట్టుబడితో కేంద్రాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. మంగళవారం జర్మనీలోని బెర్లిన్‌లో టెటామస్ కంపెనీ సీఈవో కీర్తివర్ధన్‌రెడ్డితో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి సీఎం కేసీఆర్ చేస్తున్న కృషిని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఈవో.. కంపెనీ ప్రతినిధులతో కలిసి ఫిబ్రవరి తొలి వారంలో హైదరాబాద్ వచ్చి కేసీఆర్‌ను కలుస్తానని చెప్పినట్లు రమేశ్ తెలిపారు. బెర్లిన్ కేంద్రంగా ఐరోపా, ఇజ్రాయెల్, చైనా, యూకే, అమెరికాల్లో 2,500 మంది నిపుణులతో కంపెనీ పనిచేస్తోందని చెప్పారు. ఫార్మా, కాస్మొటిక్స్, పశువుల దాణా, వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించి అంతర్జాతీయ ప్రమాణాలతో టెటామస్ ధ్రువీకరిస్తుంది.

మెథడిస్ట్ కాలేజీకి స్పోకెన్ ట్యుటోరియల్ ప్రాజెక్టు

హైదరాబాద్, వెలుగు: స్పోకెన్ ట్యుటోరియల్ ప్రాజెక్టు తెలంగాణ నోడల్ రిసోర్స్‌సెంటర్‌గా మెథడిస్ట్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకి ఐఐటీ బాంబే ఎంపిక చేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఎంవోయూపై ఆ కాలేజీ కరస్పాండెంట్ కృష్ణారావు, ప్రాజెక్ట్ నేషనల్ హెడ్(ఐఐటీ బాంబే) శ్యామ అయ్యర్ సంతకాలు చేశారు. ప్రాజెక్టు స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్‌గా ఆర్. శ్రీకాంత్‌ను నియమించారు. అన్ని కాలేజీల్లో ఫ్రీగా లేదా తక్కువ రేట్లకు సాఫ్ట్‌వేర్ ఆన్‌లైన్ కోర్సులను నేర్పించాలని యాజమాన్యాలకు శ్యామ అయ్యర్ సూచించారు.

రెండో రోజు 5,413 నామినేషన్లు

హైదరాబాద్, వెలుగు: గ్రామ పంచాయతీ తొలిదశ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. రెండో రోజు సర్పంచ్ పదవికి 30 జిల్లాల్లో 5, 413 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా సిద్దిపేట జిల్లాలో 404, మేడ్చల్ మల్కాజ్‌గిరి నుంచి తక్కువగా 50 నామినేషన్లు వేశారు. వార్డు మెంబర్ల కేటగిరీలో 16,946 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎక్కువగా సిద్దిపేట జిల్లా నుంచి 1, 415, తక్కువగా వనపర్తి నుంచి 141 వచ్చాయి.

జనరల్ కేటగిరీలో అందరూ ఉండాలిగా?

అగ్రవర్ణాలుగా పిలవబడే కులాల్లో ఆర్థిక వెనుకబాటు తొలిగిపోయేలా 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. అంటే జనరల్ కేటగిరీ కిందికి వచ్చేవాళ్లకు రిజర్వేషన్ కల్పిస్తున్నారన్నమాట. ఇది ఎంతవరకు సమంజసం? అసలు జనరల్ కేటగిరీ అంటేనే సమాజంలోని అన్ని వర్గాలది కదా. మరి, కొద్ది మంది సోకాల్డ్ అప్పర్ క్యాస్ట్‌లది మాత్రమే ఎలా అవుతుంది. ఆర్థికంగా వెనకబడ్డవారికి రిజర్వేషన్లు కల్పించటాన్ని వ్యతిరేకించాల్సిన అవసరంలేదు. అయితే ఆ కోటాలో అందర్నీ చేర్చాలన్నదే నా వాదన. ఆర్థిక వెనుకబాటు ప్రాతిపదికన కేంద్రం ఇవ్వాలనుకుంటున్న పది శాతం రిజర్వేషన్లలో అందరికీ ఛాన్స్ ఇవ్వాలి. కోటాపై కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ వాదనలు చాలా మోసపూరితంగా ఉన్నాయి. ప్రజల దృష్టిని మరల్చాలన్నదే ఆయన ఉద్దేశంగా కనిపిస్తోంది. రిజర్వేషన్లు పూర్తిగా ఆర్థిక వెనకబాటుతనం ఆధారంగా తీసుకొచ్చినవే అనే భావన కల్పించాలని చూస్తున్నారు. సామాజిక అన్యాయం గురించి హిందువులు మర్చిపోయేలా ప్రభావితం చేయటానికి పాలకులు ప్రయత్నిస్తున్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి, మానవతా విలువలకు విరుద్ధం. రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని సుప్రీం కోర్టు తీర్పివ్వటం కూడా రాజ్యాంగ విరుద్ధమే. దానికి అసలు ఒక ఆధారమే లేదు. అగ్ర కులాలకు కాకుండా ఆర్థికంగా వెనకబడిన అన్ని వర్గాలకూ పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఇదే పరిస్థితి తలెత్తుతుంది. ముస్లింలకు 4.5 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని గతంలో నిర్ణయించటం, ప్రస్తుతం 12 శాతం ఇవ్వాలని ప్రయత్నిస్తుండటం, ఓబీసీ కేటగిరీలో చేర్చాలని చూడటం వంటివన్నీ హేతుబద్ధంగా లేవు. ఎందుకంటే ముస్లింలు ఎప్పుడూ సామాజిక అన్యాయానికి గురి కాలేదు. నిజానికి గతంలో వాళ్లు పాలకులు. ముస్లింలపై నాకు ఎలాంటి ద్వేషం లేదు. కానీ, హేతుబద్ధత లేకుండా ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడటాన్నే వ్యతిరేకిస్తున్నా. రిజర్వేషన్లకు ప్రధాన కారణమైన సామాజిక, విద్యా వెనకబాటుతనం భావనలను అణగదొక్కాలని చూడటాన్నీ ఖండిస్తున్నా.



– చాట్ల విజయకృష్ణ, యూఎస్ఎ

ఇప్పటికి... ఈ కోటా కరెక్టే!

సామాజిక, ఆర్థిక వెనుకబాటు పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. కాలానుగుణంగా మారుతుంటాయి. ఆనాడు అంటరానితనం, ఆర్థిక దుస్థితుల నేపథ్యం, విద్యలో వెనుకబాటుతనం కారణంగా రాజ్యాంగంలోని 15(4) అధికరణం ద్వారా రిజర్వేషన్ల కల్పన జరిగింది. ఇప్పుడు ఆనాటి పరిస్థితులు యథాతథంగా మాత్రం లేవని కచ్చితంగా చెప్పవచ్చు. దళిత, గిరిజన, బడుగు వర్గాల్లో ఎంతో అభివృద్ధి వచ్చింది. అదే మాదిరిగా ఉన్నత వర్గాల్లో ఆర్థిక వెనుకబాటుతనం కారణంగా ఎంతోమంది విద్య, ఉపాధి రంగాల్లో వెనుబడే ఉంటున్నారు. ఈనేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించాలనే నిర్ణయాన్ని ఏ రాజకీయపార్టీ కూడా వ్యతిరేకించలేకపోతోంది.




కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి నాలుగున్నర సంవత్సరాల పాలన తర్వాత ఇప్పుడు ఒక్కసారిగా అగ్రవర్ణాల్లోని పేదలపై ప్రేమ పుట్టుకు రావడం ఎన్ని‘కల’స్టంటేనని విపక్షాల విమర్శలు గుప్పిస్తున్నాయి.

గత సాధారణ ఎన్నికలకు ముందు అప్పటి ప్రధాని మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వం కూడా మైనార్టీ ఓటర్లను ఆకట్టుకునేందుకు రిజర్వేషన్ల అస్త్రాన్ని సంధించింది. ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఎస్సీ,ఎస్టీ, బీసీలకు అమలు చేస్తున్న 27 శాతం రిజర్వేషన్ల అంశంలో జోక్యం చేసుకుంది. అందులో అంటే 27 శాతంలో అయిదు శాతం రిజర్వేషన్లు మైనార్టీలకు రిజర్వేషన్ల వర్తించేలా ఆఫీస్ మెమోరాండం (ఓఎం) జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఆర్.కృష్ణయ్య సవాల్ చేశారు. న్యాయమూర్తులు జస్టిస్ లోకూర్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఉన్న రిజర్వేషన్లను తగ్గించి మైనార్టీలకు రిజర్వేషన్లు ఇవ్వాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేసింది. దీనిపై అప్పీల్ సుప్రీంకోర్టులో అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణలో ఉంది.

ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు న్యాయసమీక్షలను ఎదుర్కొన్నాయి. ముస్లింలకు అయిదు శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే తొలిసారి తీసుకున్న నిర్ణయాన్ని అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన విస్తృత ధర్మాసనం తోసిపుచ్చింది. ముస్లిం మతంలోని వారందరికీ రిజర్వేషన్లు కల్పించడం చెల్లదని తేల్చింది. (ముస్లింల్లో వెనుకబాటుతనం ఉంటే రిజర్వేషన్లు ఇవ్వడం తప్పు కూడా కాదు. ముస్లింల్లోని దూదేకుల అనే తెగకు బీసీలుగా పరిగణిస్తూ అప్పటికే ఒక శాతం రిజర్వేషన్ అమల్లో ఉంది.) జీవో ద్వారా ముస్లింలకు అయిదు శాతం రిజర్వేషన్లు ఇవ్వడాన్ని హైకోర్టు కొట్టేయడంతో వైఎస్ ప్రభుత్వం చట్టం ద్వారా ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రతయ్నం చేసింది. అయితే దాన్ని కూడా ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన హైకోర్టు విస్తృత ధర్మాసనం కొట్టేసింది. (మొదటి సారి 5 శాతం రిజర్వేషన్లు ఇస్తే మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించుతున్నాయని రెండోసారి నాలుగు శాతమే రిజర్వేషన్లు ఇవ్వాలని వైఎస్ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది.) హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయడంతో షరతులతో కూడిన స్టే ఉత్తర్వులతో ఆ నిర్ణయం రెండు తెలుగు రాష్ట్రాల్లో అమల్లో ఉంది. ఇప్పుడు తాజాగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాటి పీవీ ప్రభుత్వ నిర్ణయాన్నే అమలు చేయాలని నిర్ణయించింది. దీని వెనుక రాజకీయ లబ్ధి లేదని ఎవ్వరూ అనలేరు. మరో పక్క ఏ రాజకీయ పార్టీ కూడా అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు ఇవ్వొద్దని చెప్పే సాహసం చేయవు. ఎవరికైనా ఓటరుడే దేవుడు. ఓట్లే పరమావధిగా పార్టీలు పాచికలు కదుపుతూ ఉంటాయి.

పెరుగుతున్న ఖర్చులు.. అగ్రవర్ణ పేదల్లో మార్పు రాని ఆర్థిక పరిస్థితులు.. ఈ నేపథ్యంలో చదువులకు దూరం అవుతున్న అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించడానికి రాజ్యాంగబద్ధత సిద్ధిస్తే.. న్యాయపరంగా అవరోధాలకు పెద్దగా ఆస్కారం ఉండకపోవచ్చు. సుప్రీంకోర్టులో 70 శాతానికి పైగా అనుకూల అవకాశాలే ఉండేందుకు వీలుండవచ్చు. ఏం జరగబోతుందో కొద్ది రోజులు వేచి చూడాల్సిందే!



– కె.రామకృష్ణారెడ్డి, సీనియర్ న్యాయవాది. (తెలంగాణ రాష్ట్ర తొలి అడ్వొకేట్ జనరల్‌గా పనిచేశారు)

దేశమంతటా ఇదే లొల్లి

రిజర్వేషన్లు 50 శాతం దాటేందుకు వీల్లేదని 1963లోనే సుప్రీంకోర్టు (బాలాజీ-కర్నాటక ప్రభుత్వాల మధ్య కేసులో) కీలక తీర్పు చెప్పింది. అసాధారణ పరిస్థితుల్లో రిజర్వేషన్లు 50 శాతం దాటవచ్చునని చెప్పింది. అలాగని గుంపగుత్తగా కులాలన్నింటికీ లేదా ఒక మతానికి రిజర్వేషన్లు ఇవ్వడం చెల్లదు. శాస్త్రీయ అధ్యయనం చేసి గణాంకాలతో కూడిన నిష్పక్షపాత నివేదికలు ఉండి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుతనం ఉందని తేలితే మాత్రం 50 శాతం రిజర్వేషన్లు దాటవచ్చు, ఈ పాయింట్‌లోనే తమిళనాడులో 69 శాతం, కర్నాటకలో 50 శాతానికి పైగా రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. తమిళనాడులో ప్రారంభమైన కుల పోరాట ఉద్యమాల ఫలితంగా రిజర్వేషన్ల అంశం కీలకం అయ్యింది. ఆ తర్వాత కర్నాటక, తెలుగు రాష్ట్రాల్లో కూడా రిజర్వేషన్ల అంశం ప్రధాన పాత్ర పోషిస్తూ వస్తోంది. కేరళ, ఒడిశా మినహా దేశమంతటా రిజర్వేషన్ల అంశం అత్యంత ప్రధాన అస్త్రంగా ఉంటూ వస్తోంది.

నాడు పీవీ.. నేడు మోడీ

వాస్తవానికి అగ్రవర్ణాల్లోని పేదలకు విద్య,ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలనే ప్రయత్నం మన తెలుగు వాడు, తెలంగాణ గడ్డపై పుట్టిన బహు బాషాకోవిదుడు పాములపర్తి వెంకట నర్సింహా రావు ప్రధానిగా ఉండగానే జరిగింది. ఈమేరకు ప్రధాని పీవీ ప్రభుత్వం 1991 మే 25న ఆఫీస్ మెమోరాడం (ఒఎం) జారీ చేసింది. అయితే అప్పుడు ఆ నిర్ణయం సుప్రీంకోర్టులో వీగిపోయింది. రాజ్యాంగంలో సామాజిక, విద్యా వెనుకబాటు తనానికి మాత్రమే రిజర్వేషన్ల కల్పనకు 15(4) అధికరణం అవకాశం కల్పిస్తోందని, అగ్రవర్ణాల ఆర్థిక వెనుకబాటుతనానికి రిజర్వేషన్లు ఇవ్వాలని పేర్కొనలేదని తొమ్మిది మందితో కూడిన సుప్రీం కోర్టు విస్తృత ధర్మాసనం తీర్పు వెలువరించింది. రాజ్యాంగ వ్యతిరేకమని ఇందిరాసహానీ-కేంద్రం ప్రభుత్వం మధ్య వ్యాజ్యంలో సుప్రీంకోర్టు తేల్చింది. ఆ తర్వాత ఎవ్వరూ అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలనే ప్రయత్నం చేయలేదు.

పీవీ ప్రభుత్వ నిర్ణయానికి మోదీ ప్రకటించిన విధానానికి చాలా తేడా ఉంది. పీవీ ప్రభుత్వం ఆఫీస్ మెమోరాడం ద్వారా అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించింది. రాజ్యాంగంలో పేదలకు లేదా అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు ఇవ్వాలని ఏ అధికరణమూ పేర్కొనడం లేదని తప్పుపడుతూ సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అందుకే కాబోలు ప్రధాని మోదీ మంత్రివర్గం అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్మానం చేసింది. అందుకు అనుగుణంగా రాజ్యాంగ సవరణ తీసుకువచ్చేందుకు చకచకాపావులు కదిపేసింది. సామాజిక, విద్యాపర వెనుకబాటు తనాన్ని పారద్రోలేందుకు రాజ్యాంగంలోని 15(4) అధికరణం దోహదం చేస్తోంది. పీవీ సర్కార్ జారీ చేసిన ఉత్వర్వులను తప్పుపడుతూ సుప్రీంకోర్టు ఎత్తిచూపిన రాజ్యాంగపరమైన లోటుపాట్లు లేకుండా మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలని నిర్ణయించింది. మంగళవారం లోక్‌సభలో ఫుల్ మెజార్టీతో రాజ్యాంగ సవరణకు ఆమోదం లభించింది. రాజ్యసభలో ఆ పరిస్థితులు లేకపోయినా ఇతర పార్టీలు అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు వద్దనే అవకాశాలు కనబడటం లేదు.

ఇది రిజర్వేషన్ల స్ఫూర్తికి వ్యతిరేకం

అగ్రకులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం రిజర్వేషన్ల సిద్ధాంతానికి వ్యతిరేకం. రిజర్వేషన్లు పెట్టడానికి ప్రాతిపదిక సామాజిక వెనుకబాటుతనమే తప్ప ఆర్థిక ప్రాతిపదిక కాదు. రిజర్వేషన్లు పేదరిక నిర్మూలనం పథకం కాదు. అగ్రకులాలకు రిజర్వేషన్లు రాజ్యాంగ మౌలిక విలువలకు సూత్రాలకు విరుద్ధమైన అంశం.

సామాజిక వివక్షతకు గురవుతున్న కులాలకు అధికారం ద్వారా సామాజిక హోదా పెంచాలనే లక్ష్యంతో పెట్టిన రిజర్వేషన్ల ఆశయం దారి తప్పింది. సున్నితమైన రిజర్వేషన్ల అంశాన్ని బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోంది. నిజానికి కొన్నేండ్లుగా కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ జరగడంలేదు. ఇప్పటికీ 12 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ రిజర్వేషన్లు కల్పిస్తామనడంలో హేతుబద్ధత ఉందా? ఇది పచ్చి మోసం.

ఎస్సీ/ఎస్టీ/బీసీలకు రిజర్వేషన్లు పెట్టడానికి సిద్ధాంతపరమైన పునాది ఉంది. కుల వ్యవస్థతో ముడిపడి ఉన్న మన భారతీయ సమాజం లో మొదట కులాన్ని నిర్మూలించడానికి ఎలాంటి నిర్మాణాత్మకమైన ప్రయత్నాలు జరగలేదు. కనీసం కులాల మధ్య ఉన్న అంతరాలు నిర్మూలించడానికి చర్యలు తీసుకోలేదు. మొదట కులం నిర్మూలించి ఆ తర్వాత కుల వ్యవస్థతో వచ్చిన అసమానతలను రూపు మాపి అందరికీ ప్రతిభ అభివృద్ధితో కూడిన సమాన అవకాశాలు కల్పించి అవసరమైన ఆర్థిక సామాజిక మార్పును తీసుకు రావడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 71 సంవత్సరాల కాలంలో ఘోరంగా విఫలమయ్యాయి.

జాతీయ కమిషన్లు కూడా చెప్పిందిదే

పేద వారికి రిజర్వేషన్లు ఇవ్వాలని కోరడం పైకి బాగానే కనబడుతుంది. కానీ మౌలిక ఆశయాలకు విరుద్ధమైనది. పైగా ఆదాయం మొత్తాన్ని లెక్కించడానికి ఒక హేతుబద్ధమైన, శాస్త్రీయమైన విధానం లేదు. రెవెన్యూ అధికారులు మొత్తాన్ని లెక్కించడంలో అనేక అక్రమాలకు, అవినీతికి పాల్పడే అవకాశాలు ఉంటాయి. ఇందులో రాగద్వేషాలు పనిచేస్తాయి. వ్యాపారస్తుల, వ్యవసాయదారుల నికరాదాయంని లెక్కించేందుకు శాస్త్రీయమైన విధానం లేదు. దీనివలన నిజమైన పేదవారికి అన్యాయం జరుగుతుంది. చివరకు సంపన్నులు, డబ్బున్న వాళ్లు తమ పలుకుబడి ఉపయోగించి ఆదాయం సర్టిఫికెట్లు పొందుతారు అనడంలో సందేహం లేదు. ఈ బీసీ స్కాలర్‌షిప్స్‌లో ఈ అవకతవకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రిజర్వేషన్ల సిద్ధాంతానికి పునాది సామాజిక వివక్షత సాంఘిక వెనకబాటుతనం విద్యారంగంలో వెనుకబాటుతనమేగానీ ఆర్థికంగా వెనుక బాటుతనం కాదని రెండు జాతీయ కమిషన్లు (మండల్ కమిషన్, కాక కలేల్కర్ కమిషన్) స్పష్టంగా చెప్పాయి. వివిధ రాష్ట్రాలు నియమించిన 84 బీసీ కమిషన్లు కూడా అదే విషయాన్ని సమర్థించాయి. 10 శాతం రిజర్వేషన్లు పెట్టినంత మాత్రాన అగ్రకులాల్లో పేదరికం పోదు. వాళ్లకు ఆర్థిక పరమైన ప్యాకేజీలు సబ్సిడీ రుణాలు, స్వయం ఉపాదిపథకాలు, విద్యార్థులకు స్కాలర్ షిప్ లు, ఫీజుల రియంబర్స్ మెంట్ లాంటి పథకాల ద్వారా న్యాయం చేయొచ్చు.

సంపద పంపిణీకి ఓసీలు సిద్ధమేనా?

ఇక అసలు విషయానికి వస్తే ఈ దేశ సంపద, పరిశ్రమలు, డబ్బు, వ్యాపార, వాణిజ్య, కాంట్రాక్టులు అధికారం ఎవరి చేతుల్లో ఉన్నాయి. 20 శాతం జనాభా ఉన్న అగ్రకులాల చేతుల్లో 90 శాతం రిజర్వేఅయ్యి ఉంది. మరి వీటిని కూడా అన్ని కులాల జనాభా ప్రకారం రిజర్వ్ చేస్తే దేశంలో ఆకలి, పేదరికం ఉండదుకదా. వీటిని కూడా అన్ని సామాజిక గ్రూపులకు ఎందుకు విభాజించరు? 20 శాతం జనాభా ఉండి 80% పదవులు 71 సంవత్సరాలుగా అనుభవిస్తున్న అగ్రకులాల వారికి రిజర్వేషన్లు కల్పించాలని జ్ఞానోదయం కలగడం లో ఉన్న హేతుబద్ధత ఏమిటి? మొత్తం వ్యవహారంలో బీసీల పరిస్థితి ఏంటి? బీసీల అభివృద్ధి కి 71 సంవత్సరాలుగా ప్రభుత్వాలు ఏం చేశాయి? 56 శాతం జనాభా కలిగిన బి.సిలకు ఉన్నత ఉద్యోగాలలో ఈ నాటికి 14 శాతం దాటలేదు. 2600 బీసీ కులాల్లో 2550 బీసీ కులాల వారు ఇంత వరకు అసెంబ్లీ, పార్లమెంటులో అడుగు పెట్టనేలేదు. ఎప్పుడైతే బీసీలకు జనాభా ప్రకారం వారికి రిజర్వేషన్లు అన్ని రంగాలలో దక్కుతాయో అప్పుడు మాత్రమే అగ్రకులాల రిజర్వేషన్లకు బీసీలు స్వాగతం పలుకుతారు. సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.



– ఆర్. కృష్ణయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంక్షేమం అధ్యక్షుడు

రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన పథకం కాదు

విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు పెట్టడానికి రెండు సిద్ధాంత ప్రాతిపదికలున్నాయి.

1. ప్రజాస్వామ్యంలో ప్రతి కులానికి, ప్రతి వర్గానికీ ఈ సమాజాన్ని నడపడంలో ముఖ్యంగా ప్రభుత్వ పాలనలో, అధికారంలో ఆయా కులాల జనాభా ప్రకారం వాటా ఇచ్చి భాగస్వామ్యం కల్పించడం.
2. కులాలకు సాంఘిక వివక్షతకు గురవుతున్న కులాలకు వివక్షత తొలగించాలంటే అధికారంలో వాటా ఇచ్చి సామాజిక గౌరవం పెంచడం ఆత్మవిశ్వాసం కలిగించడం.

మన సమాజంలో ఒక వ్యక్తిని తక్కువ కులం వారనే తక్కువ దృష్టి తో చూస్తారె తప్ప ఆర్థిక ప్రాతిపదికగా చూడరు. బి.సి కులాల్లోని చాకలి, మంగలి, వడ్డెర, కురుమ, బుడుబుక్కల, దాసరి, మేదరి, గొల్ల, కుమ్మరి తదితర కులాలవారినీ, ఎస్సి లోని మాల, మాదిగా తదితర కులాల్లో ఎవరైనా ధనవంతులు, భూస్వాములు ఉన్నా వారినీ సమాజం అంటరాని వారిగానే తక్కువ చూపు చూస్తారు. అధికారానికి సాంఘిక హోదాకు అవినాభావ సంబంధం ఉంది పేద కులాల సాంఘిక హోదా గౌరవం పెరగాలంటే ఉన్నత ఉద్యోగం చేయాలి. ఉన్నత ఉద్యోగాలలో చేరాలంటే రిజర్వేషన్లు కావాలి. అందుకే పేద కులాల వారికి రిజర్వేషన్లు పెట్టారు. పైగా మన సమాజంలో ఆర్థిక స్థితి శాశ్వతం కాదు. కులం మాత్రమే శాశ్వతం. తక్కువ కులం వారు అగ్ర కులం వారు కారు. అగ్రకులం వారు తక్కువగా మారరు. ఇది ఒక వాస్తవికమైన, సామాజిక విధానం ఘనీభవించిన సత్యం.

కోటాతోనే ఓసీ పేదలకు న్యాయం

అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగ రంగాల్లో పది శాతం రిజర్వేషన్ కల్పించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకమైనది. సామాజిక వివక్ష అంతరించి, ఆర్థిక వివక్ష ఇంకా కొనసాగుతోన్న నేపథ్యంలో ఆర్థిక వెనుకబాటు ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని అనేక సంవత్సరాలుగా ఉద్యమాలు జరుగుతున్నాయి. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించడంతోపాటు ఆర్థిక అసమానతలనూ తొలగించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఓసీ కార్పొరేషన్లు ఏర్పాటుచేసి పని ప్రారంభించాలి.


ఎట్టకేలకు ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిరుపేద ఓసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని పేర్కొనడం హర్షించదగ్గ పరిణామం. గత 67 సంవత్సరాల నుంచి కుల, మత ప్రాతిపదికన అమలు చేస్తోన్న రిజర్వేషన్ విధానం వల్ల అగ్రవర్ణాలుగా పిలవబడే ఓసీలు అన్ని రంగాల్లో అవకాశాలు కోల్పోయి, ద్వితీయశ్రేణి పౌరులుగా మారిపోయారు.

గడిచిన కాలంలో ఆర్థిక అసమానతలను సమసిపోలేదు కాబట్టే ఇప్పుడు దేశమంతటా రిజర్వేషన్ ఉద్యమాలు ఉధృతంగా పుట్టుకొచ్చాయి. మీనాలు, గుజ్జర్లు, కాపులు, పటేల్, రెడ్డి, మరాఠీలు తదితర వర్గాలకు చెందిన వారు విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల కోసం ఉద్యమాలు చేస్తున్నారు. కోటా 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసి కూడా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని కొన్ని కులాలకు రిజర్వేషన్లు ప్రకటించి, అసెంబ్లీల్లో తీర్మానాలను కూడా ఆమోదించాయి. కానీ కోటా పెంపు తీర్మానాలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ ఆమోదించలేదు. ఒకటి రెండు కులాలని కాకుండా ఇప్పుడు మొత్తం దేశంలోని అగ్రవర్ణాల పేదలందరికీ విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని కేంద్రం చెబుతోంది. ఈ మేరకు రాజ్యంగ సవరణ (ఆర్టికల్ 15(4), 16(4)ల సవరణ)కు కూడా ప్రయత్నాలు మొదలుకావడాన్ని చూస్తే రిజర్వేషన్ల అంశం ఈ దఫా ఒక కొలిక్కివచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అగ్రవర్ణ పేదల కోసం గతంలో యూపీఏ ప్రభుత్వం జాతీయ స్థాయిల ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. సదరు ‘ఆర్థికంగా వెనుకబడిన తరగతుల కమిషన్’కు రిటైర్డ్ మేజర్ జనరల్ సిన్హాను చైర్మన్‌గా నియమించారు. 2010లో సిన్హా కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అగ్రవర్ణ పేదల సంఖ్యను నిర్ధారించి, వారిని ఓబీసీలుగా పరిగణించాలని సిన్హా కమిషన్ రిపోర్టులో రాశారు. సిన్హా కమిటీ సుమారు రెండేండ్ల పాటు దేశంలోని 26 రాష్ట్రాల్లో పర్యటనలు జరిపి, అగ్రవర్ణాల స్థితిగతులపై అధ్యయనం చేసిమరీ నివేదికను తయారుచేసింది. కానీ ఆ నివేదిక ఇప్పటివరకూ పార్లమెంట్‌కు చేరకపోవడం బాధాకరం. రాజ్యంగ స్ఫూర్తి,సమానత్వమేనని, ఏదేనీ ఒక వర్గానికి అవకాశాలలో ప్రాతినిధ్యం తగ్గిందని భావిస్తే పార్లమెంట్‌లో రిజర్వేషన్ల కల్పించవచ్చని రాజ్యాంగంలో స్పష్టంగా ఉంది. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భంగం కలిగించే వాటిని తిరస్కరించాల్సిందేనని, అయితే మౌలిక సూత్రాల అనుసారం, శాస్త్రీయంగా ప్రవేశపెట్టే రిజర్వేషన్లు మాత్రం సమర్థించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ నేపథ్యంలో సిన్హా నివేదిక ఆధారంగా అగ్రవర్ణాలకు ప్రవేశపెట్టిన 10 శాతం రిజర్వేషన్లు అమలయ్యే అవకాశాలే ఎక్కువ. సామాజిక వెనుకబాటు క్రమేపీ అంతరించి, దాని స్థానంలో ఆర్థిక అసమానతలు తెరపైకి వచ్చాయి.



గత 70 ఏండ్లలో ఇతర వర్గాలవారు కూడా అగ్రవర్ణాలతో పోటీ పడుతూ జనరల్ కేటగిరీలోనూ అత్యధికంగా ఎంపిక అవుతున్నారు. ఓసీలుగా పిలవబడే అగ్రవర్ణాలకు పది శాతం కూడా అవకాశాలు రావడంలేదు. ఉదాహరణకు రెండు తెలుగు రాష్ట్రాల్లో రమారమి 6500 మెడికల్ సీట్లు ఉంటే, రిజర్వేషన్ వర్గాలకు పోను సుమారు 3250 సీట్లలో ఓసీ అభ్యర్థులు భర్తీ కావాలి. కానీ కేవలం 800 మంది ఓసీలకు మాత్రమే అవకాశం దక్కుతోంది. అంటే, ఓపెన్ కేటగిరీ లోనూ ఓసీలకు దక్కుతోన్న అవకాశాలు 15 శాతం దాటడంలేదు. అనేక రాష్ట్రాల్లో ఈ రోజు అగ్రవర్ణాల పరిస్థితి దారుణంగా ఉంది. మన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో రెడ్లు, కాపులు, బ్రాహ్మణ, వెలమ తదితర కులాల వారు ఉన్నత విద్యకు ఫీజులు చెల్లించే స్థోమత లేక చదువులకు దూరమవుతున్నారు. చదువు కొనలేని స్థితిలో ఇంకొందరు పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఓసీ రైతులు అగ్రవర్ణాలు అనే నెపంతో అన్ని రంగాల పథకాలకూ అనర్హులుగా మిగిలిపోతున్నారు.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పన్ను చెల్లింపుదారులుగా ఉంటూ, ఓటుహక్కునూ వినియోగించుకుంటూ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న అగ్రవర్ణాలకు విద్య, ఉద్యోగ రిజర్వేషన్లుగానీ, ఆర్థికపరమైన సహకారంగానీ తప్పక ఉండాల్సిందే. అసలు ఓసీ కార్పొరేషన్ వంటివి ఎందుకు ఏర్పాటు చేయడం లేదన్న ఆగ్రహం దేశవ్యాప్తంగా ఓసీల్లో నెలకొన్నది. రాజ్యాంగ మౌలిక సుత్రాలకు వ్యతిరేకంగా లేకుంటే రిజర్వేషన్లు పెంచొచ్చని 1992 ఇందిరా సహానీ కేసులో తొమ్మిది మంది న్యాయమూర్తుల ఖరాఖండిగా తీర్పు చెప్పారు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించడంతోపాటు ఆర్థిక అసమానతలనూ తొలగించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఓసీ కార్పొరేషన్లు ఏర్పాటుచేసి పని ప్రారంభించాలి. అప్పుడు మాత్రం రిజర్వేషన్ల ఉద్యమాలు తగ్గుముఖం పడతాయని ఆశించగలం.




– జి. కరుణాకర్‌రెడ్డి, ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు



బాలీవుడ్ కాలింగ్

టాలీవుడ్, బాలీవుడ్‌ల మధ్య బాగానే చక్కర్లు కొడుతోంది పూజా హెగ్డే. 'ఒక లైలా కోసం' తో తెలుగులో ఎంట్రీ ఇచ్చింది. 'ముకుంద' సినిమా చేశాక బాలీవుడ్ బయల్దేరింది. అక్కడ 'మొహంజొదారో' చేసి మళ్లీ వచ్చేసింది. 'దువ్వాడ జగన్నాథమ్'తో మార్కులు వేయించుకుని, 'అరవింద సమేత'తో స్టార్ హీరోయిన్ అయిపోయింది. ప్రస్తుతం మహేశ్ బాబుతో నటిస్తోంది. అంతలోనే మళ్లీ బాలీవుడ్ నుంచి పిలుపొచ్చింది పూజకి. ఆల్రెడీ 'హౌస్‌ఫుల్ -4' చేసింది. ఇప్పుడు రోహిత్‌శెట్టి తన నెక్స్ట్ సినిమాలో పూజనే హీరోయిన్‌గా తీసుకున్నాడట. ఇటీవలే 'సింబా'తో బ్లాక్ బస్టర్ సాధించిన ఆయన వెంటనే అక్షయ్ కుమార్‌తో 'సూర్యవంశీ' మొదలుపెట్టేస్తున్నాడు. అందులో హీరోయిన్‌గా పూజ పేరు బలంగా వినిపిస్తోంది. మొత్తానికి సౌత్‌లోనూ నార్త్‌లోనూ కూడా మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ అయిపోతోంది పూజ.




నాన్నపై ప్రేమతో

నాన్న వేసిన బాటలో నడిచి వచ్చాడు. ఇప్పుడా నాన్న కష్టంలో ఉంటే కదిలిపోతున్నాడు. కొడుకుగా తండ్రి కష్టాన్ని ఎలా పంచుకోవాలో అర్థం కాక తల్లడిల్లుతున్నాడు. ప్రముఖ బాలీవుడ్ నటుడు, దర్శకుడు, నిర్మాత రాకేశ్ రోషన్ క్యాన్సర్ బారిన పడ్డారు. కొద్ది రోజుల క్రితమే ఆయన థ్రోట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయాన్ని డాక్టర్లు నిర్ధారించారు. ఈ విషయం హృతిక్ రోషన్‌ని బాగా కలచి వేస్తోంది. డాడ్‌తో దిగిన ఫొటోని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి చెప్పాడు. 'సర్జరీ రోజు కూడా నాన్న జిమ్ చేయడం మానరని నాకు తెలుసు, అందుకే వెళ్లి ఒక ఫొటో దిగుదామని అడిగాను, కాదనలేదు, ఆయన చాలా స్ట్రాంగ్, అలాంటి లీడర్ దొరకడం మా కుటుంబం చేసుకున్న అదృష్టం' అంటూ ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. ఇప్పటికే సోనాలి బెంద్రే, ఇర్ఫాన్ ఖాన్, ఆయుష్మాన్ ఖురానా భార్య క్యాన్సర్‌తో పోరాడుతున్నారు. అంతలోనే రాకేశ్‌కి వ్యాధి సోకడం పట్ల బాలీవుడ్ వారంతా విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఆ మార్క్ లేకుంటే నేనే చూడలేను

రామ్‌చరణ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వినయ విధేయ రామ'. సంక్రాంతి కానుకగా జనవరి 11న ఈ సినిమా విడుదలవుతోంది. **ఈ సందర్భంగా రామ్‌చరణ్‌తో చిట్ చాట్.**



- బోయపాటి టీజర్ ఎప్పుడూ ఆయన జానర్‌లోనే కనిపిస్తుంది. ట్రైలర్లో వయొలెన్స్ ఎక్కువనిపిస్తోంది కానీ సినిమాలో అంత ఎక్కువ ఉంటే.. సెన్సార్ కట్స్ లేకుండా యు/ఎ సర్టిఫికెట్ రాదు కదా!
- బోయపాటి గారి 'జయ జానకి నాయక' టైటిల్ నాకెంతో ఇష్టం. దానికి దగ్గరగా సంక్రాంతి సీజన్‌కు తగ్గ మంచి టైటిల్‌గా 'వినయ విధేయ రామ' అనిపించింది. కథకు కూడా సరిగ్గా కుదిరింది.
- ప్రతి కుటుంబంలో ఇలాంటి ఓ కొడుకు, మరిది ఉంటే బాగుంటుంది అనిపించేలా డిజైన్ చేసిన క్యారెక్టర్. రాముడి లాంటి పాత్ర.
- 'భద్ర' మొదలు బోయపాటి చిత్రాలన్నీ పరిశీలిస్తే యాక్షన్‌తో పాటు లవ్‌స్టోరీ, ఫ్యామిలీ డ్రామా కూడా ఉంటాయి. అయితే ఆయనకి ఒక బ్రాండ్ ఇమేజ్ వచ్చిందంటేనే యాక్షన్ సీన్లలో బలం వల్లే. అవి లేకుండా ఆయన సినిమాలు నేనూ చూడలేను.
- ర్యాంబో లుక్ రెండేళ్ల క్రితమే బోయపాటి చెప్పారు. టాటూస్‌తో సహా డిజైన్ చేసి చూపించారు. సమ్మర్‌లోనే ఆ సీన్స్ అజర్ బైజాన్‌లో తీద్దామనుకున్నాం. కానీ వాయిదా పడి సెప్టెంబర్‌లో చేశాం. కొంచెం కష్టమనిపించింది కానీ జోష్‌లో చేసేశా.
- 'గ్యాంగ్‌లీడర్' లాంటి సినిమా చేయాలనుకున్నాను కానీ ఇది అది కాదు. అన్నదమ్ములనే విషయం మినహా స్క్రీన్‌ప్లే అంతా డిఫరెంట్.
- నా పేరుతో ఉన్న డైలాగ్‌ని ఎవరి పర్మిషన్ తీసుకుని పలికించారని బోయపాటి గారితో నాన్న జోక్ చేశారు. కానీ ప్రీరిలీజ్ వేడుకలో ఆయనే ఆ డైలాగ్ చెప్పారు. సినిమాకి మంచి ప్రమోషన్ అయింది.
- స్నేహ, ఆర్యన్ రాజేశ్, ప్రశాంత్ గార్లతో కలసి నటించడం హ్యాపీగా ఉంది. 'రక్తచరిత్ర' చూసి వివేక్ ఒబెరాయ్ గారిని తీసుకున్నాం. సెట్‌లో అంతా బోయపాటి గారి కంట్రోల్‌లో ఉండేది. కొన్ని సీన్స్ నేనే ఆయన్ను చేసి చూపించమని అడిగేవాడిని. మంచి నటులు, టెక్నీషియన్లతో వర్క్ చేసినప్పుడు మా పని మరింత ఈజీ అవుతుంది.
- గత చిత్రంతో పోలికలొద్దని ఎంత చెప్పినా పోలికలు తప్పవు. ప్రెజర్ ఉంటుంది. కానీ ప్రెజర్‌లోనే ఉండిపోతే అందరు దర్శకులతో చేయలేం. మనకున్న విజయవంతమైన దర్శకుల్లో బోయపాటి కూడా ఒకరు. ఆయన ఎంతో కష్టపడి రాసిన సబ్జెక్ట్ ఇది.
- కలెక్షన్ రికార్డుల వల్ల గత ఏడాది నాది, మహేశ్, బన్నీ సినిమాల మధ్య డిస్టర్బెన్సెస్ వచ్చాయి. పాత్రల్లో, చేసే విధానంలో పోటీ ఉండాలి తప్ప ఇలాంటివాటిలో కాదు. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ హ్యాపీ. ఫ్యాన్స్ ఎందుకు కొట్టుకుంటున్నారు? వారి ఒత్తిడి వల్లే నిర్మాతలు కలెక్షన్స్ ప్రకటిస్తున్నారు. నా ఫ్యాన్స్ తరపున నేను వద్దన్నాను.
- కియరా చెప్పినట్టు ఇన్‌స్టగ్రామ్‌లో సీక్రెట్ అకౌంట్ ఉంది (నవ్వుతూ). బయట ఏం జరుగుతుందో నాకూ తెలుసుకోవాలని ఉంటుంది. కానీ పబ్లిక్ ప్రొఫైల్ ఇష్టపడను. అందుకే సీక్రెట్‌గా.
- ఇతర చిత్రాలు చూసి మనమూ అలాంటివి చేయాలనుకుంటే కన్ఫ్యూజవుతాం. సెట్‌లో సింపుల్‌గా ఆలోచించడమే ఉత్తమం. వింతగా ఏదో చేయాలని చూస్తే ట్రాక్ తప్పుతుంది. ప్రత్యేకంగా కనిపించాలని కాక అంతా కలసి ఏం చేయాలా అని ఆలోచించాలి.
- షూటింగ్ మొదలయ్యాక ఒక్కోసారి ఖర్చులు పెరుగుతుంటాయి. అయినా వెనుకాడరు దానయ్య. అందుకే త్రివిక్రమ్ గారితో ప్లాన్ చేస్తున్నాం. నాన్నగారితో కొరటాల శివ సినిమా తర్వాత ఇది ఉంటుంది. నిజానికి 'మిర్చి' నుంచి నేనూ శివగారితో పనిచేద్దామనుకుంటున్నాను. భవిష్యత్తులో తప్పకుండా చేస్తా.

సైరా సంగతులు

- సైరా సాంగ్ షూటింగ్ జరుగుతోంది. సంగీత దర్శకుడిగా అమిత్ త్రివేది విషయంలో నాన్నగారు మొదట ఆసక్తి చూపలేదు. కానీ ఓ ట్యూన్ విన్నాక ఏ మార్పులూ లేకుండా ఓకే చేశారు. వెరీ సెన్సిబుల్ మ్యూజిక్ డైరెక్టర్.
- బడ్జెట్ 200 కోట్ల వరకూ ఉంటుంది. రిలీజ్ విషయంలోనూ మొదటి ప్రాధాన్యత దక్షిణాదికే. ఆ తర్వాతే బాలీవుడ్.
- కేవలం నాన్నగారి సినిమాలకే ఈ సంస్థను పరిమితం చేద్దామనుకుంటున్నాను. నాకు మంచి నిర్మాతలు ఉన్నారు. వారితోనే చేస్తాను. వాళ్లు ఏమైనా భాగస్వామ్యంలో చేద్దామని కోరుకుంటే తప్ప నేనుగా చేయను. నేను నాన్నకిచ్చే రెమ్యునరేషన్ ఖచ్చితంగా మరే ఇతర నిర్మాత ఇవ్వలేరు.
- రెండు నెల్లలో షూటింగ్ పూర్తవుతుంది. రీషూట్స్ లేవు. సమ్మర్‌కి రిలీజ్ అనుకున్నాం కానీ లేటైంది. దసరాకి అవ్వొచ్చు.

మల్టీస్టారర్ ముచ్చట్లు

- తారక్‌తో స్నేహం ఉంది కనుక సెట్‌లోనూ ఈజీగా అనిపించింది. ఇద్దరి కాంబినేషన్‌లో 20 రోజుల షూటింగ్ జరిగింది. సంక్రాంతి తర్వాత తదుపరి షెడ్యూల్ గురించి చెబుతారు.
- ఇలాంటి మల్టీస్టారర్ ఆఫర్ వచ్చినందుకు మేమే షాకయ్యాం. తారక్ వెంటనే రియాక్టయ్యాడు కానీ నేనైతే సైలెంటయ్యాను. మా ఇద్దరి అభిమానులతో పాటు ప్రేక్షకులందరినీ రాజమౌళి తప్పక సంతృప్తి పరుస్తారనే నమ్మకముంది.
- స్క్రిప్ట్‌లో మేమిద్దరం కుదిరాం కాబట్టే ఆయన మాకీ సినిమా గురించి చెప్పారు. అంతే తప్ప ఇద్దరు నటుల్ని ఎంచుకుని ఆయన కథ అల్లరు. 'మగధీర' తర్వాత ఆయన వరుస సినిమాలతో బిజీ అవడం వల్లే తిరిగి మరో సినిమాకి సమయం పట్టింది. ఈ సినిమా గ్రాఫిక్ వర్క్ విషయమై ఆమధ్య అమెరికా వెళ్లాం.
- మమ్మల్ని ఎన్నిరోజులు ఆర్‌ఆర్‌ఆర్ సెట్‌లో పెడతారో రాజమౌళికే తెలియాలి. ఆయన చేసే సినిమాలకు టైమ్ మేం ఫిక్స్ చేయలేం. ఆయనా చేయలేరు.
- అందరూ అనుకుంటున్నట్టు గ్లామరస్ రోల్ ఏమీ కాదు నాది. కామన్ మ్యాన్‌కి దగ్గరగా ఉండే పాత్ర.

గప్‌చుప్



కాస్త మొండిగా ఉంటుందని, ఇగో చూపిస్తుందని, ఇబ్బంది పెడుతుందని గతంలో రకరకాల కామెంట్లు వచ్చాయి సాయి పల్లవిపై. అవన్నీ నిజమో కాదో తెలీదు కానీ... తనదెంత మంచి మనసో చెప్పే విషయం ఒకటి ఇప్పుడు వినిపిస్తోంది. ఆమె శర్వానంద్‌తో కలిసి నటించిన 'పడి పడి లేచే మనసు' సరిగ్గా ఆడక పోవడంతో నిర్మాతకు నష్టం వచ్చిందట. దాంతో తనకింకా ఇవ్వాల్సి ఉన్న రెమ్యునరేషన్‌ని వద్దందట సాయిపల్లవి. షూటింగ్ ప్రారంభం కాకముందే సగానికి పైగా చెల్లించినా ఇంకాస్త ఇవ్వాల్సి ఉందట. ఆ డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పేసిందట. అదే నిజమైతే ఆమెని ఎంత మెచ్చుకున్నా తక్కువే అవుతుంది.



ఫొటో ఫీస్ట్

సంతోషాన్ని సన్నిహితులతో పంచుకుంటే రెట్టింపవుతుంది. అందుకే 'సింబా' సూపర్ హిట్టయిన సంతోషాన్ని తమ సన్నిహితులైన అజయ్ దేవగన్, అక్షయ్ కుమార్‌లతో పంచుకున్నారు హీరో రణవీర్ సింగ్, దర్శకుడు రోహిత్ శెట్టి, నిర్మాత కరణ్ జోహార్. ఆ క్షణాలను ఇలా ఫొటోలో బంధించి నెట్‌లో పోస్ట్ చేశారు.

ట్విటర్ టాక్



"దేవదూతలంతా మాయమైపోయినప్పుడు... దుష్టశక్తులు చుట్టూ సంచరిస్తున్నప్పుడు... నీకొక స్వర్గ ద్వారం కనిపిస్తుంది. దాని దగ్గర ఒక వ్యక్తి కనిపిస్తాడు. అతడే సైనికుడు. మన రక్షకుడు. సరిహద్దు ద్వారం వద్ద అతడు నిలబడబట్టే ఈరోజు మనమిలా ఉన్నాం. సైనికులారా... వందనం."

- విక్కీ కౌశల్, బాలీవుడ్ నటుడు



ఈవెంట్

మొదట్లో కాస్త డల్‌గా నడిచినా వరలక్ష్మి శరత్ కుమార్ కెరీర్ ఇప్పుడు ఊపందుకుంది. తాజాగా 'డ్యానీ' అనే సినిమాకి సైన్ చేసింది. ఆ చిత్రం ఇటీవలే ప్రారంభమయ్యింది. ఆ సందర్భంగా తీసిన ఫొటోలో టీమ్‌తో వరలక్ష్మి.



బయోపిక్ రానుందా?!

మరణించి చాలా రోజులైనా శ్రీదేవి ఇంకా వార్తల్లోనే ఉంది. దానికి కారణం... ఆమెపై బయోపిక్ తీస్తారా అన్న ప్రశ్న. రియల్ లైఫ్ స్టోరీలు తీయడానికి ముందుండే వర్మ కచ్చితంగా శ్రీదేవి జీవితాన్ని తెరకెక్కిస్తాడనే అనుకున్నారంతా. కానీ సింపుల్‌గా కుదరదనేశాడు. శ్రీదేవిలా నటించే హీరోయిన్ దొరకదు కాబట్టి చేసే ప్రసక్తి లేదన్నాడు. దాంతో ఆమె బయోపిక్‌ని ఎవరు తీస్తారు అన్న ప్రశ్న అందరినీ వెంటాడుతోంది. దానికి జవాబు దాదాపు దొరికినట్టే అనేది బాలీవుడ్ టాక్. శ్రీదేవి భర్త బోనీకపూరే ఆమె జీవితాన్ని సినిమాగా తీయాలని అనుకుంటున్నారట. ఆల్రెడీ ఆమె మీద డాక్యుమెంటరీ చేసేందుకు కొన్ని టైటిల్స్ రిజిస్టర్ చేసిన బోనీ... మనసు మార్చుకుని సినిమా తీయాలనుకుంటున్నారని కొందరు సన్నిహితులు అంటున్నారు. లేనివి కల్పిస్తారన్న ఉద్దేశంతో ఆమె లైఫ్ స్టోరీని తాను తప్ప ఎవరూ తీయడానికి వీల్లేకుండా కాపీ రైట్ కూడా తీసుకున్నారని సమాచారం. మరి త్వరలోనే శ్రీదేవి బయోపిక్ పట్టాలెక్కుతుందేమో చూడాలి.

నెక్ గుడ్ల ధరలు (100కు) | ఫామ్‌గేట్ | రిటెయిల్
హైదరాబాద్ రూ.453 రూ.5.15
వరంగల్ రూ.455 రూ.5.15

మార్కెట్

సెన్సెక్స్ 130 35,980.93

నిఫ్టీ 30 10,802.15



మూడో రోజు మురిపించాయ్!

లాభాల్లో ముగిసిన మార్కెట్లు

ముంబై: ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు వరుసగా మూడో రోజు మురిపించాయి. ఫారిన్ ఫండ్స్ నుంచి ఫ్రెష్ ఇన్‌ఫ్లో, గ్లోబల్‌గా సంకేతాలు పాజిటివ్‌గా ఉండటంతో, చివరిలో కొనుగోళ్ల జోరు వెల్లువెత్తింది. దీంతో బీఎస్‌ఈ సెన్సెక్స్ 130 పాయింట్ల లాభంలో 35,980.93 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 30.35 పాయింట్ల లాభంలో 10,802.15 వద్ద క్లోజైంది. క్రూడాయిల్ ధరలు పెరగడంతో రూపాయి విలువ బలహీనపడింది. దీంతో పాటు ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు పాల్పడటంతో ట్రేడింగంతా మార్కెట్లు నెగటివ్ జోన్‌లో కొనసాగాయి. అయితే చివరిలో స్టాక్ మార్కెట్ కొనుగోలు పంట పండించింది. నష్టాలన్నీ కొట్టుకుపోయి, సెన్సెక్స్ 36,037.35 వద్ద గరిష్ట స్థాయిలను తాకింది. గత రెండు సెషన్లలో సెన్సెక్స్ 336.45 పాయింట్ల మేర ర్యాలీ జరిపింది. ఇంట్రాడేలో నిఫ్టీ 10,733.25 వద్ద కనిష్ట స్థాయిలను, 10,818.45 వద్ద గరిష్ట స్థాయిలను తాకింది. మంగళవారం టాప్ గెయినర్లుగా సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, యస్ బ్యాంక్, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఆటో, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు ఉన్నాయి. కొటక్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌యూఎల్, బజాజ్ ఫైనాన్స్, ఎం అండ్ ఎం షేర్లు నష్టపోయాయి.

మోన్‌శాంటో బీటీ పేటెంట్‌కు సుప్రీం ఓకే

మన సీడ్ కంపెనీలకు దెబ్బ

హైదరాబాద్, వెలుగు: జెనిటికల్లీ మోడిఫైడ్ (జీఎం) బీటీ కాటన్ మీద మోన్‌శాంటో పేటెంట్ చెల్లుతుందని జస్టిస్ రోహిన్టన్ ఎఫ్. నారిమన్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు బెంచ్ మంగళవారం స్పష్టం చేసింది. జీఎం టెక్నాలజీ మీద చెల్లించాల్సిన రాయితీలను కేంద్ర వ్యవసాయ శాఖలోని ప్రత్యేక ఏజెన్సీ నిర్ణయిస్తుందని సుప్రీం కోర్టు తీర్పు పేర్కొంది. మోన్‌శాంటో జీఎం బీటీ సీడ్ టెక్నాలజీని సబ్‌లైసెన్సింగ్ ద్వారా పొందిన ఇండియన్ సీడ్ కంపెనీలు, అందుకు రాయల్టీ చెల్లించాలి. కొన్నేళ్లపాటు ఈ విధంగా చెల్లించిన ఇండియన్ కంపెనీలు, ఆ తర్వాత పేటెంట్ చెల్లదని వాదిస్తూ, రాయల్టీ చెల్లింపులనూ నిలిపివేశాయి. హైదరాబాద్ కేంద్రంగా వున్న పెద్ద సీడ్ కంపెనీ నూజివీడు సీడ్స్ ఆధ్వర్యంలో మోన్‌శాంటోకు వ్యతిరేకంగా లీగల్ యుద్ధాన్ని నడుపుతున్నాయి.

నూజివీడు సీడ్స్ ఆధ్వర్యంలో ఈ కేసును పోరాడుతున్న విత్తన కంపెనీలకు ఇది పెద్ద ఎదురు దెబ్బే. సీడ్ ఇండస్ట్రీలో ప్రధాన కేంద్రంగా వున్న తెలంగాణలోని పలు విత్తన కంపెనీల మీద ఈ తీర్పు ప్రభావం తీవ్రంగా వుంటుంది. బీఎస్‌ఇ లిస్టెడ్ కావేరీ సీడ్ కంపెనీ షేర్లు తీర్పు నేపథ్యంలో మంగళవారం అత్యధికంగా చేతులు మారాయి. రోజూ కంటే రెండున్నర రెట్లు పెరిగిన ట్రేడింగ్‌లో కావేరి సీడ్ షేర్ ధర కూడా భారీ హెచ్చు, తగ్గులకు లోనై చివరకు 1.58 శాతం నష్టంతో ముగిసింది. మరోవైపు మోన్‌శాంటో ఇండియా లిమిటెడ్ షేర్లూ భారీగా చేతులు మారాయి. షేర్ ధర 1.78 శాతం (రూ.46) లాభంతో ముగిసింది.


బీటీ కాటన్‌పై మోన్‌శాంటో పేటెంట్ చెల్లదంటూ కిందటేడాది మే 2 న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు పక్కకు పెట్టింది. ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ మోన్‌శాంటో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. జెనిటికల్లీ మోడిఫైడ్ కాటన్ సీడ్స్ ఉత్పత్తిలో మోన్‌శాంటో ప్రపంచ లీడర్. మొక్కల రకాలు, జంతువుల వంటి వాటి మీద పేటెంట్లు ఇండియాలోని చట్టాల కింద చెల్లవని వాదిస్తూ నూజివీడు సీడ్స్



ఆధ్వర్యంలో ఇండియాలోని సీడ్స్ కంపెనీలు దాఖలు చేసిన కేసులో ఢిల్లీ హైకోర్టు ఆ తీర్పు ఇచ్చింది. ఇండియాలోని సబ్సిడియరీ మాహికో మోన్‌శాంటో బయోటెక్ (ఎంఎంబీఎల్) ద్వారా ఈ బోల్గార్డ్ 2 బీటీ కాటన్ సీడ్ టెక్నాలజీ పేటెంట్ మోన్‌శాంటో చేతిలో వుంది. పేటెంట్ హక్కుల పరిరక్షణ దిశలో సుప్రీం కోర్టు తీర్పు ముఖ్యమైనదని, దీంతో ఇండియాలో పెట్టుబడులు పెట్టాలనుకునే విదేశీ సంస్థలకు నమ్మకం పెరుగుతుందని ఇండియన్ కౌన్సిల్ ఫర్ రిసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ రిలేషన్స్ ప్రొఫెసర్ అశోక్ గులాటి చెప్పారు. కింది కోర్టుల తీర్పుల నేపథ్యంలో గత కొన్నేళ్లలో ఇండియాలో బయో టెక్నాలజీ పెట్టుబడులు నిలిచిపోయాయని, అవి మళ్లీ ఇప్పుడు పెరిగే అవకాశం వుంటుందని అన్నారు.

ప్రపంచంలో ఎక్కువగా పత్తిని ఉత్పత్తి చేస్తున్న దేశం ఇండియానే!

(2016-17లో అంచనా(మిలియన్ టన్నులు))



ఆర్‌బీఐ రిజర్వ్ ఎంతుండాలి?

జలాన్ కమిటీ చర్చలు



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ వద్ద మిగులు నిధులు ఎంత ఉండాలి, ప్రభుత్వానికి ఎంత డివిడెండ్ చెల్లించాలి.. తదితర అంశాలపై సిఫార్సులు చేయడానికి ఆర్‌బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలో ఏర్పాటైన అత్యున్నత కమిటీ మంగళవారం భేటీ అయింది. ఆరుగురు సభ్యులతో కూడిన ఈ కమిటీ ఏప్రిల్‌లో నివేదిక సమర్పించే అవకాశాలు ఉన్నాయి. కేంద్ర ఆర్థిక వ్యవహారాలశాఖ మాజీ కార్యదర్శి రాకేశ్ మోహన్ దీనికి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్‌బీఐ వంటి కేంద్రబ్యాంకులు సంక్షోభాలను మదింపు చేయడానికి, నిధులు కేటాయించడానికి ఎలాంటి ప్రమాణాలు అనుసరిస్తాయో అధ్యయనం చేయాల్సిందిగా దీనిని ప్రభుత్వం ఆదేశించింది. ఆర్‌బీఐలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా లాభాల పంపిణీ విధానాన్ని ఇది సిఫార్సు చేస్తుంది. ఆర్‌బీఐ దగ్గర అవసరానికి మించి నిధులు ఉండటంపైనా దృష్టి సారిస్తుంది. ఈ సంస్థ దగ్గరున్న రూ.9.6 లక్షల కోట్ల నిధుల పంపిణీపై అప్పటి గవర్నర్ ఉర్జిత్ పటేల్‌కు, ప్రభుత్వానికి మధ్య విభేదాలు ఏర్పడ్డ సంగతి తెలిసిందే. ఇతర దేశాల్లోని కేంద్ర బ్యాంకుల దగ్గర స్థూల ఆస్తుల పరిమాణం 14 శాతం మించడం లేదని, ఆర్‌బీఐ దగ్గర 28 శాతం ఉన్నాయని ఆర్థికమంత్రిత్వశాఖ ఆక్షేపించినట్టు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మిగులు నిల్వలపై కమిటీ వేయాలని గత నవంబరు 19న జరిగిన సమావేశంలో నిర్ణయించారు.

టర్కీ కంపెనీకి హైదరాబాద్ ఎయిర్‌పోర్టు కాంట్రాక్టు

ముంబై: జీఎంఆర్ గ్రూపు నిర్వహిస్తున్న హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో గ్రౌండ్ హ్యాండ్లింగ్ పనుల కాంట్రాక్టును టర్కీ కంపెనీ సెలెబీ ఏవియేషన్ హోల్డింగ్ దక్కించుకుంది. కాంపిటిటివ్ బిడ్డింగ్ ద్వారా కాంట్రాక్ట్ ను సొంతం చేసుకుంది. ఇందుకోసం ఆరు మిలియన్ డాలర్ల వరకు ఖర్చు చేస్తామని ఎలెబీ తెలిపింది. ఎయిర్‌క్రాఫ్ట్‌లను శుభ్రపర్చడం, సర్వీసింగ్ చేయడం, ఆహార పదార్థాలు, లగేజీ రవాణా తదితర పనులను గ్రౌండ్ హ్యాండ్లింగ్ అంటారు.

ప్రతి దేశానికో కవచం.. ఎగుమతులు పెంచేదెట్లా?

న్యూఢిల్లీ: తమను తాము కాపాడుకునే వాణిజ్య పోకడలను అన్ని దేశాలు అనుసరిస్తుండటంతో మన దేశం నుంచి ఎగుమతులను పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం, పరిశ్రమల ప్రతినిధులు చర్చించనున్నారు. ఇందుకోసం కేంద్ర వాణిజ్యమంత్రి సురేశ్ ప్రభు నేతృత్వంలో ఏర్పాటైన కౌన్సిల్ ఫర్ ట్రేడ్ డెవలప్‌మెంట్ అండ్ ప్రమోషన్ ఈ నెల 10న భేటీ కానుంది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, హరియాణా, కర్ణాటక తదితర రాష్ట్రాల వాణిజ్యమంత్రులు కూడా హాజరవుతారు.



విలేకరులతో మాట్లాడుతున్న కోహ్లీ, సరీన్ తదితరులు

వచ్చే నెల ఐటీ ఎగ్జిబిషన్

హైదరాబాద్‌లో 4, 5 తేదీల్లో

హైదరాబాద్, వెలుగు: 'ఇండియాసాఫ్ట్ 2019' పేరుతో వచ్చే నెల 4,5 తేదీల్లో ఐటీ, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ప్రదర్శన, సదస్సులు నిర్వహిస్తున్నామని కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్ (ఈఎస్‌సీ) ప్రకటించింది. 250 దేశీయ, 20 విదేశీ ఐటీ కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొంటాయి. 60 దేశాలకు చెందిన 500 మందికిపైగా ఐసీటీ బయర్లు హాజరవుతారు. సూక్ష్మ, మధ్యతరహా ఐటీ సెగ్మెంట్‌లోని కంపెనీలకు, స్టార్టప్‌లకు ఈ కార్యక్రమంలో ప్రాధాన్యం ఇస్తామని నిర్వహణా కమిటీ చైర్మన్ నళిన్ కోహ్లీ అన్నారు. హైదరాబాద్‌లో నిత్యం వ్యాపార కార్యకలాపాలు అధికమవడం, ఎన్నో కంపెనీలు పరిశోధన సంస్థలు ఇక్కడే ఉండటం, ప్రభుత్వం ఐటీ రంగాన్ని ప్రోత్సహించడం వల్ల ఈసారి కూడా ఇండియాసాఫ్ట్ కోసం ఇదే నగరాన్ని ఎంచుకున్నామని ఈఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీకే సరీన్ అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇండియా కంపెనీలు మరిన్ని దేశాలకు విస్తరించడానికి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

జిల్లాకో దళిత ఎంట్రెప్రెనూర్: డిక్కీ



హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని ప్రతీ జిల్లా నుండి ఒక్కో దళిత ఎంట్రెప్రెనూర్లను తయారు చేయడమే తన ముందున్న లక్ష్యమని దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డిక్కీ) తెలంగాణ ప్రెసిడెంట్ కే.రవి కుమార్ తెలిపారు. తన జీవిత కాలంలో ఈ యేడాది మొత్తం దళిత ఎంట్రెప్రెనూర్ల అభివృద్ధికే వెచ్చిస్తానని అన్నారు. 2019-2020 సంవత్సరానికిగాను డిక్కీ తెలంగాణ స్టేట్ బాడీ కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు డిక్కీ ఫౌండర్ మిలింద్ కాంబ్లే. ప్రెసిడెంట్ గా కే.రవి కుమార్ ఎన్నికవగా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గా బానోత్ రమేష్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ గా మునీదర్, అరుణ దాసరి లు ఎన్నికయ్యారు. 2005 లో దళిత ఎంట్రెప్రెనూర్ల కోసం ఏర్పాటు చేసిన డిక్కీ ఇప్పటివరకు ఎంతో మంది ఎంట్రెప్రెనూర్లను తయారు చేయడంలో విజయవంతమైంది.

కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలి

యుఎస్‌ఏ లో నల్లజాతీయులు జాతి వివక్షకు గురయినప్పటికీ, 60 యేళ్ల తరువాత వారి టాలెంట్ ను ప్రపంచం గుర్తించే స్థాయికి చేరుకున్నారని, యుఎస్ జిడిపి లో 10 శాతం నల్లజాతీయుల బిజినెస్‌లనుండే సమకూరుతోందని డిక్కీ ఫౌండర్ మిలింద్ కాంబ్లే తెలిపారు. అలాంటిదే ఇక్కడ కూడా జరిగేలా డిక్కీ ప్రణాళిక సిద్ధం చేస్తోందని, కాపిటల్ కుల వ్యవస్థను బద్దలు కొట్టగలుగుతుందని అన్నారు. దళిత ఎంట్రెప్రెనూర్లు ఎప్పటికప్పుడు కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. దేశంలోని ప్రతీ జిల్లాలో 20-25 దళిత ఎంట్రెప్రెనూర్లను తయారు చేయడమే లక్ష్యంగా డిక్కీ ముందుకు సాగుతోందని, కనీసం 500 జిల్లాలకు చేరువ కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగం కల్పించే స్థాయికి దళితులు ఎదగాలని డిక్కీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్ర రవికుమార్ తెలిపారు. దళితులు కూడా టాక్స్ చెల్లిస్తున్నారని అన్నారు. బ్యాంకుల నుండి లోన్ తీసుకునే స్థాయి నుండి బ్యాంకులకు బిజినెస్ కల్పించే స్థాయికి దళితులు ఎదిగారని చెప్పారు.

మన భాషలదే ఇక నెట్ రాజ్యం

ఒకప్పుడు ఇండియాలో కొత్త వస్తువులు, సేవలను మార్కెట్ చేయాలంటే పట్టణాలు, నగరాల వైపు మాత్రమే చూసేవారు. పల్లెలను ఒకింత తక్కువ దృష్టితోనే కంపెనీలు అంచనా వేసేవి. అకస్మాత్తుగా ఆ పరిస్థితి మొత్తం మారిపోయిందిప్పుడు. కొనుగోలు శక్తి భారీగా పెరుగుతుండటంతోపాటు, టెక్నాలజీనీ నగరాలతో సమానంగా చేజిక్కించుకుంటున్న ఊరి ప్రజల వైపు చూస్తున్నాయి ....చాలా కంపెనీలు. ఊరి ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రాంతీయ భాషలే సరైన మార్గమని గుర్తించి, ఆ బాటలో పరుగులు తీస్తున్నాయి. ఇంటర్‌నెట్ భవిష్యత్ విస్తరణంతా ప్రధానంగా గ్రామీణ భారతంలోనే వుండబోతోందనే అంచనాల నేపథ్యంలో ఒక్కసారిగా ప్రాంతీయ భాషలకు ప్రాముఖ్యం పెరిగిపోయింది.

వెలుగు బిజినెస్ డెస్క్:


షేర్‌చాట్, వోకల్, డైలీహంట్, అమెజాన్, గూగుల్ వంటి పెద్ద పెద్ద కంపెనీలతో పాటు 250కిపైగా ఇతరాత్ర కంపెనీలన్నీ ఇప్పుడు 'భారత' జపం చేస్తున్నాయి. ఇప్పుడెందుకు ఇంత సడెన్‌గా మన దేశం మీద ప్రేమ పుట్టుకొచ్చింది ఈ కంపెనీలకు అంటే. భారత్‌లో ముఖ్యంగా విలేజ్‌లో ఇంటర్నెట్ వాడకం విపరీతంగా పెరిగిపోతోంది. గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా స్మార్ట్‌ఫోన్‌ను ఎలా వాడాలో తెలుసుకుంటున్నారు. తమకు కావాల్సిన సమాచారాన్ని తమ స్థానిక భాషలో పొందేందుకు ఇష్టపడుతున్నారు. దీంతో స్థానిక భాషల్లో సమాచారాన్ని అందించేందుకు కంపెనీలు కూడా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. కంటెంట్ ప్లాట్‌ఫామ్స్ షేర్‌చాట్, డైలీహంట్, వోకల్, న్యూస్‌డాగ్, ప్రతిలిపి వంటి సంస్థలు తమ యూజర్ల గ్రోత్‌ను, ఇన్వెస్టర్లను విపరీతంగా పెంచుకుంటున్నాయి. ఈ ప్లాట్‌ఫామ్‌లన్నీ మన దేశీయ భాషలకే పెద్ద పీట వేస్తున్నాయి. ఆశ్చర్యకరంగా ఈ కామర్స్ ప్లేయర్స్ నుంచి ఎడ్‌టెక్ కంపెనీల దాకా, న్యూస్ అగ్రిగేటర్ల నుంచి ఇన్‌ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్స్ దాకా ...అన్నీ.... వ్యావహారిక భాషలపైనే దృష్టిపెట్టాయి. వ్యావహారిక భాషా కస్టమర్లను అందిపుచ్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి.

జియో వచ్చిన తర్వాతనే ఇదంతా...

ఇండియన్స్‌కు ప్రస్తుతం చౌకైన ఇంటర్నెట్ ప్లాన్లు అందుబాటులోకి వచ్చాయి. దీనికి ప్రధాన కారణం రిలయన్స్ జియో, టెలికాం మార్కెట్లోకి ప్రవేశించడమే. జియో లాంచైన తర్వాత నెట్ టారిఫ్ రేట్లన్నీ ఒక్కసారిగా ధమాలమన్నాయి. చిన్న గ్రామాల్లో ప్రజలు నెట్ యాక్సస్‌ను పొందుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా నిరక్షరాస్యులు కావడంతో ఇంగ్లిష్ పెద్దగా అర్థం కాదు. దీంతో వారు ఎక్కువగా తమ స్థానిక భాషలో అందించే సమాచారం పైనే ఆసక్తి చూపుతున్నారు. 2018లో చాలా కంపెనీలు, స్టార్టప్‌లు ఇండియన్ కస్టమర్లను చేరువవడానికి స్థానిక భాషలనే మార్గంగా ఎంచుకున్నాయి. ట్రాయ్ రిపోర్ట్ ప్రకారం..గతేడాది జూన్ 30 నాటికి దేశంలోని మొత్తం ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య 51.22 కోట్లను తాకింది. 2016లో ఈ సంఖ్య 42.6 కోట్లుగా ఉంది. రిలయన్స్ జియో తన సర్వీసులను 2016 సెప్టెంబర్‌లో ఇండియన్ కస్టమర్ల ముందుకు తీసుకొచ్చింది. మొత్తం ఇంటర్నెట్ యూజర్లలో 95.78% ఇంటర్‌నెట్‌ను మొబైల్ ఫోన్ల ద్వారానే వాడుతున్నారు. పెద్ద మొత్తంలో మొబైల్ ఫోన్ యూజర్ బేస్, ఇంటర్నెట్ వాడకాన్ని పెంచుతోంది. తొలిసారి ఇంటర్నెట్ వాడేవారు, ఫోన్లలోనే కంటెంట్‌ను చూసేందుకు మొగ్గుచూపుతున్నారు. దీంతో ఫస్ట్‌టైమ్ ఇంటర్నెట్ యూజర్లకు స్థానిక భాషలో కంటెంట్ అందుబాటులోకి తేవడానికి చాలా కంపెనీలు పుట్టుకొస్తున్నాయి. ఈ కంపెనీల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. ఇండియన్ డిజిటల్ యాడ్ మార్కెట్ కేవలం 200 కోట్ల డాలర్లే. అదే చైనా విషయానికొస్తే 7000 కోట్ల డాలర్లు, అమెరికా విషయానికొస్తే 10,400 కోట్ల డాలర్లుగా ఉంది. ప్రస్తుతం ఇండియన్ డిజిటల్ అడ్వర్‌టైజింగ్ మార్కెట్ శరవేగంతో పెరుగుతోంది. కంటెంట్ అగ్రిగేటర్లందరూ కొత్తగా ఇంటర్‌నెట్ వినియోగించే 50 కోట్ల మంది భారతీయులకు ఏం కావాలో అది అందించేందుకే ప్రయత్నిస్తున్నారు. ఈ విభాగంలో ప్రస్తుతం ఎక్కువగా లబ్ధి పొందుతున్నది డైలీహంట్. ఈ ప్లాట్‌ఫామ్‌కు 10 కోట్ల మందికి పైగా యూజర్లున్నారు. 2019 ఆర్థిక సంవత్సరంలో 4 కోట్ల డాలర్ల రెవెన్యూలను పొందనున్నట్టు చెప్పింది. కంటెంట్ వైపుకి చూడటానికి ఇన్వెస్టర్లకి, ఫౌండర్లకి ఇదే ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.



- ఎంఎన్‌సీలు, స్టార్టప్‌ల చూపంతా స్థానిక భాషల మీదే
- గ్రామీణ ప్రజలను చేరాలంటే ఇదే మార్గం



జియో ఎఫెక్ట్‌తో.. లోకల్ డిజిటలైజేషన్ అనే కల సాకారమైంది. ఊహించదానికంటే ముందుగానే, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చేసింది. లాంగ్వేజ్‌తో ఇండియాలో మరింత మంది కస్టమర్లను అందుకోవచ్చు. యూజర్ బేస్ కూడా భారీగా వృద్ధి చెందుతోంది. లోకల్ లాంగ్వేజ్ ఎవరూ తోసిపుచ్చలేని విషయమని అంచనాలు వస్తున్నాయి. లోకల్ లాంగ్వేజ్ కంటెంట్, ఇంగ్లీష్‌ను బీట్ చేస్తుందని పలువురు నిపుణులు చెబుతున్నారు. కేపీఎంజీ రిపోర్ట్ ప్రకారం ఇండియన్ లాంగ్వేజ్ ఇంటర్నెట్ యూజర్ బేస్ వార్షికంగా 18% వృద్ధి చెందుతూ 2021 నాటికి 53.6 కోట్లను తాకనుంది. అంచనా కంటే ఇది ఇంటర్నెట్ యూజర్ బేస్‌లో 75%.

పెరుగుతోన్న విదేశీయుల(చైనీస్) ఆసక్తి...

ప్రస్తుతం ఇండియాలో కంటెంట్‌ను అందిస్తున్న ప్లాట్‌ఫామ్స్‌లో పెట్టుబడులు పెట్టడానికి విదేశీ కంపెనీలు బాగా ఆసక్తి చూపుతున్నాయి. ముఖ్యంగా చైనీస్ కంపెనీలు చూపిస్తోన్న ఆసక్తి అంతా ఇంతా కాదు. అలీబాబా గ్రూప్ కూడా తాము ఇండియన్ కంపెనీల్లో ముఖ్యంగా కంటెంట్‌ను అందించే ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు చూస్తున్నట్టు ప్రకటించింది. గత ఏడాది కాలంగా చాలా కంపెనీలు ఇండియాలో ఇన్వెస్ట్‌మెంట్లు పెట్టాయి. వాటిలో బెర్క్‌షైర్ హాత్‌వే, మార్నింగ్‌సైడ్ వెంచర్ క్యాపిటల్, కాంపోజిట్ క్యాపిటల్ వంటివి ఉన్నాయి. షున్‌వి క్యాపిటల్ కూడా 12 డీల్స్‌ను కుదుర్చుకుంది. 2017లో కేవలం 2 డీల్స్‌నే చేపట్టింది. బీనెక్స్ట్ కూడా తన డీల్ సంఖ్యను నాలుగు నుంచి ఎనిమిదికి పెంచుకుంది. షున్‌వి 2018లో ఎక్కువగా ఇండియన్ లాంగ్వేజ్ కంటెంట్‌పై దృష్టిపెట్టిందని, వోకల్‌లో పెట్టుబడులు పెట్టినట్టు తెలిపింది. ప్రతిలిపి ఫిబ్రవరిలో 43 లక్షల డాలర్ల నిధులను సేకరించింది. న్యూస్ అగ్రిగేటర్ న్యూస్‌డాగ్ కూడా ఇండియన్ లాంగ్వేజ్‌లపై ఎక్కువగా ఫోకస్ చేస్తోంది. టెన్సెంట్, ఇతర కంపెనీల నుంచి 5 కోట్ల డాలర్లను సేకరించింది. వోకల్ 65 లక్షల డాలర్లను, షేర్‌చాట్ 1.18 కోట్ల డాలర్లను, డైలీహంట్ 65 లక్షల డాలర్లను సేకరించాయి.

గతేడాది జూన్ 30 నాటికి మొత్తం ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య **51.22** కోట్లు

2016లో మొత్తం ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య **42.6** కోట్లు

జియో సబ్‌స్క్రైబర్ బేస్ **21.52** కోట్లు

వచ్చే రెండేళ్లలో జియో సబ్‌స్క్రైబర్ బేస్ 40 కోట్లు తాకనుందని అంచనా

ఇండియన్ డిజిటల్ అడ్వర్‌టైజింగ్ మార్కెట్ **200** కోట్ల డాలర్లు

చైనా డిజిటల్ అడ్వర్‌టైజింగ్ మార్కెట్ **7,000** కోట్ల డాలర్లు

అమెరికా డిజిటల్ అడ్వర్‌టైజింగ్ మార్కెట్ **10,400** కోట్ల డాలర్లు

కంటెంట్ ప్లాట్‌ఫామ్స్‌లో పెట్టుబడులు పెట్టడానికి విదేశీ కంపెనీలు ఆసక్తి

- కంటెంట్ ప్లాట్‌ఫామ్‌ల నిధుల సేకరణ
- ప్రతిలిపి ఫిబ్రవరిలో 43 లక్షల డాలర్ల నిధుల సేకరణ
- న్యూస్‌డాగ్‌కు టెన్సెంట్, ఇతర కంపెనీల నుంచి 5 కోట్ల డాలర్లు
- వోకల్ 65 లక్షల డాలర్లు నిధులు
- షేర్‌చాట్ 1.18 కోట్ల డాలర్లు
- డైలీహంట్ 65 లక్షల డాలర్లు

ప్లే PLAY
ప్రభాత
వెలుగు
బుధవారం | హైదరాబాద్
www.v6velugu.com 09.01.2019
Follow: v6velugu



ధోనీని మించిన పంత్

పుజారాకు 3, టాప్ ర్యాంక్ కోహ్లీదే

దుబాయ్ : ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తాజా టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో భారత యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్ వెటరన్ వికెట్ కీపర్ ధోనీని దాటేశాడు. తాజా ర్యాంకింగ్స్‌లో పంత్ 21 స్థానాలు మెరుగుపరచుకొని 17వ స్థానానికి చేరుకున్నాడు. దీంతో ధోనిని అధిగమించి టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన ఇండియన్ వికెట్ కీపర్‌గా నిలిచాడు. ఇంతకుముందు ఫరూక్ ఇంజినీర్ కూడా 17వ ర్యాంక్ సాధించాడు. ధోనీ టెస్ట్ కెరీర్‌లో అత్యుత్తమంగా 19వ ర్యాంక్ సాధించాడు. ఇక పంత్ ఖాతాలో ప్రస్తుతం 673 పాయింట్లు ఉన్నాయి. ధోనీ తన కెరీర్‌లో అత్యధికంగా 662 పాయింట్లు సాధించాడు. ఇందులో కూడా ధోనీని పంత్ దాటేశాడు. ఆసీస్‌తో టెస్టు సిరీస్‌లో 521 రన్స్ చేసిన పుజారా టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో నిలిచాడు. ఇక టీమిండియా కెప్టెన్ కోహ్లీ మళ్లీ టాప్ ర్యాంక్ నిలబెట్టుకున్నాడు. జడేజా 57వ స్థానంలో, మయాంక్ 62వ స్థానంలో కొనసాగుతున్నారు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్‌లో జడేజా ఒక స్థానం మెరుగుపర్చుకుని ఐదో స్థానంలో నిలిచాడు. టాప్-5లో టీమిండియా నుండి జడేజా ఒక్కడే ఉన్నాడు. బుమ్రా 16, షమీ 22వ స్థానాల్లో కొనసాగుతున్నారు. స్పిన్నర్ కుల్దీప్ ఏడు స్థానాలు ఎగబాకి 45వ స్థానంలో నిలిచాడు. టీమ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా టాప్ ప్లేస్‌లో ఉంది.

ఇండియాలోనే ఐపీఎల్-12

- స్పష్టం చేసిన సీవోఏ
- మార్చి 23నే టోర్నీ షురూ
- త్వరలో షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: క్రికెట్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పన్నెండో సీజన్ విదేశాలకు తరలిపోవడం లేదు. ఈ మెగా లీగ్ ఇండియాలోనే జరగనుంది. లోక్‌సభ ఎన్నికల డేట్స్‌తో క్లాష్ అవుతున్నా ఐపీఎల్‌ను ఇక్కడే నిర్వహించాలని బీసీసీఐ పరిపాలకుల కమిటీ (సీవోఏ) నిర్ణయించింది. అయితే, వన్డే వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకొని లీగ్‌ను ఈ సారి కాస్త ముందుగా, మార్చి 23నే ప్రారంభించాలని నిర్ణయించినట్టు సీవోఏ చీఫ్ వినోద్ రాయ్ ప్రకటించారు. 'ఐపీఎల్ పన్నెండో సీజన్‌ను ఇండియాలోనే నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సెక్యూరిటీ ఏజెన్సీలతో సమావేశమై వేదికలను, షెడ్యూల్‌ను ఖరారు చేస్తాం' అని రాయ్ తెలిపారు. ఈ స్టేట్‌మెంట్‌తో ఐపీఎల్ ఎక్కడ జరుగుతుందనే చర్చకు ఫుల్‌స్టాప్ పడింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 2014 మాదిరిగా ఈ సీజన్‌ను కూడా విదేశాల్లో ని



ర్వహిస్తారన్న వార్తలు వచ్చాయి. జనరల్ ఎలక్షన్స్ అడ్డురావడంతో 2009తో పూర్తి సీజన్‌ను సౌతాఫ్రికాలో, 2014లో సగం సీజన్‌ను యూఏఈలో నిర్వహించారు. అయితే, లోక్‌సభ ఎన్నికలు దశలవారీగా జరుగుతాయి గనుక.. ఐపీఎల్‌కు పెద్దగా ఇబ్బంది ఉండకపోచ్చని పలువురు భావిస్తున్నారు. కాగా, ఈ ఏడాది మే 30 నుంచి ఇంగ్లండ్‌లో వన్డే వరల్డ్ కప్ మొదలవనున్న నేపథ్యంలో మెగా లీగ్‌ను ముందుకు జరపాలని నిర్ణయించారు. బీసీసీఐ కొత్త రాజ్యాంగం ప్రకారం.. ఐపీఎల్ ముగిసిన తర్వాత ఇండియా ఆడే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లకు 15 రోజుల వ్యవధి ఉండాలి. చివరగా 2010లో ఐపీఎల్ మార్చిలో మొదలైంది.

వన్డే జట్టులో సిరాజ్

బుమ్రాకు రెస్ట్, కివీస్‌తో సిరీస్‌కు కౌల్

ముంబై: ఆస్ట్రేలియా గడ్డ మీద తొలిసారి టెస్ట్ సిరీస్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన టీమిండియా పేస్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాకు వన్డే సిరీస్‌లో సెలెక్టర్లు విశ్రాంతి కల్పించారు. బుమ్రా ప్లేస్‌లో హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు అవకాశం కల్పించారు. వచ్చే వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకొని పేసర్లపై పనిభారం తగ్గించాలని టీమిండియా కెప్టెన్ కోహ్లీ ఆలోచన. ఇదే అభిప్రాయాన్ని కోహ్లీ బోర్డు పెద్దల దృష్టికి తీసుకెళ్లాడు. కోహ్లీ సూచనతో టీమ్ మేనేజ్‌మెంట్ బుమ్రాకు విశ్రాంతినిచ్చింది. ఈ నెలాఖరులో న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌కు కూడా బుమ్రా దూరం కానున్నాడు. న్యూజిలాండ్‌తో వన్డేల్లో బుమ్రా స్థానంలో సిరాజ్ ఆడనుండగా.. టీ20ల్లో సిద్దార్థ్ కౌల్‌కు అవకాశమిచ్చారు. ఐపీఎల్‌లో కోహ్లీతో కలిసి బెంగళూరు తరఫున ఆడుతున్న సిరాజ్.. దేశవాళీ క్రికెట్లో అద్భుతంగా రాణిస్తున్నాడు. పంజాబ్‌పై ఆడిన చివరి రంజీ మ్యాచ్‌లో ఏడు వికెట్లు తీశాడు.



ఇండియా - ఆస్ట్రేలియా వన్డే సిరీస్ షెడ్యూల్		
జనవరి 12	తొలి వన్డే	సిడ్నీ
జనవరి 15	రెండో వన్డే	అడిలైడ్
జనవరి 18	మూడో వన్డే	మెల్‌బోర్న్

చాంప్ గాయత్రి

- మిక్స్‌డ్ విజేత నవనీత్–సాహితి
- ఆలిండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్

హైదరాబాద్, వెలుగు: బ్యాడ్మింటన్ గురు పుల్లెల గోపీచంద్ కూతురు పుల్లెల గాయత్రి ఖాతాలో మరో టైటిల్ చేరింది. జూనియర్ లెవెల్‌లో గత కొంతకాలంగా గొప్పగా రాణిస్తున్న గాయత్రి ఆలిండియా జూనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో సింగిల్స్ చాంపియన్‌గా నిలిచింది. ఆమెతో పాటు తెలంగాణకు చెందిన బొక్కా నవనీత్- బండి సాహితి జంట మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. జైపూర్‌లో మంగళవారం జరిగిన బాలికల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ గాయత్రి 22-20, 21-10తో తెలంగాణకే చెందిన సహచర ప్లేయర్ ఏడో సీడ్ సామియా ఇమాద్ ఫరూఖిని ఓడించింది. ఇక, అండర్-19 మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో రెండో సీడ్ నవనీత్-సాహితి జోడీ 21-14, 21-18తో దింకూ సింగ్ కొంతౌజామ్ (మణిపూర్)-కవిప్రియ (పుదుచ్చెరి) జంటను వరుస గేమ్‌ల్లో



ఓడించింది. బాలుర సింగిల్స్ ఫైనల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన టాప్ సీడ్ ప్రియాన్షు రజావత్ 21-11, 23-21తో నాలుగో సీడ్ ఆకాశ్ యాదవ్ (ఢిల్లీ)పై గెలిచాడు.

రేసులోనే రాప్టర్స్..

బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ నాలుగో సీజన్‌లో కీలక విజయం సాధించిన బెంగళూరు రాప్టర్స్ సెమీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. సొంతగడ్డపై మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో రాప్టర్స్ 5-0తో ముంబై రాకెట్స్‌ను ఓడించింది. బెంగళూరు ట్రంప్‌గా ఎంచుకున్న మహిళల సింగిల్స్‌లో ఆ జట్టు ప్లేయర్ వు తై త్రాంగ్ 15-4, 11-15, 15-7తో శ్రియాన్షి పరదేశీపై గెలిచింది. పురుషుల డబుల్స్‌లో రాప్టర్స్ జోడీ మహ్మద్ అషాన్-హేంద్ర సెతైవాన్ 15-11, 15-11తో కిమ్ గి జంగ్-లీ యాంగ్ దయెపై నెగ్గి 3-0తో ఆధిక్యం అందించింది. ఇక, మ్యాచ్‌లో నిలవాలంటే తప్పక నెగ్గాల్సిన పురుషుల మొదటి సింగిల్స్‌లో ముంబై ప్లేయర్ ఆండ్రెస్ ఆంటోన్సెన్ 14-15, 13-15తో బెంగళూరు కెప్టెన్ కిడాంబి శ్రీకాంత్ చేతిలో ఓడిపోయాడు. దాంతో, మిగతా రెండు మ్యాచ్‌లు నామమాత్రమయ్యాయి. ముంబై ట్రంప్ పోరు అయిన పురుషుల రెండో సింగిల్స్‌లో సమీర్ వర్మ 15-12, 5-15, 13-15తో సాయిప్రణీత్ చేతిలో ఓడిపోయాడు. దీంతో, ముంబై మైనస్ వన్ పాయింట్‌లోకి వెళ్లింది. అయితే, చివరిదైన మిక్స్‌డ్ డబుల్స్‌లో ముంబై జోడీ పియా జెబాదియా-కిమ్ గి జాంగ్ 15-14, 15-13తో మార్కస్ ఎలిస్-లారెన్ స్మిత్ (రాప్టర్స్)పై గెలిచింది.



'దిగ్గజాలకే సాధ్యం కాని ఘనత'...
'ఏడు దశాబ్దాల స్వప్నం'...
' వరల్డ్ కప్ కంటే ఎక్కువే'...
'ఇదే అత్యుత్తమ విజయం'.

ఆసీస్ గడ్డపై టెస్టు విజయం అనంతరం అందరి నోటి నుంచి ఇలాంటి మాటలే వినిపిస్తున్నాయి.

దశాబ్దాల కల సాకారమిలా..

వెలుగు క్రీడా విభాగం

టీమిండియా గత 11 పర్యాయాలు ఆసీస్‌లో పర్యటించిన ప్రతిసారి బ్యాటింగే ప్రధాన బలంగా బరిలో దిగింది. కానీ ఈసారి ఏ ఒక్క విభాగాన్నో నమ్ముకోకుండా .. ఓవరాల్‌గా సత్తాచాటింది. బ్యాటింగ్‌లో పుజారా, పంత్ దుమ్మురేపితే... బౌలింగ్‌లో బుమ్రా ప్రత్యర్థులకు సింహస్వప్నంలా నిలిచాడు. ఈ చరిత్రాత్మక గెలుపులో టీమిండియా విజయానికి దోహదం చేసిన ప్రధాన అంశాలపై ఓ కన్నేస్తే....

నేనున్నానని...

అడిలైడ్‌లో జరిగిన తొలి టెస్టు తొలి గంటలోనే భారత్ 41/4 తో నిలిచింది. ఇంకేముంది సగటు ప్రేక్షకులంతా నీరుగారిపోయారు. ఆహోఓహో ఇదే అత్యుత్తమ జట్టు, ఆసీస్‌లో పర్యటించిన జట్లన్నీటిలో మేటి ఇదే అనే ఊహాగానాలపై తొలి సెషన్‌లోనే నీళ్లు చల్లినట్లైంది. ఓ వైపు మెరుపు వేగంతో ప్రత్యర్థి బౌన్సర్లు, మరోవైపు మన బ్యాటింగ్ ఆర్డర్ ఘోర వైఫల్యం. ఇంకేముంది అదే కథ. ఇది కూడా మరో చేదు సిరీస్‌గానే మిగిలిపోతుందేమో అనే భావన. కానీ కష్ట కాలంలో నేనున్నాంటూ... నయా వాల్ చటేశ్వర్ పుజారా నిలిచాడు. విరాట్ కోహ్లీ లాంటి మేటి బ్యాట్స్‌మన్ ఇబ్బంది పడ్డ చోట తన విలువ చాటుకున్నాడు. టెక్నిక్, సంయమనంలో జట్టులో అందరికంటే ముందుండే పుజారా... తన అసలు సిసలు ఆట బయటకు తీశాడు. ఓవర్లకు ఓవర్లు... సెషన్లకు సెషన్లు క్రీజులో పాతుకుపోతూ... అవతలి ఎండ్‌లో బ్యాట్స్‌మెన్ స్వేచ్ఛగా ఆడేందుకు వీలు కలిపించాడు. దీంతో తొలి టెస్టు విజయం సాధించిన కోహ్లీసేన ప్రత్యర్థిపై మానసికంగా పైచేయి సాధించింది.

పంత్ పటాకా...

ఈ సిరీస్‌లో అందరికంటే ఎక్కువ ఆకట్టుకున్న ఆటగాడెవరైనా ఉన్నడంటే అది కచ్చితంగా వికెట్ కీపర్ రిషభ్ పంత్ అనే చెప్పుకోవాలి. ఆసీస్ ఆటగాళ్లకు దీటుగా స్లెడ్జింగ్ చేయడం నుంచి... ఆ దేశ ప్రధానితో ఆ అంశం గురించి చర్చించడం వరకు... అతను ఏం చేసినా సంచలనంగానే నిలిచింది. ఇక చివరి టెస్టులో పంత్ ఇన్నింగ్స్ చాలా కాలం పాటు గుర్తుండిపోతుంది. విదేశీ సిరీస్‌ల్లో కీపర్ అంటే కేవలం వికెట్ల వెనుక బంతిని అందుకోవడానికే అనే భావనను అతను మార్చేశాడు. పంత్ బ్యాటింగ్ చేస్తుంటే గిల్‌క్రిస్ట్‌ను చూసినట్లు ఉంది అని పాంటింగ్ అంతటి వాడే అన్నాడంటే అతని దూకుడు ఏవిధంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది ఇంగ్లండ్ గడ్డపై సెంచరీతో ఆకట్టుకున్న రిషభ్ ఈ సిరీస్‌లో పరుగుల వరద పారించాడు. 350 పరుగులతో కోహ్లీ (282 పరుగులు)ని మూడో స్థానానికి నెట్టి టాప్2లో నిలిచాడు.

మయాంక్ మాయ...

ఈ సిరీస్‌కు ముందు మయాంక్ అగర్వాల్ ఆసీస్ గడ్డపై టెస్టుల్లో అరంగేట్రం చేస్తాడంటే... ఎవ్వరు నమ్మి ఉండరు. కానీ పరిస్థితుల ప్రభావం వల్ల అదే జరిగింది. ఓపెనర్ల ఘోర వైఫల్యంతో మూడో టెస్టుకు అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. హనుమ విహారి, దేశవాళీల్లో టన్నుల కొద్ది పరుగులు చేసిన మయాంక్‌లకు అవకాశమొచ్చింది. మెల్‌బోర్న్ టెస్టులో విహారి (8, 13) ఫర్వా లేదనిపించగా... మయాంక్ (76, 42) దుమ్మురేపాడు. మిషెల్ స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్ వంటి బౌలర్లను ఎదుర్కొంటూ మయాంక్ అగర్వాల్ చూపెట్టిన పట్టుదల అమోఘం. ఆసీస్ గడ్డపై అరంగేట్రంలోనే అర్ధసెంచరీ బాదిన ఇండియా తొలి ఓపెనర్‌గా రికార్డులకెక్కాడు.

కోచ్‌లకు పాతిక.. ప్లేయర్లకు 15 లక్షలు

ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్ట్ సిరీస్ నెగ్గి చరిత్ర సృష్టించిన టీమిండియాకు బీసీసీఐ నగదు బహుమతి ప్రకటించింది. అద్భుత విజయం సాధించిన కోహ్లీసేనకు అభినందనలు తెలిపిన బోర్డు టీమ్ సభ్యులతో పాటు రిజర్వ్ ప్లేయర్లు, కోచింగ్, సపోర్ట్ స్టాఫ్‌కు బోనస్ ఇస్తున్నట్టు తెలిపింది. సిరీస్‌లో తుది జట్టులో ఆడిన పదకొండు మంది క్రికెటర్లకు ఒక్కొక్కరికి రూ. 15 లక్షలు, రిజర్వ్ ప్లేయర్లకు రూ. 7.5 లక్షలు ఇస్తామని చెప్పింది. కోచ్‌లు ఒక్కొక్కరు తలో 25 లక్షలు అందుకుంటారు. నాన్-కోచింగ్ సపోర్ట్ స్టాఫ్.. తమ ప్రొఫెషనల్ ఫీజు లేదా ప్రొ-రేటా శాలరీకి సమానంగా బోనస్ అందుకుంటారని బీసీసీఐ చెప్పింది.

'వెళ్లు, క్రీజులో ఏకాగ్రత కనబరుచు. జట్టులో చివరి బ్యాట్స్‌మన్‌గానే నువ్వు వెనుదిరగాలి. పరుగులతో సంబంధం లేదు. కేవలం నువ్వు సమయంతో ఆడుకో'ఇది టెస్టు సిరీస్ ప్రారంభంలో టీమిండియా హెడ్‌కోచ్ రవి శాస్త్రి, కెప్టెన్ కోహ్లీ... పుజారాతో చెప్పిన మాటలు. వాటిని చటేశ్వర్ వందకు వంద శాతం నిజం చేశాడు. 7 ఇన్నింగ్స్‌ల్లో 1258 బంతులు ఎదుర్కొన్నాడు. సగటున ఒక్కో టెస్టులో 52.4 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి కెప్టెన్, కోచ్‌ల నమ్మకాన్ని నిలబెట్టాడు.

బుమ్రాస్త్రం...

విదేశీ పర్యటన అంటేనే టీమిండియా బౌలింగ్ బలహీనతలు బయటపడుతుంటాయి. అప్పుడప్పుడు మెరుపులు తప్పా... మన బౌలింగ్ దళం నిలకడగా రాణించిన దాఖలాలు పెద్దగా లేవు. కానీ ఈ సారి వాటికి భిన్నంగా కోహ్లీసేన బౌలింగ్‌తోనే సత్తా చాటింది. 7 ఇన్నింగ్స్‌ల్లోనూ ప్రత్యర్థిని ఆలౌట్ చేసింది. ముఖ్యంగా బుమ్రా 4 టెస్టుల్లో 21 వికెట్లు పడగొట్టాడు. తన బౌలింగ్ పదునేంటో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్‌కు రుచి చూపెట్టాడు. ప్రత్యర్థి బౌన్సర్లకు తలవంచే ఇండియా బ్యాట్స్‌మెన్‌ను చూడడం అలవాటు చేసుకున్న ప్రేక్షకులకు మనం కూడా బౌన్సర్లు వేయగలం అనే భరోసా కల్పించాడు. లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడుతూనే వైవిధ్యమైన బంతులతో బ్యాట్స్‌మెన్‌ను బోల్తా కొట్టించాడు.

విజయంలో శ్రీలంక పాత్ర...

ఆసీస్‌పై చరిత్రాత్మక విజయంలో శ్రీలంక పాత్ర కూడా ఉంది. సొంత గడ్డపై స్టార్క్‌లాంటి పేసర్లను ఎదుర్కొనేందుకు టీమిండియా నెట్స్‌లో తీవ్రంగా శ్రమించింది. ఇందులో భాగంగా శ్రీలంకకు చెందిన ఎడమ చేతి వాటం ఫస్ట్ క్లాస్ క్రికెటర్ నువాన్ సేనెవిరత్నేను త్రో డౌన్ స్పెషలిస్ట్‌గా నియమించుకుంది. నెట్స్‌లో అతని బంతులను ఆడటం అలవాటు చేసుకున్న మన బ్యాట్స్‌మెన్ అసలు సమరంలో స్టార్క్‌ను అలవోకగా ఎదుర్కొన్నారు. దీంతో ఫలితం మనకు అనుకూలంగా వచ్చింది. గతంలో ఆసియాకప్ సందర్భంగా పాకిస్తాన్ పేసర్లను ఎదుర్కొనేందుకు మన జట్టు.. రఘు అనే కుడి చేతివాటం త్రో డౌన్ స్పెషలిస్ట్‌ను నియమించుకున్న విషయం తెలిసిందే.

రామ్‌కుమార్, అంకిత బోణీ

మెల్‌బోర్న్: ఇండియా యంగ్ ప్లేయర్లు రామ్‌కుమార్ రామ్‌నాథన్, అంకిత రైనా ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయింగ్ రౌండ్ తొలి మ్యాచ్‌లో బోణీ కొట్టారు. . మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్ తొలి మ్యాచ్‌లో రామ్‌కుమార్ (21వ సీడ్) 6–3, 6–2 స్కోరుతో సెర్జియో గుటెరెజ్ (స్పెయిన్)ను ఓడించాడు. మహిళల తొలి క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ ఆడబోతున్న అంకిత 6–2, 6–2 స్కోరుతో జార్జెస్ (ఫ్రాన్స్)ను ఓడించింది.

గిరినాథ్‌కు ఆరు వికెట్లు

ఇండోర్: బ్యాటింగ్‌లో తడబడిన ఆంధ్ర జట్టు బౌలింగ్‌లో అనూహ్యంగా చెలరేగింది. రంజీ ట్రోఫీ గ్రూప్-బిలో భాగంగా జరుగుతున్న తమ చివరి మ్యాచ్‌లో 132 పరుగులకే ఆలౌటైన ఆంధ్ర.. మీడియం పేసర్ గిరినాథ్ రెడ్డి (6/26) ఆరు వికెట్లతో విజృంభించడంతో మధ్యప్రదేశ్‌పై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకుంది. గిరినాథ్ ధాటికి మధ్యప్రదేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో 91 రన్స్‌కే కుప్పకూలింది. అనంతరం 41 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించి మంగళవారం చివరకు 198/7 స్కోరుతో నిలిచింది.


కివీస్ క్లీన్‌స్వీప్

నెల్సన్: శ్రీలంకతో జరిగిన మూడో వన్డేలో న్యూజిలాండ్ 115 రన్స్‌తో భారీ విజయాన్నందుకుని మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. టేలర్ (137: 131 బాల్స్, 9x4, 4x6), నికోల్స్ (124: 80బాల్స్, 12x4, 3x6) సూపర్ సెంచరీలతో మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 364 రన్స్ చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 41.4 ఓవర్లలో 249 రన్స్‌కు ఆలౌట్ అయింది. కివీస్ బౌలర్ ఫెర్గూసన్ నాలుగు, సోధి మూడు వికెట్లు పడగొట్టి లంకను కుప్పకూల్చారు. సెంచరీ హీరో టేలర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. శుక్రవారం జరిగే ఏకైక టీ20 మ్యాచ్‌కు ఆల్‌రౌండర్ నీషమ్ గాయంతో దూరమయ్యాడు.

సంక్షిప్త స్కోర్లు: న్యూజిలాండ్ :50 ఓవర్లలో 364/4 (విలియమ్సన్ 55, టేలర్ 137, నికోల్స్ 124. మలింగ 3/93, శ్రీలంక : 41.4 ఓవర్లలో 249 ఆలౌట్ (పెరీరా 80, డిక్‌వెల్లా 46, డి సిల్వా 36, కుశాల్ పెరీరా 43, గుణతిలక 31, ఫెర్గూసన్ 4/40, సోధి 3/40).


భళా ఇండియా


న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ గెలుచుకున్న కోహ్లీ సేనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ కూడా టీమిండియాకు అభినందనలు తెలిపారు. ట్విట్టర్ ద్వారా కోహ్లీసేనను ఇమ్రాన్‌ను అభినందించారు. 'ఆస్ట్రేలియాలో తొలిసారి టెస్ట్ సిరీస్ విజయం సాధించిన టీమిండియాకు, కెప్టెన్ విరాట్ కోహ్లీకి అభినందనలు. ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ సిరీస్ నెగ్గిన ఆసియా తొలి క్రికెట్ జట్టుకు కంగ్రాట్స్' అంటూ ఇమ్రాన్ ట్వీట్ చేశారు.



'చాలా గర్వంగా ఉంది. ఆస్ట్రేలియా గడ్డపై కంగారూల మెడలు వంచిన కోహ్లీసేనను చూసి న తర్వాత ఆనందంతో నా కళ్లు చెమర్చాయి. అదొక గొప్ప రోజు కాబట్టి నేను అక్కడ ఉండి ట్రోఫీని అందిస్తే ఇంకా అద్భుతంగా ఉండేది. టీమిండియా విజయం, ట్రోఫీని అందుకోవడాన్ని చూడటం నిజంగా మెమరబుల్ ఈవెంట్'

- సునీల్ గావస్కర్, టీమిండియా మాజీ క్రికెటర్









బతుకు రేసులో ఓడిన జింక

బతుకు రేసిది! ఆకలి తీర్చుకోవడానికి చిరుత పరుగులు! దాని బారి నుంచి తప్పించుకోవడానికి జింక ఉరుకులు! ఆ రేసులో చివరకు గెలిచింది చిరుతే. కాళ్లకు అడ్డుపడిన పెద్ద పుట్ట.. బతుకు రేసులో జింకను ఓడిపోయేలా చేసింది. పాపం, పరుగు మధ్యలో పుట్టకు తగిలి అంతెత్తు జింక గాల్లోకి ఎగిరితే.. ఆ గాల్లోనే వాయువేగంతో వస్తున్న చిరుత ఎగిరి జింకను పట్టేసింది. మెడను కొరికేసింది. ఆకలి తీర్చుకుని శాంతించింది. జింక ప్రాణం పోయింది. కెన్యాలోని మాసాయి మారా నేషనల్ రిజర్వ్‌లో ఈ వేట సాగింది.

జర్మనీకి చెందిన 70 ఏళ్ల రెయిన్‌హార్డ్ రాడ్కే అనే ఫొటోగ్రాఫర్ ఈ చిరుత వేటను కెమెరాలో పట్టేశాడు.

తెలివైన పని!

అన్ని పనుల్లోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్


"కస్టమర్ కేర్‌కు స్వాగతం.. మీకు కావాల్సిన భాషను ఎంచుకోవడానికి ఒకటి నొక్కండి... మా కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌తో మాట్లాడడానికి 9 నొక్కండి.." కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసినప్పుడు వినిపించే బ్యాగ్రౌండ్ గొంతిది. ఓ వ్యక్తితో ముందే రికార్డు చేయించి పెడతారు. అయితే, ఇప్పుడు కాలం మారింది. మనిషికి బదులు యంత్రాలు మాట్లాడేస్తున్నాయి. అమెజాన్ పాలీ అందుకు ఉదాహరణ.

మనిషి తన తెలివినంత జోడించేసి యంత్రాలను తెలివైన వాటిగా మార్చేస్తున్నాడు. ఒకప్పుడు మనం చెప్పినట్టు చేసే యంత్రాలు.. ఇప్పుడు అవి చెప్పినట్టు మనం నడుచుకునేలా మారిపోతున్నాయి. రోబోలొస్తున్నాయి. ఇప్పటిదాకా కార్లను మనమే నడుపుకుంటూ వెళ్లాలి. మనిషి కళ్లు.. కాళ్లకు, చెవులు..చేతులకు పనిలేకుండా ఆటోమేటిక్ కార్లొచ్చేస్తున్నాయి. ఇప్పుడిప్పుడే రోడ్లపైకి ఎక్కుతున్నాయి.

....కారణం, కృత్రిమ మేధ. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. చిన్నగా చెప్పుకోవాలంటే ఏఐ. ఏ భాష అయితేనేం ఇప్పుడంతా ఏఐ యుగమే. ముమ్ముందు అది మరింత పెరిగిపోతుంది. ఇప్పటికే చాలా టెక్నాలజీ కంపెనీలు, ఫార్మా సంస్థలు, ఇన్సూరెన్స్ ఏజెన్సీ, కార్ల కంపెనీలు, మొబైల్ ఫోన్ల సంస్థలు ఈ టెక్నాలజీని విచ్చలవిడిగా వాడేస్తున్నాయి. మామూలు ఐవీఆర్ఎస్/ఆటోమేటెడ్ కాల్‌తో పోలిస్తే అమెజాన్ పాలిలో సాఫ్ట్‌వేర్ ఆ మెసేజ్‌ను అప్పటికప్పుడు జనరేట్ చేస్తుంది. దానికి తగినట్టు స్పందిస్తుంది. ఉదాహరణకు ఇన్సూరెన్స్ తీసుకుంటున్నప్పుడు మనం పెట్టే డాక్యుమెంట్లన్నింటినీ అది స్కాన్ చేస్తుంది. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. డాక్యుమెంట్లు ఏవైనా లోపించినా, అదనంగా ఏమైనా కావాల్సినా కంపెనీ తరఫున అదే కాల్ చేస్తుంది. కావాల్సిన విషయాన్ని చెబుతుంది. నిజానికి ఇంతకుముందు ఇదంతా కూడా ఓ మనిషి చేసే పని. ఇప్పుడు ఏఐ ఆక్రమించేసింది. ఇన్సూరెన్స్ కంపెనీలకు ఏజెన్సీలా పనిచేసే పాలసీబజార్ సంస్థ తన ఐవీఆర్ కాలింగ్ సర్వీస్ 'పీబీ కనెక్ట్'లో అమెజాన్ పాలిని పెట్టింది. కస్టమర్లతో అదే డీల్ చేసేస్తోంది. ''పీబీ కనెక్ట్ నుంచి వెళ్లే కాల్స్‌లో 80 శాతం అమెజాన్ పాలి నుంచి చేస్తున్నవే. సర్వీస్ పట్ల చాలా మంది అనుకూలంగా ఉన్నారు. ఇన్సూరెన్స్ ఏజెంట్లు లేకుండానే 41 శాతం ఇన్సూరెన్సులు అమ్ముడవుతున్నాయి'' అని పాలసీబజార్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ ఆశిష్ గుప్తా చెప్పారు.

స్వేచ్ఛగా పని

క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీసులిచ్చే కంపెనీలు మెషీన్ లెర్నింగ్ సామర్థ్యంపైనే దృష్టి పెడుతున్నాయి. తద్వారా బిజినెస్‌ను పెంచుకోవాలనుకుంటున్నాయి. డెవలపర్లు తమ అప్లికేషన్లను మరింత తెలివైన వాటిగా మార్చేస్తున్నారు. టెక్స్ట్, ఫొటోలు, వీడియోలను మరింత క్షుణ్ణంగా పరిశీలించి కచ్చితత్వంతో విశ్లేషించేలా వాటికి పదును పెడుతున్నారు. డేటా సైంటిస్టులతో మెషీన్ లెర్నింగ్ సామర్థ్యాన్ని మరింత సానబెట్టిస్తున్నామని, భవిష్యత్తులో మరింత స్వేచ్ఛగా వాటితోనే పనిచేయిస్తామని అమెజాన్ వెబ్‌సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) ఆసియా పసిఫిక్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ హెడ్ ఆలివియర్ క్లెయిన్ చెప్పారు. పెద్దగా కుస్తీ పట్టకుండానే ఈ మెషీన్ లెర్నింగ్‌ను ఏ డెవలపరైనా వాడుకోవచ్చని, వాటికి శిక్షణ కూడా ఇవ్వాల్సిన అవసరం ఉండదని ఆయన చెప్పారు. ఒక్క ఏడాదిలో ఏడబ్ల్యూఎస్ దాదాపు 200 మెషీన్ లెర్నింగ్‌లను ప్రారంభించింది. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంక్, అడోబి, బీఎండబ్ల్యూ, కాథే పసిఫిక్, డోజోన్స్, ఫార్ములా వన్, జాన్సన్ అండ్ జాన్సన్ సహా పలు ప్రఖ్యాత సంస్థలు వాటిని వాడుకుంటున్నాయి.



- అమెజాన్ నుంచి ఏడాదిలో 200 ఏఐ ఆపరేషన్స్
- ఇన్సూరెన్స్, మాట్రిమొని, ఫార్మా, టెక్నాలజీ రంగాల్లో ఎక్కువగా వినియోగం

ఇంకా చాలా టైం ఉంది

ప్రతి రంగంలోనూ ఏఐ హవా నడుస్తోంది కదా. దాని వల్ల చాలా మంది ఉద్యోగాలు పోతున్నాయ్. మనుషులు చేసే పనులన్నింటినీ మెషీన్లు చేసేస్తున్నాయి. ముమ్ముందు ఉద్యోగాలను ఏఐ ఆక్రమించేస్తుందన్న ఆందోళన ఉంది. అయితే, అంత ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్నారు యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా లాస్‌ఏంజిలిస్ సైంటిస్టులు. ఏఐకి చాలా చాలా పరిమితులున్నాయని చెబుతున్నారు. ఏఐని ఈజీగా మోసం చేయొచ్చని, డీప్ లెర్నింగ్ న్యూరల్ నెట్‌వర్క్‌ను మాయ చేయొచ్చని అంటున్నారు. దానిని ప్రయోగాత్మకంగా నిరూపించినట్టు చెప్పారు. జంతువులు, వస్తువుల కలర్ ఫొటోలతో వీజీజీ19 అనే న్యూరల్ నెట్‌వర్క్‌కు పరీక్ష పెట్టామని, అందులో 40 వస్తువుల్లోని ఐదింటినే అది కరెక్ట్‌గా గుర్తించిందని చెప్పారు. కాబట్టి ఇప్పుడప్పుడే ఏఐ అంత నమ్మదగినది కాదన్నారు. మనుషుల ఉద్యోగాలను అవి రీప్లేస్ చేయాలంటే ఇంకా చాలా టైం ఉందన్నారు.

తక్కువ ఖర్చుతో..

అమెజాన్ సేజ్‌మేకర్.. చాలా కంపెనీలు ఎక్కువగా వాడుతున్న ఓ రకమైన మెషీన్ లెర్నింగ్. తక్కువ ఖర్చుతో ఎక్కువ శ్రమ లేకుండా ప్రొడక్షన్ మోడళ్లను దీనితో ఈజీగా తయారు చేసేస్తున్నారట. డేటాను సిద్ధం చేయడం, సరైన ఆల్గారిథంను గుర్తించడం, శిక్షణనివ్వడం, కచ్చితమైన ప్రెడిక్షన్స్‌తో పని చేస్తుండడం వల్ల తమ వర్క్‌ప్లేస్‌లో దీన్ని పెట్టేసుకుంటున్నారు. ప్రముఖ ఫార్మా కంపెనీ జీఈ హెల్త్‌కేర్ దీనిని వాడుకుంటోంది. ఏడబ్ల్యూఎస్ ప్లాట్‌ఫాంలో సేజ్‌మేకర్‌ను వాడుకుంటూ జీఈ హెల్త్ క్లౌడ్‌ను రన్ చేస్తోంది.

గార్డియన్.. ప్రయాణికులకు గార్డ్

డ్రైవర్ లేకుండా వెళ్లే కార్లు ఇప్పుడిప్పుడే రోడ్డెక్కుతున్నాయి. ఏఐతో పనిచేసే ఆ కార్ల వల్ల కొన్ని కొన్ని యాక్సిడెంట్లు జరిగాయి. దీంతో వాటిపై విమర్శలొచ్చాయి. కానీ, తమ 'గార్డియన్'తో అలాంటి ప్రమాదాలేవీ జరగవంటోంది టయోట. అటానమస్ బ్యాకప్ సిస్టమ్‌తో రూపొందించిన ఈ కారు.. ప్రమాదాలను దూరం చేస్తుందని సంస్థ తెలిపింది. అంటే డ్రైవింగ్ మొత్తం కారు అధీనంలోనే ఉన్నా, ప్రమాదాల టైంలో మాత్రం ముందే పసిగట్టి డ్రైవర్‌ను హెచ్చరిస్తుందని, అప్పుడే డ్రైవరే స్పందించాల్సి ఉంటుందని పేర్కొంది. కొన్నికొన్ని సందర్భాల్లో తీవ్రతను బట్టి అదే తనంతట తానే స్పందిస్తుందని చెప్పింది. వీలైనన్ని ఎక్కువ ప్రాణాలను కాపాడడమే తమ లక్ష్యమని కంపెనీ తెలిపింది. అమెరికా లాస్‌వేగాస్‌లో నిర్వహిస్తున్న కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ షోలో ఈ కారును సంస్థ ప్రదర్శనకు పెట్టింది.



రికగ్నిషన్..

రాతలు (టెక్స్ట్), ఫొటోలు, మనుషులు, అనవసర కంటెంట్‌ను గుర్తించేందుకు అమెజాన్ రికగ్నిషన్ అనే మరో అప్లికేషన్ ముందు వరుసలో ఉంది. ఆన్‌లైన్ మాట్రిమోనియల్ (పెళ్లి) సైట్లు దీన్ని వాడుకుంటున్నాయి. దీన్ని పెట్టాక అందులో రిజిస్టర్ చేసుకుంటున్న వారి వివరాలు, ఫొటోలను ఉద్యోగులతో కాకుండా దీంతోనే రివ్యూ చేసేస్తున్నారు. అంతేకాదు, మిస్సయిన వ్యక్తులను పట్టుకోవడానికీ ఈ అమెజాన్ రికగ్నిషన్‌ను వాడుతున్నారు. గత ఏడాది జూన్‌లో ఫేస్ సెర్చ్ అనే ఆప్షన్‌ను అందులో పెట్టింది. దాని వల్ల డేటాబేస్‌లోని పిల్లలు, పెద్దల మొహాలను ఇది గుర్తిస్తుంది. డేటాను సేఫ్‌గా ఉంచేందుకు అమెజాన్ మేసీ అనే మరో ఏఐ టూల్ ఉంది. డేటాకుండే రిస్క్, అనుమానిత కార్యకలాపాలను గుర్తించి వెంటనే అప్రమత్తం చేస్తుందిది. ఒక్కటేమిటి.. ఇలాంటివి చాలానే మార్కెట్లో ఉన్నాయి. అవి తెలివిగా మారుతూ పనిని మరింత సులభం చేసేస్తున్నాయి.



రాజకీయ మకిలి కడిగేసుకుంటున్నా

- ఉత్కళ్ వర్సిటీలో మాజీ ఎంపీ నారాయణ సాహు పీహెచ్‌డీ

భువనేశ్వర్: మొన్నామధ్య కేరళలో 96 ఏళ్ల ఓ భామ బడిలో పాఠాలు చదివింది. అందరిని తనవైపు తిప్పుకునేలా చేసింది. చదువుకు వయసుతో పనిలేదని నిరూపించింది. ఇప్పుడిదంతా ఎందుకూ అంటే.. అసెంబ్లీలో, పార్లమెంట్‌లో రాజకీయ నాయకుడిగా ఎన్నెన్నో పాఠాలు నేర్చిన మాజీ ఎంపీ నారాయణ సాహు ఇప్పుడు కాలేజీ గడప తొక్కి విద్యార్థి అవతారం ఎత్తారు. 81 ఏళ్ల వయసులో 30ల్లో ఉన్న విద్యార్థులతో కలిసి పాఠాలు చదువుతున్నారు. ఉత్కళ్ వర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. హాస్టల్‌లోని చిన్న గదిలో ఉంటూ చదువుకుంటున్నారు. రాజకీయాల్లో పట్టిన మకిలీని విద్యార్థిగా కడిగేసుకుంటున్నానని ఆయన చెప్పారు. రాజకీయాల్లోకి వెళ్లినప్పుడు అంతా బాగానే ఉన్నా, కుళ్లు రాజకీయాలు చూసి చాలా బాధేసిందని, అందుకే వాటిని వదిలేశానని ఆయన చెప్పారు. రావెన్షా యూనివర్సిటీ నుంచి 1963లో ఆర్థిక శాస్త్ర డిగ్రీని పొందిన ఆయన, 2011లో ఉత్కళ్ యూనివర్సిటీ నుంచి పీజీ పట్టా పందారు. 2012లో ఫిలాసఫీలో ఎంఫిల్ చేశారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా, 1980లో ఎంపీగా ఎన్నికయ్యారు.

నేల కొట్టుకుపోయింది.. జీవం పుట్టింది

లండన్: ఇప్పుడు భూమ్మీద మనిషి హాయిగా జీవిస్తున్నాడంటే దానికి కారణం 'మృత్తికా క్రమక్షయం (మట్టి కొట్టుకుపోవడం)' అని సైంటిస్టులు తేల్చారు. 70 కోట్ల ఏళ్ల క్రితం భూపటలంపైన మట్టి భారీగా కొట్టుకుపోయిందని, దాని వల్లే భూమిపై జీవరాశి నివసించేందుకు అనువైన వాతావరణం ఏర్పడిందని బ్రిటన్‌లోని సౌతాంప్టన్ యూనివర్సిటీ సైంటిస్టులు చెబుతున్నారు. నియోప్రొటెరోజోయిక్ యుగంలో మట్టి భారీగా సముద్రంలో కొట్టుకుపోయిందని తేల్చారు. నిజానికి ఆస్టరాయిడ్స్ ఢీకొట్టడంతో భూమిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయన్న వాదనలో నిజం లేదని, దానికి సంబంధించిన రాతి ఆనవాళ్లు లేనేలేవని, మృత్తికా క్రమక్షయం జరిగిందనడానికి ఇదే పెద్ద ఆధారం అని సైంటిస్టులు తెలిపారు.



బురద నేలే బెడ్డు.. బాత్రూంలే బెడ్రూంలు

- ఫిలిప్పీన్స్ జైళ్లలో ఖైదీల పరిస్థితి దయనీయం
- 170 మంది ఉండాల్సిన స్థలంలో 528 మంది

ఫిలిప్పీన్స్ జైళ్లలో ఖైదీల పరిస్థితి దయనీయంగా తయారైంది. టాయిలెట్లు, బాత్రూంలే బెడ్రూంలు, బురద నేలే బెడ్డు, అట్టముక్కలే బెడ్‌షీట్లయ్యాయి. కిటికీల్లేని చిన్న టాయిలెట్ గదుల్లో ఆరుగురు ఉండాల్సిన పరిస్థితి. ఈమధ్య మనీలాలోని జైల్లో ఓ రాత్రి 170 మంది పట్టే స్థలంలో 518 మందిని కుక్కేశారు. అందులోని ఖైదీల పరిస్థితి మాటల్లో చెప్పలేం. ఉక్కపోత మధ్య ఒకరి కాళ్లు ఇంకొకరి పొట్టపై, ఒకరి తల మరొకరి తొడల మధ్య పెట్టి దగ్గరదగ్గర ముడుచుకుని పడుకోవాల్సి వచ్చింది. ఆ దేశ అధ్యక్షుడు రోడ్రిగో దుతర్తే డ్రగ్ మాఫియాపై ఉక్కుపాదం మోపడంతో 2016 నుంచి ఎక్కడికక్కడ అరెస్టులు పెరిగిపోయాయి. జైళ్లన్నీ నిండిపోసాగాయి. దీంతో ప్రపంచంలోనే ఎక్కువమంది ఖైదీలున్న జైళ్లుగా ఫిలిప్పీన్స్ జైళ్లు రికార్డుకెక్కాయి. మనీలా లాంటి నగరాల్లోనైతే జైళ్లు, నిద్ర అమూల్యమైన వస్తువులైపోయాయి.

ప్రీ ట్రయల్ ఖైదీలే ఎక్కువ

జైళ్లలో ఖైదీలు పెరగడానికి అరెస్టులొక్కటే కాదు, న్యాయవ్యవస్థలో లోపాలూ కారణమే. జైళ్లలో ఉన్న వారిలో కొందరే దోషులు. చాలా మంది ప్రీ ట్రయల్ ఖైదీలే. ఎందుకంటే కోర్టుల్లో కేసులు పేరుకుపోయాయి. కొన్ని కేసుల్లో తీర్పులొచ్చినా అధికారుల అలసత్వం వల్ల శిక్షాకాలం ముగిసినా ఏళ్లుగా జైళ్లలోనే ఉండాల్సిన పరిస్థితి. అధికారుల అలసత్వం ఎంతలా ఉందో ఓ మైనర్ ఘటనతో ఇట్టే తెలిసిపోద్ది. కొడుకు నపుంసకుడని తల్లిదండ్రులు వదిలేయడంతో ఓ మైనర్ వీధుల్లో కత్తి పట్టుకొని అరుస్తూ తిరగడం మొదలెట్టాడు. దీంతో అతన్ని 2017 ఏప్రిల్‌లో పోలీసులు అరెస్టు చేశారు. అప్పుడతనికి 15 ఏళ్లు. కానీ అధికారులు 18 ఏళ్లని నమోదు చేశారు. కానీ దంతాల పరీక్షలో అతను మైనర్ అని తేలడంతో అరెస్టయిన రెండు నెలల తర్వాత కోర్టు విడుదల చేస్తూ తీర్పునిచ్చింది. కానీ, అతని విడుదలకు సంబంధించి సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ నుంచి జైలుకు 21 నెలలైనా ఆదేశాలు అందలేదు. ఇంతకీ అతనికి పడిన శిక్ష ఎంతో తెలుసా? 15 రోజులు.

ఖైదీలే ఖైదీలకు కాపలా!

ఫిలిప్పీన్స్ న్యాయవ్యవస్థ అనేక లోపాలతో ఇబ్బంది పడుతోందని, లంచాల్లేనిదే పని జరగడం లేదని, కేసుల విచారణ వేగంగా జరగడం రాజ్యాంగ హక్కయినా అమలవడం లేదని ఫిలిప్పీన్స్ సదరన్ ఇల్లినాయిస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రేమండ్ నరగ్ అన్నారు. లాయర్లు, జడ్జిలకు కూడా 'ప్రోత్సాహకాలు' అందుతున్నాయన్నారు. గ్యాంగులు, జైలు అధికారుల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందన్నారు. 'ఫిలిప్పీన్స్ జైల్లో గనక మీరు పడ్డారంటే టార్చర్ తప్పద'ని, ఈ పరిస్థితున్ని మార్చాల్సిన అవసరముందని ఫిలిప్పీన్స్ కమిషన్ ఆన్ హ్యూమన్ రైట్స్ మెంబర్ లియాహ్ చెప్పారు. అయితే జైళ్లలో శాంతి భద్రతలకు ఏమాత్రం ఢోకాలేదని చీఫ్ ఆఫ్ రికార్డ్స్ ఫర్ ద జైల్ కెప్టెన్ జాయ్‌రెక్స్ చెప్పారు. ఖైదీలనే ఖైదీలకు కాపలాగా పెట్టామని, సాధారణంగా అయితే ఇలా చేయకూడదని, కానీ సిబ్బంది లేక తప్పడం లేదన్నారు.

డబ్బుంటే బిందాస్

ఇక ఖైదీల విషయానికి వస్తే డబ్బులుంటే ఇద్దరు ముగ్గురు ఖైదీలుండే ప్లైవుడ్ గోడలు, పరదలతో వేరు చేసిన గదిలో ఉండొచ్చు. లేదంటే నరకం లాంటి గదుల్లో ఉండాల్సిందే. జైళ్లలో ఎక్కువగా డ్రగ్స్ మాఫియా గ్యాంగులే ఉండటంతో వాళ్ల గ్యాంగుల లీడర్లు వాళ్ల మనుషులకు కావాల్సినవి సమకూరుస్తున్నారు. జైల్లోని స్పుత్నిక్ గ్యాంగ్ లీడర్ బుబోయ్ మెండియోలా తన గ్యాంగ్ మెంబర్ల తిండి, ఇతర అవసరాల కోసం తన సొమ్మును ఖర్చుపెడుతున్నాడు. ఈమధ్య అధికారులు జరిపిన ఓ రైడ్‌లో స్పుత్నిక్ గ్యాంగు వద్ద సుమారు రూ.10 లక్షలు పట్టుబడ్డాయి. స్పుత్నిక్ గ్యాంగు మెంబర్ల మధ్య, పక్క గ్యాంగులతో గొడవలు జరగకుండా వాళ్లకు వాళ్లే ఆంక్షలు విధించుకున్నారు. ఎవరైనా గొడవకు దిగితే శిక్ష తప్పదు. గొడవను బట్టి 7 నుంచి 20 సార్లు చెక్క బ్యాటుతో కొడతారు. ఆ బ్యాటుకు ఓవైపు స్పుత్‌నిక్ వన్ అని, మరోవైపు కమాండర్ బుబోయ్ మెండియోలా అని రాసి ఉంటుంది.

8, 9, 10 తరగతుల్లో ఏఐ కోర్స్


వచ్చే ఏడాది నుంచే క్లాసులు.. సీబీఎస్ఈ నిర్ణయం

కాలానికి తగినట్టు సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) కూడా వివిధ తరగతుల్లో కొత్త కోర్సులను పెడుతోంది. వచ్చే ఏడాది నుంచి 8, 9, 10 తరగతుల వారికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సును ప్రవేశపెట్టబోతోంది. విద్యార్థుల మెరుగైన భవిష్యత్ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే, ఇది ఆప్షనల్ సబ్జెక్ట్ మాత్రమే. అంటే, ఇష్టమున్న వారు ఈ సబ్జెక్ట్‌ను ఎంచుకోవచ్చు. లేదంటే మామూలు సబ్జెక్టులతోనే చదువుకోవచ్చు. ఇటీవల నిర్వహించిన నీతి ఆయోగ్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆ నిర్ణయానికి సీబీఎస్ఈ ఆమోదం తెలిపినట్టు చెబుతున్నారు. సబ్జెక్టును బోధించడానికి అవసరమైతే స్కూళ్లకు సీబీఎస్ఈ సాయం చేస్తుందని సీబీఎస్ఈ సభ్యుడు చెప్పారు.

కాళ్లున్న కార్లు



మీరు స్టార్ వార్స్ మూవీ చూశారా? అందులో కార్లు రయ్ రయ్ మంటూ దూసుకెళ్లడం మానేసి, కొండలపై వాకింగ్ చేస్తూ వెళ్తాయ్! ఆ గ్రాఫిక్ ఊహకు జంతువులు, పాములే ప్రేరణగా హ్యుందాయ్ ప్రాణం పోసింది. లాస్ వేగాస్‌లో జరుగుతున్న సీఈఎస్ ఈవెంట్‌లో వాటిని ప్రదర్శించింది. ఎత్తైన ప్రదేశాలను ఈజీగా ఎక్కేయడం, 5 అడుగులు ఎత్తుండే గోడలపై నుంచి జంప్ చేయడం, మెట్లపైకి గబగబ ఎక్కేసి పాసింజర్లను తీసుకెళ్లే సామర్థ్యం ఉన్న దీనికి ''ఎలివేట్'' అని పేరు పెట్టారు. సునామీలు, భూకంపాల సమయంలో శిథిలాలపై ఎక్కి బాధితులను రక్షించడానికిఉపయోగపడుతుందని తెలిపింది. దివ్యాంగులు మెట్లు దిగే పని లేకుండా, పైకి వెళ్లి వాళ్లని ఎక్కించుకుని గమ్యస్థానంలో భద్రంగా దిగబెడుతుందని వివరించింది. అవసరానికి తగినట్టు కాళ్లను లోపలికి ముడుచుకోవడం, చక్రాలుగా మార్చడం, స్తంభాల్లా మార్చి ఐస్‌లో నడవడం వంటివి అలవోకగా చేస్తుందట. వీటికి వెపన్స్‌ను జత చేయడం ద్వారా కొండ, మంచు ప్రాంతాల్లో బలగాలూ వాడుకోవచ్చు.



నేషనల్ ఫిష్‌కు ఉప్పు నీటి దెబ్బ

జాతీయ జలచరం గంగా డాల్ఫిన్లకు పెద్ద ప్రమాదం వచ్చి పడింది. సుందర్బన్ మడ అడవుల గుండా ప్రవహించే హుగ్లీ నది నీళ్లు ఉప్పగా మారుతున్నాయట. ఐదేళ్లుగా ప్రతి సీజన్‌లోనూ నది నీళ్లను పరీక్షించగా ఈ విషయం బయటపడింది. సుందర్బన్ గుండా నది వెళ్తున్న 97 కిలోమీటర్ల పొడవునా ఒక్కటంటే ఒక్క గంగా డాల్ఫిన్ కూడా కనిపించలేదని సైంటిస్టులు సంగీత మిత్రా, మహువా రాయ్ వెల్లడించారు. ఉప్పు నీటి బెడదతో అవి తమ ఇళ్లను వదిలేసి, వేరే ప్రాంతాలకు వలస పోతున్నాయని, కొన్ని చోట్లనీళ్లలో మార్పుల్ని తట్టుకోలేక ప్రాణాలు వదులుతున్నాయని పేర్కొన్నారు. హుగ్లీ నదిలో నీళ్ల లవణీయత 10 పీపీటీ(పార్ట్స్ పర్ ట్రిలియన్) ఉన్నట్లు చెప్పారు. గంగా, బ్రహ్మపుత్ర, మేఘన, కమాపులి, సంగు నదుల్లో మంచినీళ్ల డాల్ఫిన్లు ఎక్కువగా కనిపిస్తాయి.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.